శుక్రవారం
2-5-2025
హైదరాబాద్ ప్రచురణ
సంపుటి : 09, సంచిక : 220
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Hyderabad, Vijayawada, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

యుద్ధం జరగొచ్చు: ఫరూఖ్ అబ్దుల్లా

న్యూఢిల్లీ: భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధం జరిగే అవకాశం లేకపోలేదని నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూఖ్ అబ్దుల్లా వ్యాఖ్యానించారు. పహల్గాంలో ఉగ్ర చర్యను తీవ్రంగా ఖండించారు. పహల్గాం ఉగ్రదాడి జరగడానికి కారణమైన ఉగ్రవాదులు, దాని వెనక ఉన్న వారిని వీలైనంత తొందరగా పట్టుకుంటేనే యుద్ధం నివారించేందుకు వీలు ఉంటుందన్నారు. పాకిస్థాన్ ఈ ప్రాంతాన్ని అస్థిరపరిచేందుకు యత్నిస్తోందని, యుద్ధాన్ని నివారించే దిశగా ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. భద్రతా, ఇంటెలిజెన్స్ లోపాలు కూడా ఉగ్రదాడికి కారణమనడంలో సందేహం లేదని ఫరూఖ్ అబ్దుల్లా అన్నారు.

సీఐఎస్‌సీగా అశుతోష్ బాధ్యతల స్వీకరణ

న్యూఢిల్లీ: ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్ చీఫ్ (సీఐఎస్‌సీ)గా ఎయిర్ మార్షల్ అశుతోష్ దీక్షిత్ బాధ్యతలు స్వీకరించారు. గురువారం న్యూఢిల్లీలోని ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో దీక్షిత్ బాధ్యతలు చేపట్టారు. దాదాపు నాలుగు దశాబ్దాల విశిష్ట సేవ తర్వాత ఏప్రిల్ 30న పదవీ విరమణ చేసిన లెఫ్టినెంట్ జనరల్ జేపీ మాథ్యూ స్థానంలో ఆయన నియమితులయ్యారు. డిసెంబర్ 6, 1986న భారత వైమానిక దళం

- మిగతా 2 లో

120కి పైగా టెలిగ్రామ్, ఇన్‌స్టా ఛానళ్లపై చర్యలు

న్యూఢిల్లీ: వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే నీట్(యూజీ) పరీక్షకు సంబంధించి అసత్య ప్రచారం చేస్తున్న వారిపై ఎన్‌టీఏ చర్యలు చేపట్టింది. ఈ పరీక్షపై తప్పుదారిపట్టించే సమాచారాన్ని ఆన్‌లైన్‌లో ప్రచారం చేస్తున్న దాదాపు 120కి పైగా సామాజిక మాధ్యమ ఖాతాలు గుర్తించి... కేసులు నమోదు చేసినట్లు సమాచారం. వీటిలో 106 టెలిగ్రామ్, 16 ఇన్‌స్టాగ్రామ్ ఛానళ్లు ఉన్నట్లు ఎన్‌టీఏ వర్గాలు పేర్కొన్నాయి. ఈ ఛానళ్లపై తదుపరి దర్యాప్తు కోసం కేసులను కేంద్ర హోంమంత్రిత్వ శాఖ

- మిగతా 2 లో

రికార్డుస్థాయిలో జీఎస్టీ వసూళ్లు

న్యూఢిల్లీ: వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లలో సరికొత్త రికార్డు నమోదైంది. ఏప్రిల్‌లో రూ.2.37 లక్షల కోట్లు జీఎస్టీ రూపంలో వసూలైనట్లు కేంద్రం గురువారం వెల్లడించింది. గతేడాది ఏప్రిల్‌లో ఈ మొత్తం రూ.2.10 లక్షల కోట్లుగా ఉంది. ఇప్పటి వరకు ఇదే అత్యధికం కాగా... తాజాగా ఆ రికార్డు బద్దలైంది. 2017 జులై 1 నుంచి జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత అత్యధిక వసూళ్లు నమోదైన నెలగా 2025 ఏప్రిల్ నిలిచింది. గతేడాది ఏప్రిల్‌తో పోలిస్తే జీఎస్టీ వసూళ్లు 12.6 శాతం మేర పెరగడం విశేషం. అంతకుముందు నెలలో (మార్చి) జీఎస్టీ వసూళ్లు

- మిగతా 2 లో

కార్మికుల చెమట చుక్కలే

అభివృద్ధికి బాట

- ఎన్ని విప్లవాలొచ్చినా శ్రమజీవుల ఉద్యమం ప్రత్యేకం
- నిరుద్యోగ సమస్య పరిష్కారంలో దేశంలోనే ముందంజ
- రూ.లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం కూలింది
- 8.28 లక్షల కోట్లు అప్పపెట్టి వెళ్లారు
- ఆర్టీసీని కాపాడుకోవాల్సింది మీరే
- ప్రతిపక్ష నేతల వల్లో పడొద్దు
- అవార్డుల ప్రదానోత్సవంలో సీఎం రేవంత్

విశాలాంధ్ర - హైదరాబాద్: కార్మికుల చెమట చుక్కలే ప్రపంచ అభివృద్ధికి బాటలు వేస్తున్నాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా గురువారం రవీంద్ర భారతిలో శ్రమశక్తి, ఉత్తమ యాజమాన్య అవార్డుల ప్రధానోత్స కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన సీఎం మాట్లాడుతూ... ప్రపంచంలో ఎన్ని విప్లవాలు వచ్చినా కార్మికుల ఉద్యమం ప్రత్యేకమన్నారు. తెలంగాణ సాధనలో సింగరేణి, ఆర్టీసీ, విద్యుత్, అసంఘటిత కార్మికుల పాత్ర మరువలేనిదని కొనియాడారు. తెలంగాణలో కార్మికులను ఆదుకునేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కరించడంలో దేశంలోనే తెలంగాణ ముందు వరుసలో ఉందంటే మీ సహకారం ఎంతో ఉందని పేర్కొన్నారు. సింగరేణి కార్మికులకు లాభాలలో వాటా ఇచ్చి బోనస్ అందజేసిన ఘనత ప్రజా ప్రభుత్వానిదే అన్నారు. పదేళ్ల నిర్లక్ష్యంతో విద్యుత్ వ్యవస్థ కుప్ప కూలే పరిస్థితి వచ్చిందని దుయ్యబట్టారు. ఒక పద్ధతి ప్రకారం ఆర్టీసీలో కారుణ్య నియామకాలు చేపట్టామని చెప్పారు. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని, కార్మికులకు మేలు చేయడమే తమ ప్రభుత్వ విధానమని సీఎం స్పష్టం చేశారు. అసంఘటిత కార్మికుల కోసం గిగ్ వర్కర్స్ పాలసీని త్వరలో తీసుకురాబోతున్నామని వెల్లడించారు. గత ప్రభుత్వం కార్మికులపై వివక్ష చూపిందని, ఆర్టీసీ కార్మికుల సమ్మెను అణచివేసి 50మంది కార్మికులను పొట్టన పెట్టుకున్నారని మండిపడ్డారు. ఆర్టీసీ సమ్మెపై చర్చలు జరుగుతున్నాయని, కార్మికులు సమ్మె ఆలోచన వీడాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పుడిప్పుడే ఆర్టీసీ లాభాల బాటలో పయనిస్తోందని, దీన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మీపైనే ఉందని పేర్కొన్నారు. గత పాలకులు రూ.50 వేల కోట్లు కాంట్రాక్టర్లకు బిల్లులు పెండింగ్ పెట్టారని, రూ.లక్షా 20 వేల కోట్లు ఇతర విభాగాల్లో పెండింగ్ పెట్టి వెళ్లారని ఆరోపించారు. చివరకు సర్పంచులకు బకాయిలు వారి ఘనకార్యమే అన్నారు. మేం అధికారం చేపట్టే నాటికి రూ. 8.29 లక్షల కోట్లు అప్పు పెట్టి వెళ్లారని, లక్ష కోట్లు పెట్టి కట్టిన కాళేశ్వరం మూడేళ్లకే కూలిందని విమర్శించారు. పంతాలు, పట్టింపులకు పోవద్దని... సమస్య ఉంటే మంత్రితో చర్చించండని సూచించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదని, ఒకసారి ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. పదేళ్లు ఏమీచేయని వాళ్లు చెబితే వాళ్ల వలలో పడొద్దని, వారి విషపు చూపుల్లో చిక్కుకోవద్దని సూచించారు. కేసీఆర్ చేసిన గాయాన్ని ప్రజలు ఇంకా మరిచిపోలేదని, అసెంబ్లీకి మీరు పంపిన పిల్లలు ఇష్టారీతిన

- మిగతా 2 లో

తెలంగాణ కులగణన

దేశానికే రోల్ మోడల్

మా ఒత్తిడి మేరకే కేంద్రం ఆమోదం: రేవంత్

కులగణనపై కాంగ్రెస్ పార్టీ గల్లీ స్థాయి నుంచి ఢిల్లీ స్థాయి వరకు గళం వినిపించిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు.

2 లో

బీహార్ ఎన్నికల కోసం

రాజకీయమా?

కుల-జనగణన షెడ్యూల్ ప్రకటించాలి: రాజా



న్యూఢిల్లీ: కులగణనను రాజకీయ అంశంగా మలిచి బీహార్ ఎన్నికల్లో లబ్ది పొందేందుకు బీజేపీ యత్నిస్తోందని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా విమర్శించారు. ప్రతిపక్ష పార్టీల సుస్థిర రాజకీయ ఉద్యమ ఫలితంగా కులగణనను కేంద్రం ప్రకటించిందన్నారు. కుల గణన, జన గణన షెడ్యూల్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగబోయే ముందు కులగణనను ప్రకటించడం వెనుక మోదీ సర్కారు ఉద్దేశం ఏమిటని రాజా ప్రశ్నించారు. కులగణన ఎప్పటిలోగా చేపడతారో చెప్పాలన్నారు. బీహార్ ఎన్నికల కోసం కులగణనను రాజకీయాంశంగా మార్చాలన్నదే బీజేపీ ఆలోచనగా కనిపిస్తోందని దుయ్యబట్టారు. ప్రతిపక్ష పార్టీల నుంచి తీవ్ర ఒత్తిడి, ప్రజల నుంచి పెరుగుతున్న డిమాండ్‌తో కులగణనపై మోదీ సర్కారు దిగి వచ్చిందని అన్నారు. కులగణన ఆలోచనను విమర్శిస్తూ, దీర్ఘకాలంగా వ్యతిరేకిస్తూ... బీహార్ అసెంబ్లీ ఎన్నికల ముందు ప్రకటించడంతో మోదీ ప్రభుత్వం దీనిని రాజకీయం చేస్తుందా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయని రాజా అన్నారు. 'సీపీఐ సహా వామపక్షాలు, కాంగ్రెస్‌తో పాటు లౌకిక - ప్రజాస్వామ్య- ప్రగతిశీల పార్టీలు చాలాకాలంగా కులగణన కోసం డిమాండ్ చేస్తున్నాయి. దీనిని బీజేపీ ఇప్పటివరకు వ్యతిరేకించింది. ప్రజల మద్దతు, ప్రతిపక్ష పార్టీల పట్టుదలతో తలొగ్గింది. బీహార్ ఎన్నికల దృష్ట్యా కులగణనను రాజకీయం చేయొచ్చని బీజేపీ భావిస్తున్నది. కులగణన ఎప్పుడు చేపడతారన్నదే మా ప్రశ్న. నిర్దేశిత గడువును వెంటనే ప్రకటించాలి. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్‌లు ఎందుకు లేవో మోదీ ప్రభుత్వం వివరణ ఇవ్వాలి. రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని న్యాయస్థానాల్లో సవాల్ చేయాలి' అని రాజా అన్నారు. శాస్త్రీయ పద్ధతిలో కులగణన భారత్‌లో నిజమైన సామాజిక వాస్తవికతను ప్రతిబింబిస్తుందని, దీని ఆవశ్యకత, ప్రాధాన్యతపై సీపీఐ ఎప్పటి నుంచో అవగాహన కల్పిస్తోందని చెప్పారు. బీహార్, తెలంగాణ రాష్ట్రాల్లో కులగణనకు సీపీఐ సంపూర్ణ మద్దతు ఇచ్చిందని, బీజేపీ దాడులను ఎదుర్కొన్నదని గుర్తుచేశారు. జనగణనపై అకారణ తీవ్ర జాప్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. '2021లో జరగాల్సిన జనగణన ఇప్పటివరకు జరగలేదు. జనగణనకు గడువు నిర్దేశించలేదు. ఈ కారణంగా పాత డేటా ఆధారంగానే విధానపరమైన నిర్ణయాలు జరుగుతున్నాయి' అని రాజా అన్నారు. జనగణన ఎప్పుడు జరుగుతుందో షెడ్యూల్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగంలో ఉద్యోగావకాశాలు పెంచాలని, సంస్థాగత అవరోధాలు తొలగించాలని, రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని ఎత్తివేయాలని సీపీఐ డిమాండ్ చేస్తోందన్నారు. సామాజిక న్యాయం, ప్రజాస్వామిక డేటా వ్యవస్థలు, సమాన ప్రాతినిధ్యం కోసం పోరాటాన్ని ఉధృతం చేస్తుందని రాజా వెల్లడించారు.

సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేస్తాం

మంత్రులు ఉత్తమ్, జూపల్లి

విశాలాంధ్ర - హైదరాబాద్: మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లా సాగునీటి ప్రాజెక్టులను అత్యంత ప్రాధాన్యతగా గుర్తించి త్వరితగతిన పూర్తి చేస్తామని మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు అన్నారు. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్ట్‌లో ప్రధాన భాగమైన నార్లాపూర్ రిజర్వాయర్ పంప్ హౌస్, ప్యాకేజీ -2 ఓపెన్ కెనాల్, హాత్మాగాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ లిఫ్ట్ -1, వనపర్తి జిల్లా రెవల్లి మండలం ఎదుల రిజర్వాయర్, స్టేజ్ -2, కోడేరు మండలం తీగలపలిలో పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టు పంప్ హౌస్, సొరంగం, కాల్వ నిర్మాణ పనులను గురువారం మంత్రులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మంత్రులు మాట్లాడుతూ ఇరిగేషన్ ప్రాజెక్టుల సమస్యల పరిష్కారం, అవాంతరాలను తొలగించడానికి తాము ప్రాజెక్ట్ లను సందర్శించినట్లు చెప్పారు. మహాత్మాగాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, నెట్టెంపాడు, బీమా, కోయిల్ సాగర్ ప్రాజెక్ట్ లను పూర్తి చేయడంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శిం చారు. 2026, మార్చి నాటికి నూరుశాతం పనులను పూర్తి చేయడానికి చర్యలు తీసు కోనున్నట్లు వెల్లడించారు. నార్లాపూర్, ఏదుల, వట్టెం, కరివేన రిజర్వాయర్లలో 50 టీఎంసీల నీటిని నింపడానికి ఆరు నెలల సమయం పెట్టుకొని, ఏంఏం పనులు చేయాలో... ఉద్దండాపూర్ రిజర్వాయర్ నింపడానికి 2026 మార్చి వరకు నిర్దిష్ట గడువును నిర్దేశించుకుని ప్రణాళికబద్ధంగా పనులను వేగవంతం చేసి రైతులకు సాగు నీటిని అందించేలా చర్యలు తీసుకుంటా మని వివరించారు. మహాత్మాగాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం మొదటి లిఫ్టులో నిరుపయోగంగా ఉన్న రెండు మోటార్లను రెండు

- మిగతా 2 లో

కార్మికవర్గాన్ని రక్షించేది ఎర్రజెండానే

ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే ఏకైక పండుగ మే డే

అమరవీరుల స్ఫూర్తితో హక్కుల కోసం పోరాడాలి: కూనంనేని

విశాలాంధ్ర బ్యూరో - కొత్తగూడెం: చికాగో అమరవీరుల స్ఫూర్తితో కార్మిక వర్గం రాజ్యాధికారం కోసం నిరంతరం పోరాడాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. సామ్రాజ్యవాదుల చేతిలో మగ్గుతున్న కార్మిక వర్గాన్ని రక్షించుకునే ఏకైక మార్గం ఎర్రజెండానే అన్నారు. ఎక్కడైతే కమ్యూనిస్టులు బలపడతారో అక్కడే కార్మిక కర్షకవర్గాలకు సామాజిక న్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. మే డే సందర్భంగా గురువారం నియోజకవర్గ పరిధిలోని కార్మిక క్షేత్రాలు, కార్మిక వాడలు, ఉద్యోగ క్షేత్రాలు, బస్తీలు, గ్రామాల్లో ఎర్రజెండా రెపరెపలాడింది. సీపీఐ... దాని అనుబంధ ప్రజాసంఘాలు, ఏఐటీయూసీ అనుబంధ కార్మిక సంఘాల అధ్వర్యంలో 283 కేంద్రాల్లో మేడే ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పార్టీ కార్యాలయాలు, విద్యానగర్ బైపాస్ రోడ్డు, ఆటో, హమాలీ, సింగరేణి ప్రధాన కార్యాలయం, రైతుబజార్, భవన నిర్మాణ కార్మికుల అడ్డా తదితర ప్రధాన సెంటర్లలో కూనంనేని మేడే జెండా ఆవిష్కరించారు, చికాగో అమరవీరులకు నివాలులర్పించారు.

కూనంనేని మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే ఏకైక పండుగ మేడే అని అన్నారు. 1886లో అమెరికాలోని చికాగో నగరంలో ఎనిమిది గంటల పనివిధానంకోసం జరిగిన సమ్మె సందర్భంగా పాలకులు, యాజమాన్యం జరిపిన కాల్పుల్లో మరణించిన కార్మికుల రక్తంతో తడిసిందే ఈ ఎర్రజెండా అని గుర్తు చేశారు. వారి అమరత్వంతోనే ఎనిమిది గంటల పనివిధానంతోపాటు అనేక కార్మిక చట్టాలు, హక్కులు ఏర్పడ్డాయన్నారు. స్వతంత్ర భారతంలో పోరాడి సాధించుకున్న కార్మికుల హక్కులను ప్రధాని మోదీ సారథ్యంలోని బీజేపీ ప్రభుత్వం రద్దు చేసే కుట్రలకు పాల్పడుతోందని విమర్శించారు. దేశ పౌరులను హింసించే ప్రధానిగా మోదీ నిలిచిపోతారన్నారు. లాభాల్లో నడుస్తున్న ప్రభుత్వరంగ సంస్థలను అదాని, అంబానీ వంటి కార్పొరేట్ దిగ్గజాలకు అప్పనంగా కట్టబెడుతున్నాట్టు చెప్పారు. ఆర్థిక నేరగాళ్లకు మోదీ ప్రభుత్వం కొమ్ముకాస్తోందని ఆరోపించారు. కులాలు, మతాలు, ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ పబ్బంగడుకుంటున్నారని మండిపడ్డారు. దేశ ప్రగతికి, ప్రజలకు మోదీ ప్రభుత్వం చేసింది శూన్యమన్నారు. రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని అంతం చేసేలా బీజేపీ వ్యవహరిస్తోందన్నారు. కార్మిక హక్కులు, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం కమ్యూనిస్టు పార్టీ నిర్వహించే పోరాటాల్లో ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె. సాబీర్ పాషా, జిల్లా కార్యవర్గ సభ్యులు దుర్గరాసి వెంకటేశ్వర్లు, చంద్రగిరి శ్రీనివాసరావు, సలిగంటి శ్రీనివాస్, జిల్లా సమితి సభ్యులు వాసిరెడ్డి మురళి, కంచర్ల జమలయ్య, జి. వీరాస్వామి, జి .నగేష్, కందుల భాస్కర్, భూక్యా శ్రీనివాస్, రత్నకుమారి, పాలమూరి శ్రీనివాస్, దీటి లక్ష్మీపతి, బానోత్ గోవిందు, వంగ వెంకట్, అహీమ్, రమణమూర్తి, నిమ్మగడ్డ వెంకటేశ్వర్ రావు, మాచర్ల శ్రీనివాస్, పోరెడ్డి శ్రీనివాసరెడ్డి, ధర్మరాజు, యూసుఫ్, నేరెళ్ల శ్రీనివాస్, బోయిన విజయ్ కుమార్, లక్ష్మి, ధనలక్ష్మి, భాగ్యలక్ష్మి, షాహీన్, బత్తుల సత్యనారాయణ, నేరెళ్ల రమేష్, ఆరెల్లి కృష్ణ, అబ్బులు, జహీర్, విజయలక్ష్మి, సప్పిడి కోటేశ్వరరావు, షమీమ్ పాల్గొన్నారు.

ఇదీ లోకం!

వేటాడి చంపుతాం

ఏ ఒక్కరినీ వదలం: అమిత్ షా

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడి ఘటనపై కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా తొలిసారి స్పందించారు. దాడికి ప్రతీకారం తీర్చుకుంటామని, ఏ ఒక్క ఉగ్రవాదిని వదిలే ప్రసక్తే లేదని స్పష్టంచేశారు. గురువారం న్యూఢిల్లీలో బోడో సామాజిక వేత్త ఉపేంద్రనాథ్ బ్రహ్మ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో అమిత్ షా ప్రసంగిస్తూ 'దాడి చేసి విజయం సాధించామని

- మిగతా 2 లో

రోజులు తరబడి పాగా

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు కొన్ని రోజుల ముందునుంచే పాగా వేసి... పక్కా ప్రణాళికతో దాడి చేసినట్లు దర్యాప్తులో తేలింది. ఏప్రిల్ 22 ఘటన అనంతరం దర్యాప్తు బృందాలు టెర్రరిస్టులకు క్షేత్రస్థాయిలో సహకరించిన ఓవర్ గ్రౌండ్ వర్కర్స్‌ను పెద్ద సంఖ్యలో అరెస్టు చేశాయి. వీరిలో ఒకరు ఈ విషయాన్ని ధ్రువీకరించారు. దర్యాప్తు బృందంలో భాగమైన సీనియర్ అధికారులు ఈ విషయాన్ని వెల్లడించారు. ఉగ్రవాదులు ఏప్రిల్ 15వ తేదీనే పహల్గాంకు చేరుకొన్నారు. నాలుగుచోట్ల రెక్కీ నిర్వహించారు. వీటిలో బైసరన్ వ్యాలీ, అరు వ్యాలీ, స్థానిక అమ్యూస్‌మెంట్ పార్క్, బేతాబ్ వ్యాలీ ఉన్నాయి. వీటిల్లో చాలాచోట్ల భద్రతా ఏర్పాట్లు ఉండటంతో ఉగ్రవాదులు దాడులు చేయడానికి వెనుకంజ వేశారు.

నాలుగు చోట్ల రెక్కీ

ఇంకా కశ్మీర్‌లోనే ఉగ్రవాదులు: ఎన్ఐఏ

ఉగ్రవాదులకు క్షేత్రస్థాయిలో దాదాపు 20 మంది సహకరించినట్లు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) గుర్తించింది. వీరిలో చాలామందిని ఇప్పటికే అరెస్టు చేసింది. మిగిలిన వారు నిఘా నీడలో ఉన్నారు. మహారాష్ట్రలోని జాల్నాకు చెందిన పర్యాటకుడు ఆదర్శ్ రౌత్ ఇటీవల కశ్మీర్ పర్యటనకు వెళ్లగా... తాను పహల్గాం దాడికి ముందురోజు అక్కడే ఒక అనుమానిత వ్యక్తితో మాట్లాడినట్లు వెల్లడించారు. ఎన్ఐఏ విడుదల చేసిన ఉగ్రవాదుల ఊహాచిత్రాలు చూశాక తన అనుమానం మరింత బలపడినట్లు తెలిపారు. ఇలాంటి అనుభవాన్ని పూనెలో

స్థిరపడిన మలయాళ సామాజిక వేత్త కూడా వెల్లడించారు. తాము బేతాబ్ వ్యాలీలో తీసిన వీడియోలో ఇద్దరు ఉగ్రవాదులు సంచరిస్తున్నట్లు నమోదైందని వెల్లడించారు. ఉగ్రవాదులకు సాయం చేసిన క్షేత్రస్థాయిలోని సానుభూతిపరులే అత్యంత కీలక పాత్ర పోషించినట్లు నిఘా సంస్థలు తెలిపాయి. స్థానికులే ఉగ్రవాదులకు అవసరమైన సమాచారం, ప్రయాణ

- మిగతా 2 లో

హాఫీజ్ సయీద్‌కు భద్రత

నాలుగు రెట్లు పెంచిన పాక్

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రదాడికి కీలక సూత్రదారిగా భావిస్తున్న లష్కరే తోయిబా చీఫ్ హాఫీజ్ సయీద్‌కు నాలుగు రెట్ల భద్రత కల్పించాలని పాకిస్థాన్ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. భారత్ దాడి చేస్తుందనే భయంతో పాక్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగా లాహోర్‌లోని హాఫీజ్ సయీద్ నివాసం వద్ద భద్రతను మరింత కట్టుదిట్టం చేసింది. ఆ దేశానికి చెందిన సాయుధ దళాల సిబ్బంది అతడి నివాస పరిసర ప్రాంతాల్లో భారీగా మోహరించారు. పాకిస్థాన్ సైన్యం, ఐఎస్ఐతోపాటు లష్కరే తోయిబా కార్యకర్తలు సంయుక్తంగా హాఫీజ్ భద్రతను చూస్తున్నట్లు సమాచారం. అతడి నివాసానికి నాలుగు కిలోమీటర్ల పరిధి వరకు డ్రోణులతో పహారా ఏర్పాటు చేశారు. పరిసర ప్రాంతాల్లో హై

రిజల్యూషన్ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు పాక్ నిఘా వర్గాలు వెల్లడించాయి. మరోవైపు పహల్గాం దాడికి తమదే బాధ్యతంటూ ది రెసిస్టెన్స్ ఫ్రంట్ ఇప్పటికే ప్రకటించింది. కానీ ఇది లష్కరే తోయిబా అనుబంధ సంస్థ. ఈ దాడి వెనుక హాఫీజ్ సయీద్ హస్తం ఉందని భారత్ నిఘా వర్గాలు గట్టిగా విశ్వసిస్తున్నాయి. మరోవైపు హాఫీజ్

- మిగతా 2 లో

కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి

- ప్రపంచమంతటా మార్మోగిన మేడే నినాదం
- అన్ని దేశాల్లో భారీ ర్యాలీలు, నిరసనలు
- మెరుగైన వేతనాలు, భద్రత, ఉమ్మడి పోరాటాలకు పిలుపు

న్యూయార్క్: అంతర్జాతీయ కార్మికుల దినోత్సవాన్ని (మేడే) పురస్కరించుకొని ప్రపంచ వ్యాప్తంగా కార్మిక ఐక్యత నినాదం మార్మోగింది. వాణిజ్య యుద్ధాలు, అవినీతికి వ్యతిరేకంగా, మెరుగైన వేతనాలు, పని పరిస్థితులు, జీవన ప్రమాణాల కోసం కార్మికలోకం కదం తొక్కింది. వేలాది మంది వర్కర్లు వీధుల్లోకి వచ్చారు. అన్ని దేశాల్లో ఆయా కార్మిక సంఘాల అధ్వర్యంలో భారీ ప్రదర్శనలు, నిరసనలు జరిగాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధానాలపై వ్యతిరేకత, ప్రపంచ ఆర్థిక మాంద్యం భయాలు వ్యక్తమయ్యాయి. చాలా దేశాల కార్మికులు ట్రంప్ అజెండాను వ్యతిరేకించారు. అమెరికా, తైవాన్, ఫిలిప్పీన్స్, జపాన్, మనీలా, ఇండోనేసియా, టర్కీ, సెర్బియా, ఫ్రాన్స్, భారత్ తదితర దేశాల్లో వేలాది మంది వీధుల్లోకి వచ్చి మేడే ర్యాలీలను జయప్రదం చేశారు. కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి! మేడే వర్ధిల్లాలి! కార్మికుల హక్కులు పరిరక్షించాలి! వేతనాలు పెంచాలి-రక్షణ కల్పించాలి! వంటి నినాదాలతో ప్రపంచ దేశాలు హోరెత్తాయి. ప్రదర్శనల్లో వేలాది సంఖ్యలో కార్మికులు పాల్గొనడంతో ఆయా ప్రాంతాలు కిక్కిరిసిపోయాయి. కొన్ని చోట్ల ప్రభుత్వ భవనాల ముట్టడికి ప్రయత్నాలు జరగడంతో స్వల్ప ఉద్రిక్తత నడుమ అరెస్టులు జరిగాయి.

చికాగో, లాస్ ఏంజిల్స్, న్యూయార్క్, ఫిలడెల్ఫియా సహా అమెరికాలోని ప్రధాన నగరాల్లో మేడే ర్యాలీలు 'ఐక్యతా' పిలుపుతో జరిగాయి. ఇమ్మిగ్రెంట్లు, ఫెడరల్ వర్కర్లపై ట్రంప్ విధానాలను కార్మికులు వ్యతిరేకించారు. 'ఒక పోరాటం, ఒక ఉద్యమం- కార్మికుల ఐక్యత!" నినాదంతో లాస్ ఏంజిల్స్ మార్మోగింది. 'భయపెట్టి, మభ్యపెట్టి, అబద్ధాలు చెప్పి మమ్మల్ని విభజించేందుకు ప్రయత్నిస్తున్న బిలియనీర్లు, రాజకీయ నేతలపై ఐక్యంగా పోరాడదాం' అని 20 లక్షల మంది కార్మికులకు ప్రాతినిధ్యం వహించే 'సర్వీస్ ఎంప్లాయీస్ ఇంటర్నేషనల్ యూనియన్' అధ్యక్షుడు ఏప్రిల్ వెర్రెట్ పిలుపునిచ్చారు. 'మాకు నిజం తెలుసు- ఇమ్మిగ్రెంట్ వర్కర్లపై దాడి చేయడమంటే కార్మికులందరిపై దాడి చేయడమే' అని వక్కాణించారు. చికాగో మేడే ర్యాలీల్లో కార్మిక నాయుడు జార్జ్ ముజికా మాట్లాడుతూ 'ప్రస్తుతం ప్రతి ఒక్కరిపై దాడి జరుగుతుంది' అన్నారు. 'ఎవరిది ఏ జాతి, ఏ వర్గం అనేది పరిగణనలోకి తీసుకోకుండా ఇమ్మిగ్రేషన్ హోదా లేక జిప్ కోడ్‌లను పట్టించుకోకుండా ప్రతి కుటుంబానికి ఇల్లు, ఆరోగ్య సంరక్షణ, సముచిత వేతనాలు, భద్రత ఉండే ప్రపంచం కోసం ఏకమవుదాం' అంటూ అమెరికన్ సివిల్ లిబర్టీ యూనియన్ ఆఫ్ న్యూయార్క్ పిలుపునిచ్చింది. 'ట్రంప్ సుంకాల యుద్ధాల అజెండా, విధానాలతో స్థానిక పరిశ్రమలకు ముప్పు'

అని ఫిలిప్పీన్స్‌లో కార్మిక నేత మాంగ్ పలాటినో హెచ్చరించారు. జపాన్‌లోనూ ట్రంప్ విధానాలపై వ్యతిరేకత వ్యక్తమైంది. జీతాలలో పెంపు, లింగ సమానత్వం, ఆరోగ్య సంరక్షణ, సైనిక వ్యయం తగ్గడం, భూకంప బాధితులకు విపత్తు సాయం వంటి డిమాండ్లతో ఆందోళనలు, ప్రదర్శనలు జరిగాయి. గాజాలో కాల్పుల విరమణ కోసం, ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం ఆగాలని కూడా నినాదాలు వినిపించాయి. మన పిల్లల జీవితాల్లో ఆశలు ఉండాలంటే, కార్మికుల హక్కులను గుర్తించాలంటే పోరాటాలు తప్పవని టోక్యోలో మదర్స్ గ్రూప్ సభ్యురాలు జున్కో కురామోచి వక్కాణించారు. దిగుమతి చేసుకునే ముడి సరుకు ధరలు పెరగడంపై నిర్మాణ రంగ కార్మికుడు టడాషి ఇటో ఆందోళన వ్యక్తంచేశారు. 'పని కోసం ప్రతి ఒక్కరు పోరాటం చేస్తున్నారు కాబట్టి తక్కువ వేతనాలు ఎక్కడ ఉంటే కాంట్రాక్టులు అక్కడే వెళతాయి. ఏది ఏమైనా శాంతికే తొలి ప్రాధాన్యత ఇస్తాం' అని ఆయనన్నారు. మనీలాలో అధ్యక్ష భవనం ముట్టడికి కార్మికులు ప్రయత్నించగా పోలీసులు భారీ బారికేడ్లు పెట్టి వారిని అడ్డుకున్నారు. దీంతో ఘర్షణ జరిగింది. వేలాది మంది వర్కర్లు ర్యాలీల్లో పాల్గొన్నారు. ఉద్యోగాలు, వ్యాపారాలకు మెరుగైన రక్షణ, వేతనాల పెంపుదల కోసం డిమాండ్ చేశారు. ఇండోనేసియా రాజధాని జకార్తలోని నేషనల్ మాన్యుమెంట్ పార్క్ నుంచి అధ్యక్షుడు ప్రబాబో సుబియాంటో మేడే శుభాకాంక్షలు తెలిపారు.

ఇండోనేసియాలో పేదరికం నిర్మూలనకు తమ ప్రభుత్వం చేయగలిగినదంతా చేస్తున్నట్లు వెల్లడించారు. రెండు లక్షల మందికిపైగా కార్మికులు మేడే ప్రదర్శనలలో పాల్గొన్నారని కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండోనేసియన్ ట్రేడ్ యూనియన్స్ అధ్యక్షుడు ఇక్బాల్ తెలిపారు. సెర్బియాలో అవినీతికి వ్యతిరేకంగా విద్యార్థుల నేతృత్వ ఆందోళనలకు సెర్బియా యూనియన్లు పాల్గొన్నాయి. విద్యార్థుల ఆందోళనలకు కార్మిక సంఘాలు మద్దతు ఇవ్వడం మొదటిసారి జరిగింది. భయానక రైలు ప్రమాదం అనంతరం అవినీతి వ్యతిరేకాందోళనలు సెర్బియా వ్యాప్తంగా మిన్నంటాయి. బెల్‌గ్రాడ్‌లోని సెర్బియా ప్రభుత్వ భవనం వద్దకు చేరుకొని ఐదు అతిపెద్ద యూనియన్ల సభ్యులు, విద్యార్థులు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. 20 ఏళ్లుగా యూనియన్‌లో ఉన్నా... ఎన్నడూ లేని విధంగా ఐదు అతిపెద్ద యూనియన్లు ఏకతాటిపైకి రావడం ఇదే మొదటిసారి. విద్యార్థులు మమ్మల్ని ఏకం చేశారు. ఐక్య పోరాటానికి మార్గదర్శకులయ్యారు. అంతకుముందు ఈ ఐదు యూనియన్లు ఉమ్మడిగా ఆందోళన చేపట్టడం కాదు కదా కనీసం ఒక గదిలో కలిసి కూర్చునే పరిస్థితి కూడా లేదు' అని స్లోగా (ఐక్యతా) యూనియన్ నాయకుడు తెలిపారు. టర్కీలో మేడే సందర్భంగా కార్మికుల హక్కుల కోసం నినాదాలు మార్మోగాయి. ప్రజాస్వామిక విలువ సమర్థన కోసం విస్తృత పోరాటాలకు పిలుపులు వినిపించాయి. ఇస్తాంబుల్‌లో ప్రతిపక్ష మేయర్ అక్రమ్ ఇమాంగ్లు జైలు పాలైన క్రమంలో ఈ ఆందోళనలకు ప్రాధాన్యత పెరిగింది. సెంట్రల్ ఇస్తాంబుల్‌కు వెళ్లకుండా అన్ని మార్గాలను అధికారులు మూసివేశారు. ట్రాన్సిట్ లైన్లను షట్‌డౌన్ చేశారు. తక్సీమ్ స్క్వేర్ వద్ద మేడే ర్యాలీ కోసం చేరుకున్న న్యాయవాదులు సహా 200 మందికిపైగా ప్రదర్శనకారులను పోలీసులు అరెస్టు చేశారని లా అసోసియేషన్ ప్రతినిధులు వెల్లడించారు.

హాఫీజ్ సయీద్‌కు భద్రత

(మొదటిపేజీ తరువాయి)

సయీద్‌ను ప్రపంచ ఉగ్రవాదిగా ఐక్యరాజ్య సమితితోపాటు అమెరికా సైతం ప్రకటించిన సంగతి తెలిసిందే. అతడి తలపై 10 మిలియన్ అమెరికా డాలర్లను బహుమతిగా ప్రకటించింది. అయితే హాఫీజ్ సయీద్ నివాసం వద్ద 2021లో కారు బాంబు పేలింది. ఈ ఘటనలో ముగ్గురు వ్యక్తులు మరణించారు. దీంతో అతడి నివాసం వద్ద పాక్ ప్రభుత్వం భద్రత పెంచింది. తాజాగా మరోసారి అతడి భద్రతను సమీక్షించింది. అనంతరం నాలుగు రెట్ల భద్రతను హాఫీజ్ సయీద్‌కు కల్పించింది.

రికార్డుస్థాయిలో జీఎస్టీ వసూళ్లు

(మొదటిపేజీ తరువాయి)

1.96 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ఏప్రిల్ మొత్తం వసూళ్లలో దేశీయ లావాదేవీల ద్వారా రూ.1.9 లక్షల కోట్లు వసూళ్లు జరిగాయి.

గతేడాదితో పోలిస్తే ఈ మొత్తం 10.7 శాతం మేర పెరిగింది. దిగుమతైన వస్తువులపై వేసే జీఎస్టీ ద్వారా వచ్చే ఆదాయం 20.8 శాతం మేర పెరిగి రూ.46,913 కోట్లకు పెరిగింది. రూ.27,341 కోట్ల రిఫండ్లు జారీ అనంతరం నికర జీఎస్టీ వసూళ్లు 9.1 శాతం వృద్ధితో రూ.2.09 లక్షల కోట్లుగా నమోదయ్యాయి.

120కి పైగా టెలిగ్రామ్, ఇన్‌స్టా ఛానళ్లపై చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

పరిధిలోని సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్‌కు బదిలీ చేసినట్లు సమాచారం. అలాగే, అసత్య ప్రచారాన్ని, విద్యార్థుల్లో అనవసర భయాందోళనలు నివారించేందుకు ఈ ఛానళ్లను తొలగించాలని టెలిగ్రామ్, ఇన్‌స్టాగ్రామ్ సంస్థలను కోరినట్లు తెలుస్తోంది.

నీట్ ప్రశ్నపత్రం గురించి తప్పుడు ప్రచారం చేసే అనధికార వెబ్‌సైట్‌లు/సోషల్ మీడియా ఖాతాలు, పరీక్ష కంటెంట్ యాక్సెస్‌కు సంబంధించి క్లెయిమ్ చేసే వ్యక్తుల గురించి ఫిర్యాదు చేసేందుకు ఎన్‌టీఏ ఇటీవల కొత్త వేదికను ప్రారంభించిన విషయం తెలిసిందే. ఇప్పటివరకు 1500కు పైగా ఫిర్యాదులు అందగా... వీటిలో అధిక భాగం టెలిగ్రామ్ ఛానల్ లింక్‌లే ఉన్నట్లు తెలుస్తోంది. మరోవైపు, ఈ ఏడాది మే 4న జరగనున్న నీట్ యూజీ పరీక్షకు రంగం సిద్ధం చేసింది. నీట్ అడ్మిట్ కార్డులు నిన్ననే విడుదల చేసింది.

బలగాల స్థైర్యాన్ని దెబ్బతీయొద్దు

పహల్గాం ఘటనపై విచారణకు సుప్రీం తిరస్కృతి

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో ముష్కరులు జరిపిన పాశవిక దాడిపై న్యాయవిచారణ జరపాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై అత్యున్నత న్యాయస్థానం తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇలాంటి వ్యాజ్యాలతో మన భద్రతా బలగాల స్థైర్యాన్ని దెబ్బతీయాలనుకుంటున్నారా అని పిటిషనర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. 'ఇది చాలా క్లిష్ట సమయం. ఉగ్రవాదంపై పోరులో ప్రతి పౌరుడు చేతులు కలపాలి. ఇలాంటి పిటిషన్లు దాఖలు చేసేటప్పుడు కాస్త బాధ్యతతో వ్యవహరించండి. అందులో సున్నితత్వాన్ని అర్థం చేసుకోండి. ఇలాంటి చర్యలతో మన బలగాల స్థైర్యాన్ని దెబ్బతీయాలనుకుంటున్నారా? మీకు కూడా దేశంపై బాధ్యత ఉందన్న విషయాన్ని మర్చిపోవద్దు' అని ధర్మాసనం సూచించింది. 'ఇలాంటి అంశాలను న్యాయ పరిధిలోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నించొద్దు. ఉగ్రవాద ఘటనల విచారణకు జడ్జీలు నిపుణులు కారు' అని ధర్మాసనం వెల్లడించింది. అయితే, ఇతర రాష్ట్రాల్లో కశ్మీరీ విద్యార్థుల భద్రత కోసమే తాను ఈ వ్యాజ్యం దాఖలు చేసినట్లు పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ... విద్యార్థుల కోసమే అయితే హైకోర్టులకు వెళ్లొచ్చని తెలిపింది. కోర్టు సూచనలతో పిటిషనర్ తన వ్యాజ్యాన్ని ఉపసంహరించుకున్నారు.

జనన, మరణ రికార్డులతో ఓటర్ల జాబితా అనుసంధానం

ఈసీ

న్యూఢిల్లీ: జనన, మరణ రికార్డులతో ఓటర్ల జాబితాను అనుసంధానం చేయనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. ఇందుకోసం రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా నుంచి మరణాల సమాచారాన్ని ఎలక్ట్రానిక్ రూపంలో ఎప్పటికప్పుడు తీసుకుంటామని వెల్లడించింది. తద్వారా అత్యంత కచ్చితత్వంతో ఓటరు జాబితాను నవీకరించే వీలుంటుందని పేర్కొంది. 'నమోదిత మరణాలకు సంబంధించిన సమాచారాన్ని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు సకాలంలో పొందే వీలుంటుంది. చనిపోయిన వారి కుటుంబీకుల నుంచి విజ్ఞప్తి వచ్చేంతవరకు వేచి చూడకుండా... ఆర్‌జీఐ నుంచి సమాచారం వచ్చిన వెంటనే బూత్‌స్థాయి అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి సమాచారాన్ని ధ్రువీకరించుకుంటారు' అని ఎన్నికల సంఘం వెల్లడించింది. ఎన్నికల నిబంధనలు-1960, జనన, మరణాల నమోదు చట్టం-1969 ప్రకారం ఎన్నికల సంఘానికి ఈ సమాచారం తీసుకునే అధికారం ఉంది. ఓటరు సమాచార చీటీ మరింత స్పష్టంగా కనిపించేందుకు వీలుగా దాని డిజైన్ మార్చాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. సీరియల్ నంబర్, పార్టు నంబర్ల సైజు పెంచనున్నట్లు తెలిపింది. తద్వారా ఓటర్లు తమ పోలింగ్ స్టేషన్లను తేలికగా గుర్తించడంతోపాటు అటు పోలింగ్ అధికారులకు కూడా జాబితాలోని పేర్లు సులభంగా సరిచూసుకునే వీలుంటుంది. దీంతోపాటు బూత్ స్థాయి అధికారులకు ఫొటో ఐడీ కార్డులు జారీ చేయనున్నట్లు ఈసీ వెల్లడించింది.

వేటాడి చంపుతాం

(మొదటిపేజీ తరువాయి)

అనుకుంటే అది పొరపాటే. ఇది మోదీ సర్కార్. మోదీ సర్కార్ ఎవరినీ వదిలి పెట్టదు. ఉగ్రవాదులు ఎక్కడ దాక్కున్నా వెతికి పట్టుకుని శిక్షిస్తాం. ఉగ్రవాదులకు సరైన సమాధానం చెప్పడం ఖాయం. ఇప్పటికే కశ్మీర్‌లో ఉగ్రవాద చర్యలకు గట్టి సమాధానం ఇస్తున్నాం. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారం తీర్చుకుంటాం. పహల్గాం అమాయకుల చావులకు కారణమైన ప్రతి ఒక్కరూ మూల్యం చెల్లించుకోవాల్సిందే. ఉగ్రవాదాన్ని తుదముట్టించడమే మా ప్రభుత్వ సంకల్పం. దానిని సాధించే వరకు మా పోరాటం కొనసాగుతుంది' అని అమిత్‌షా అన్నారు.

సీఐఎస్‌సీగా అశుతోష్ బాధ్యతల స్వీకరణ

(మొదటిపేజీ తరువాయి)

ఫైటర్ స్ట్రీమ్‌లోకి నియమితులైన ఎయిర్ మార్షల్ దీక్షిత్ తనతో పాటు కమాండ్, స్టాఫ్, ఇనస్ట్రక్షనల్ విధుల్లో దాదాపు 40 సంవత్సరాల అనుభవం కలిగి ఉన్నారు. బంగ్లాదేశ్‌లోని నేషనల్ డిఫెన్స్ అకాడమీ, డిఫెన్స్ సర్వీసెస్ స్టాఫ్ కాలేజ్ మరియు న్యూఢిల్లీలోని నేషనల్ డిఫెన్స్ కాలేజ్ నుండి పట్టభద్రుడైన ఆయన, మిరాజ్-2000, మిగ్-21, జాగ్వార్‌తో సహా 20 కంటే ఎక్కువ రకాల విమానాలపై 3,300 గంటల కంటే ఎక్కువ విమానాలు నడిపిన క్వాలిఫైడ్ ఫ్లయింగ్ ఇన్‌స్ట్రక్టర్, ప్రయోగాత్మక టెస్ట్ పైలట్ కూడా.

కార్మికుల చెమట చుక్కలే అభివృద్ధికి బాట

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేయని కేసీఆర్ ... కనీసం ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా అయినా దళితునికి అవకాశం ఇవ్వాలని అన్నారు. కపటనాటక సూత్రధారి మళ్లీ బయలుదేరిండు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

మూడు నెలల్లో మరమ్మతులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొస్తామని స్పష్టం చేశారు. ఎంపీ మల్లు రవి, రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి, ఎమ్మెల్యేలు రాజేష్ రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, కలెక్టర్ బాదవత్ సంతోష్, ఇంజినీరింగ్ అధికారులు ఉన్నారు.

తెలంగాణ కులగణన

దేశానికే రోల్ మోడల్

విశాలాంధ్ర - హైదరాబాద్ : కులగణనపై కాంగ్రెస్ పార్టీ గల్లీ స్థాయి నుంచి ఢిల్లీ స్థాయి వరకు గళం వినిపించిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. తమ పార్టీ కీలక నేత రాహుల్‌గాంధీ ... భారత్ జోడో యాత్రలో కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు కులగణన ప్రస్తావించారని గుర్తు చేశారు. తెలంగాణలో కులగణన చేయడమే కాకుండా జాతీయ స్థాయిలో కూడా కులగణన చేపట్టాలని ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఆందోళన చేసినట్లు తెలిపారు. తన నివాసంలో గురువారం మీడియా సమావేశంలో సీఎం మాట్లాడుతూ మన్మోహన్ సింగ్ ప్రభుత్వం 2011లో సేకరించిన కులగణన వివరాలను నరేంద్ర మోదీ ప్రభుత్వం బయట పెట్టలేదని దుయ్యబట్టారు. కులగణన కోసం ఢిల్లీలో తాము చేపట్టిన ఆందోళనకు బీజేపీ తప్ప అన్ని పార్టీలు మద్దతు ఇచ్చాయన్నారు. తెలంగాణలో చేపట్టిన కులగణనతో వచ్చిన ఒత్తిడి ఫలితంగా దేశ వ్యాప్తంగా కులగణనకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందన్నారు. తెలంగాణ కులగణన దేశానికే రోల్ మోడల్ అన్నారు. దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, ప్రధాని మోదీకి ధన్యవాదాలు చెప్పారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో బీసీలుగా ఉన్న బోయలు కర్నాటకలో ఎస్టీలుగా ఉన్నారని, తెలంగాణలో ఎస్టీలుగా ఉన్న లంబాడాలు మహారాష్ట్రలో బీసీలుగా ఉన్నారని, ఇలా వివిధ రాష్ట్రాల్లో వివిధ సమస్యలు ఉన్నాయని వివరించారు. దేశవ్యాప్త కుల గణనకు విధివిధానాలు రూపొందించాలని సూచించారు. కులగణనను సమాజ ఎక్స్‌రేగా రాహుల్ గాంధీ అభివర్ణించారని, ఎక్స్‌రేను చూసిన తర్వాతే చికిత్స చేయగలమన్నారు. బీహార్ చేపట్టిన కులగణనను కోర్టు తప్పుపట్టడంతో కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ ... ఆ రాష్ట్రం చేపట్టిన కులగణన అశాస్త్రీయం అని చెప్పారు తప్ప తెలంగాణది కాదన్నారు. మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్, బీర్ల ఐలయ్య, ప్రభుత్వ సలహాదారులు కె.కేశవరావు, షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, మాజీ ఎంపీలు మధుయాష్కిగౌడ్, వి.హనుమంత్‌రావు, అంజన్‌కుమార్‌యాదవ్, మెట్టుసాయికుమార్, ముత్తినేని వీరయ్య పాల్గొన్నారు. ఇదిలా ఉండగా... కేంద్రం కులగణన విషయంలో సానుకూల నిర్ణయం తీసుకున్న సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఇంటికి పార్టీకి చెందిన నేతలతో పాటు బీసీసంఘాలు నాయకులు పెద్దఎత్తున చేరుకుని అయనకు అభినందనలు తెలిపారు. తెలంగాణ చేపట్టిన కులగణన ఫలితంగానే కేంద్రం కులగణనకు ముందుకు వచ్చిందని వారు అభిప్రాయపడ్డారు.

రోజులు తరబడి పాగా

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాట్లు చేసినట్లు గుర్తించారు. ఉగ్రదాడికి ముందు ఈ ప్రాంతంలో రెండు శాటిలైట్ ఫోన్లు వాడిన సంకేతాలను దర్యాప్తు బృందాలు గుర్తించాయి. మొత్తం 2,500 మందిని ఈ దాడికి సంబంధించి ప్రశ్నించాయి. వీరిలో 186 మంది ఇప్పటికీ దర్యాప్తు బృందాల కస్టడీలో ఉన్నారు.

పహల్గాంకు ఎన్ఐఏ చీఫ్

ఉగ్రదాడి దర్యాప్తును పర్యవేక్షించడానికి ఎన్ఐఏ చీఫ్ సదానంద దాటే పహల్గాం చేరుకున్నారు. ఆయనతోపాటు కొంతమంది ఐజీలు, డీఐజీలు కూడా ఉన్నారు. బైసరన్ లోయకు వెళ్లి అక్కడి పరిస్థితులను స్వయంగా పర్యవేక్షించారు. కాగా, పహల్గాం దాడికి పాల్పడిన ఉగ్రవాదులు ఇంకా దక్షిణ కశ్మీర్‌లోనే ఉన్నట్లు జాతీయ దర్యాప్తు సంస్థ వర్గాలు చెబుతున్నాయి. ఆ ప్రదేశంలో వారితోపాటు మరికొందరు ఉగ్రవాదులు ఉండొచ్చని పేర్కొన్నాయి. ఒకవేళ భద్రతా దళాలు వారిపై దాడి చేస్తే... మిగిలిన ఉగ్రవాదులు వారికి రక్షణగా వచ్చే అవకాశం ఉన్నట్లు వెల్లడించాయి. పహల్గాం దాడిలో పాల్గొన్నవారు... ఆహారం, ఔషధాలు వంటి వాటిని తమ వెంటే పెద్ద మొత్తంలో తీసుకెళ్లడంతో ఎక్కువకాలం అడవిలో ఉండగలుగుతున్నారని చెప్పారు.

అందరి దృష్టి అమరావతిపైనే

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : అమరావతి రాజధాని నిర్మాణం పున:ప్రారంభోత్సవానికి రంగం సిద్ధమైంది. ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా జరుగనున్న ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం నెల రోజుల ముందునుంచే ఏర్పాట్లు ప్రారంభించింది. రాష్ట్రానికి అత్యంత కీలకమైన ఈ రాజధాని ప్రాజెక్టు పనుల ప్రారంభాన్ని పండుగలా నిర్వహిస్తోంది. గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిన అమరావతికి మరలా దేశవ్యాప్తంగా గుర్తింపు తీసుకువచ్చేందుకు, రాజధానికి చట్టబద్ధత కల్పించే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని ప్రధాని చేతుల మీదుగా ప్రారంభించాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారు. ఇప్పటికే టెండర్లు ఖరారైన రూ.43వేల కోట్ల రాజధాని పనులకు మోదీ శంకుస్థాపన చేయనున్నారు. శుక్రవారం మధ్యాహ్నం 2:55 గంటలకు మోదీ గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకోనున్నారు. రాష్ట్ర మంత్రులు, కూటమి నేతలు ఘన స్వాగతం పలుకనున్నారు. అక్కడినుంచి హెలికాప్టర్‌లో మధ్యాహ్నం 3:15 గంటలకు వెలగపూడి సచివాలయం వద్ద ఉన్న హెలిపాడ్‌కు మోదీ చేరుకుంటారు. ముఖ్యమంత్రి చంద్రబాబు , డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రులు, అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలకనున్నారు. 3:30 గంటలకు సభాస్థలికి చేరుకుని అమరావతి పున:ప్రారంభ కార్యక్రమంలో ప్రధాని పాల్గొంటారు. రాజధాని అమరావతికి ప్రాజెక్టులకు శంకుస్థాపనలతో పాటు రూ.లక్ష 10వేల కోట్లతో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో కేంద్రం చేపట్టిన ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయనున్నారు. వేదికకు సమీపంలో ఏ ఆకారంలో ఒక పైలాన్‌ను ఏర్పాటు చేశారు. గంటా 15 నిమిషాల పాటు ప్రధాని మోదీ సభలో పాల్గొంటారు. కార్యక్రమం అనంతరం సాయంత్రం 4:55 గంటలకు తిరిగి హెలికాప్టర్ ద్వారా గన్నవరం ఎయిర్ పోర్టుకు చేరుకుంటారు మోదీ. అక్కడి నుంచి విమానంలో ఢిల్లీకి తిరిగి వెళతారు. ఇక భద్రతా కారణాల దృష్ట్యా ప్రధాన వేదికపై 14 మందికే చోటు కల్పించనున్నారు. ప్రధానితో పాటు గవర్నర్ అబ్దుల్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, రాష్ట్రమంత్రి లోకేశ్, కేంద్ర మంత్రులు ఆశీనులు కానున్నారు. ప్రముఖుల కోసం మొత్తం 31 గ్యాలరీలను ఏర్పాటు చేశారు. అమరావతి రైతుల కోసం ఐదు గ్యాలరీలు ప్రత్యేకించారు. వైసీపీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి, పద్మ విభూషణ్ చిరంజీవితోపాటు, వివిధ పార్టీల ప్రముఖులకు, ముఖ్య పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం ఆహ్వానాలు పంపించింది. అమరావతి పనుల పునఃప్రారంభోత్సవానికి ప్రభుత్వం అన్ని జిల్లాల నుంచి ప్రజలను సమీకరిస్తోంది. అమరావతి అందరిదీ అన్న భావన కలిగించేందుకు రాష్ట్రంలోని 26 జిల్లాల వాసులను భాగస్వాములను చేస్తోంది. రాజధాని కోసం భూములిచ్చిన రైతులను స్వయంగా సీఎం చంద్రబాబు కుటుంబసభ్యులతో సహా రావాలని ఆహ్వానించగా, ఇతర జిల్లాల నుంచి కూడా ముఖ్యులందరికీ ఆహ్వానాలు పంపారు. రాజధానికి తరలివచ్చే వారి కోసం ఆర్టీసీతోపాటు ప్రైవేటు విద్యాసంస్థల నుంచి బస్సులను అధికారులు సమీకరించారు. సుమారు 5 లక్షల మంది సభకు వస్తారని అంచనాతో ఏర్పాట్లు చేపట్టారు. సభా వేదికకు విజయవాడ, గుంటూరు నగరాల నుంచి వచ్చేందుకు మొత్తం 8 మార్గాలను అనుసంధానం చేశారు. కృష్ణానదిపై ఆరు వరుసలతో నూతనంగా నిర్మించిన వంతెనపైకి కూడా 2వ తేదీ ప్రత్యేకంగా వాహనాలను అనుమతిస్తున్నారు. ముఖ్యంగా రాజధాని చుట్టుపక్కలున్న ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, పశ్చిమగోదావరి, ఏలూరు, ప్రకాశం జిల్లాల నుంచి ఎక్కువ మందిని సమీకరిస్తున్నారు.

భారత్ అంటే పాక్‌కు భయం

సీఐఏ డాక్యుమెంట్ వెల్లడి

వాషింగ్టన్: పహల్గాం దాడి తరువాత భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలు పెరిగాయి. యుద్ధ భయాలు నెలకొన్నాయి. భారత్ చర్యలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న పాక్ నేతలు తమ నోటికి పనిచెబుతున్నారు. భారత్, పాక్ మధ్య యుద్ధం అంటూ జరిగితే కశ్మీర్ వల్లేనని 1993లో సీఐఏ అధికారి బ్రూస్ రైడెల్ భావించారు. అప్పటి బాబ్రీ మసీదు కూల్చివేత నేపథ్యంలో భారత్, పాక్ ఉద్రిక్తతలపై ఆయన ఓ నివేదిక సిద్ధం చేశారు. అప్పటి సీక్రెట్ నివేదికలో పాక్ అభద్రత, భయాలను పేర్కొన్నారు. తమ కంటే ఆర్థికంగా, సైనికపరంగా బలంగా ఉన్న భారత్‌ను చూసి పాక్ భయపడుతోందని అభిప్రాయపడ్డారు. బలమైన భారత్ తన ఉనికికే ముప్పు అని పాక్ భావిస్తున్నట్టు తెలిపారు. రెండు దేశాల మధ్య యుద్ధానికి 20 శాతం అవకాశం ఉందని పేర్కొన్నారు. అయితే, వేగంగా ఎదుగుతున్న భారత్‌ను చూసి భయానికి గురైన స్థితిలో పాక్‌కు యుద్ధానికి దిగే అవకాశం ఉందని తెలిపారు. తప్పుడు అంచనా, రెచ్చగొట్టే చర్యలు, ప్రతిదాడులు... ఓ భారీ ఉగ్రదాడి వంటివి పాక్, భారత్ యుద్ధానికి దారి తీయొచ్చని భావించారు. ఇందుకు కశ్మీర్ పరిస్థితులు కారణం కావొచ్చని అన్నారు. భారత్‌పై ఉగ్రమూకలను రెచ్చగొట్టడమే పాక్ ప్రధాన వ్యూహమని ఆ సీఐఏ ఏజెంట్ చెప్పారు. అంతర్గత కుమ్ములాటలతో దేశం అస్థిరంగా మారిన పరిస్థితుల్లో ప్రజల దృష్టి మళ్లించేందుకు అక్కడి ప్రభుత్వం ఇస్లామిక్ పాలన వైపు మళ్లొచ్చని అన్నారు. రెండు దేశాల మధ్య అణ్వాయుధ ప్రయోగ భయాలు ఎప్పటికీ ఉన్నవేనని అన్నారు. అయితే, పరిస్థితి చేయిదాటకుండా ఉండేందుకు పరస్పర విశ్వాసం పెంపొందించే చర్యలు చేపట్టాలని, నేరుగా చర్చల కోసం హాట్‌లైన్ ఏర్పాటుతో పాటు అణ్వాయుధాలపై ఒప్పందం అవసరమని అన్నారు. భారత్, పాక్ మధ్య తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ డాక్యుమెంట్ సంచలనంగా మారింది. ఇదిలా ఉంటే, భారత్, పాక్ మధ్య ఉద్రిక్తతలు సద్దుమణిగేలా చేసేందుకు ఇప్పటికే ఇరాన్, సౌదీ అరేబియా ముందుకు వచ్చాయి. తాజాగా అమెరికా విదేశాంగ శాఖ మంత్రి కూడా భారత్, పాక్ మంత్రులకు ఫోన్ చేశారు. పరిస్థితులు సద్దుమణిగేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

విద్యార్థులకు చదువుతోపాటు పాఠ్యాంశేతర విషయాలపై నైపుణ్యం పెంచాలి : కలెక్టర్

విశాలాంధ్ర - నల్లగొండ బ్యూరో : చదువుతోపాటు, విద్యార్థులకు పాఠ్యాంశేతర విషయాల పట్ల నైపుణ్యం కలవారిగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. పాఠ్యాంశేతర అంశాలలో విద్యార్థులకు శిక్షణ ఇచ్చి నైపుణ్యం కలవారిగా తీర్చిదిద్దేందుకు ఉద్దేశించి నల్గొండ జిల్లా కేంద్రంలోని బోయవాడ అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఏర్పాటు చేసిన వేసవి శిక్షణ శిబిరాన్ని గురువారం ఆమె ప్రారంభించారు. శిక్షణ శిబిరానికి వచ్చిన పిల్లలతో జిల్లా కలెక్టర్ ముచ్చటించారు. ఏ సబ్జెక్టు అంటే ఇష్టమని ఎలాంటి ఆటలు ఇష్టమని, డ్రాయింగ్, పెయింటింగ్ తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలతో చెస్ ఆడి చెస్‌ను నైపుణ్యంగా ఎలా ఆడి గెలవాలో మెలకువలను తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విద్యార్థులకు నోట్ బుక్కులు, పెన్నులు, పెన్సిళ్లు, ఎరైజర్లు, స్కెచ్ పెన్లు, వాటర్ కలర్స్ పంపిణీ చేశారు. పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు 15 రోజుల పాటు నిర్వహించే ఈ వేసవి శిక్షణ శిబిరంలో ఇండోర్ గేమ్స్, డాన్స్, హస్తకళలు, డ్రాయింగ్, పెయింటింగ్, కెరియర్ గైడెన్స్, నైతిక విలువలు, స్టోరీ టెల్లింగ్ తదితర అంశాలలో నాన్ రెసిడెన్షియల్ పద్ధతిలో నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులచే ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుంది. జిల్లా విద్యాశాఖ అధికారి బి.బిక్షపతి, నాగార్జునసాగర్ బాలకేంద్రం పర్యవేక్షకులు, నల్గొండ బాల కేంద్రం ఇంచార్జ్ బాలు, పాల్గొన్నారు.

అంగన్వాడీల్లో పోషణ లోపం ఉన్న పిల్లలను గుర్తించాలి

విశాలాంధ్ర - జిల్లా బ్యూరో మహబూబాబాద్ : ప్రతి నెల అంగన్వాడీ సెంటర్‌లో తీవ్ర లోప పోషణ, అతి తీవ్ర లోప పోషణ ఉన్న పిల్లలను గుర్తించి మెడికల్ అసెస్మెంట్ జరిగేలా చూడాలని జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ జిల్లా సంక్షేమ శాఖలోని అధికారులతో సమీక్షా సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా సంక్షేమ శాఖలో ప్రాజెక్ట్ వారీగా తీవ్ర లోప పోషణ, అతి తీవ్ర లోప పోషణ ఉన్న పిల్లలకు తీసుకోవలసిన జాగ్రత్తలు, వాటి నివారణ చర్యల గురించి సంబంధిత అధికారులకు తగు సూచనలు చేశారు. అంగన్వాడీ సెంటర్ నిర్వహణ పరిశుభ్రంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారిణీ ధనమ్మ, మహబూబాబాద్, గూడూరు, తొర్రూరు, మరిపెడ, డోర్నకల్ సిడిపిఓలు శిరీష, నిలోఫర్ డిసౌజా, కమలా దేవి, ఎల్లమ్మ, లక్ష్మి పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ గోపికృష్ణ, సఖీ వన్ స్టాప్ సెంటర్ అడ్మిన్ శ్రావణి, వుమెన్ ఎంపవర్మెంట్ అధికారి మహేశ్వరీ, హబ్ కో ఆర్డినేటర్, చైల్డ్ లైన్ కోఆర్డినేటర్ వీరన్న, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్థిరత్వమే లక్ష్యం :మంత్రి శ్రీధర్

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి, సింగరేణి : మహిళలు ఆర్థిక స్థిరత్వం సాధించడమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తుందని రాష్ట్ర ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి వర్యులు డి.శ్రీధర్ బాబు అన్నారు. గురువారం ఆయన మంథని పట్టణంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష, అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీతో కలిసి వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మంథని మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో శ్రీపాద కుట్టుమిషన్ కేంద్రం, ఇందిరా మహిళా శక్తి ద్వారా ఏర్పాటు చేసిన 2.5 లక్షల విలువ గల మొబైల్ క్యాంటీన్, మార్కెట్ ఏరియాలో 5 లక్షల విలువగల నైనిక నైటీస్, ఫ్యాషన్ వేర్ మ్యాచింగ్ సెంటర్ మంత్రి ప్రారంభించారు. మహిళలకు ఆదాయం మార్గాలు పెరగాలని, వారి కుటుంబాలు ఆర్థికంగా పటిష్టం కావాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి కార్యక్రమాన్ని ప్రారంభించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మంథని ఆర్డీఓ సురేష్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, తహసీల్దార్ కుమార స్వామి, సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు పిల్లలను ప్రోత్సహించాలి : ఎస్పీ

విశాలాంధ్ర - జిల్లా బ్యూరో మహబూబాబాద్: తల్లిదండ్రులుగా పిల్లలను ప్రోత్సాహించడమే మన బాధ్యతని జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో డీసీఆర్‌బీ విభాగంలో విధులు నిర్వహిస్తున్న పిసి ఎన్.నరేష్ కుమార్తె అక్షరా తాజాగా నిర్వహించిన పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమంగా 581 మార్కులు సాధించి, మహబూబాబాద్ జిల్లాలోనే 5వ స్థానంలో నిలిచి తన ప్రతిభను, కృషిని చాటిన సందర్భంగా జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆమెను ప్రత్యేకంగా అభినందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో పని చేస్తున్న కుటుంబం నుండి విద్యారంగంలో ఇంత గొప్ప విజయాన్ని సాధించడం గర్వకారణమని పేర్కొన్నారు. ఆమెకు జ్ఞాపిక అందజేసి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆశీర్వదించారు. పోలీసు కుటుంబాల పిల్లలు విద్య, క్రీడలు, ఇతర రంగాల్లో మెరుస్తూ పోలీస్ విభాగానికి గొప్ప గౌరవం తీసుకొస్తున్నారని, వీరిని గుర్తించి ప్రోత్సహించడమే మా బాధ్యత" అన్నారు. డి సి ఆర్ బి స్టాఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం : ఎస్పీ

విశాలాంధ్ర - ములుగుజిల్లా బ్యూరో : ప్రజా సమస్యలపరిష్కారం ధ్యేయంగా, గ్రామ సభ్యులు, ఏర్పాటు చేస్తున్నట్లు, ఏటూరునాగారం ఎస్ఐ. తాజ్‌ద్దీన్ తెలిపారు. గురువారం ములుగుజిల్లా ఏటూరునాగారం మండలంలో రామన్నగూడెం గ్రామంలో స్థానిక ఎస్సై తాజుద్దీన్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఎస్ఐ తాజ్‌ద్దీన్ మాట్లాడుతూ ములుగుజిల్లా ఎస్పీ డాక్టర్ పి.శబరిష్, ఏటూరు నాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ ఆదేశాల మేరకు. ఏటూరు నాగారం సీఐ అనుముల శ్రీని వాస్ సూచనల మేరకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టామన్నారు. ప్రజా శ్రేయస్సు కోసం, ప్రతిరోజు గ్రామాల వారీగా గ్రామసభలు ఏర్పాటు చేసి, ప్రజా సమస్యలు నేరుగా తెలుసుకొని ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కృషి చేస్తామన్నారు. వర్షాకాలం రావడంతో, కరకట్ట కొట్టుకుపోయి, గోదావరి వరద నీరు గ్రామాల్లోకి చేరి గ్రామం నీట మునుగుతుందని, ప్రతి ఏడాది వర్షాకాలంలో తమకు, గోదారి ముప్పు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తూ సమస్యను ప్రజలు ఎస్ఐకి విన్నవించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకొని వెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని ఎస్ఐ హామీ ఇచ్చారు.

పదవ తరగతి టాపర్లకు కలెక్టర్ అభినందన

విశాలాంధ్ర బ్యూరో - నిర్మల్ జిల్లా : కష్టపడితే ఏదైనా సాధ్యం. విజయానికి పట్టుదలే పునాది అని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పేర్కొన్నారు. పదో తరగతి ఫలితాల్లో నిర్మల్ జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ప్రభుత్వ బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాల, ఖానాపూర్‌కు చెందిన జాదవ్ ఈశ్వర్ 561 మార్కులతో జిల్లా టాపర్‌గా నిలవగా, భుక్యా గౌతమ్ 558 మార్కులు సాధించి ప్రతిభను చాటాడు. గురువారం జిల్లా కలెక్టర్ విద్యార్థులను స్వయంగా కలెక్టరేట్‌లోని తన ఛాంబరులో శాలువాలతో సత్కరించి, మిఠాయిలు తినిపిస్తూ అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పదో తరగతి ఫలితాల్లో జిల్లా విద్యార్థుల విజయం గర్వించదగిన విషయమన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కృషికి ఇది నిదర్శనమని వారికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న నాణ్యమైన విద్యా విధానం వల్లే ఈ ప్రతిభ వెలుగులోకి వచ్చింది అని వివరించారు. కష్టపడితే ఎలాంటి లక్ష్యానికైనా చేరుకోవచ్చని, జీవితంలో ఉన్నత స్థానాల్లో నిలవాలంటే పట్టుదలతో చదవాలంటూ విద్యార్థులను ఉత్సాహపరిచారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిరంతరం ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి అంబాజీ, సీపీఓ జీవరత్నం, వ్యాయామ ఉపాధ్యాయులు భుక్యా రమేష్ పాల్గొన్నారు.

ఘనంగా మే డే ఉత్సవాలు

విశాలాంధ్ర - ఖమ్మం : త్యాగాల ప్రతీక 139వ మేడే స్ఫూర్తితో భవిష్యత్తు పోరాటాలకు పునరంకితం కావాలని సిపిఐ సీనియర్ నేత పువ్వాడ నాగేశ్వరరావు తెలిపారు. అసమాన త్యాగాలు, పోరాటాలు, బలిదానాలతో అనేక హక్కులు సాధించుకున్నామని, ప్రతి హక్కు వెనక పోరాటం దాగి ఉందని ఆయన తెలిపారు. 139వ మేడేను పురస్కరించుకుని గురువారం ఖమ్మం జిల్లా సిపిఐ కార్యాలయంలో అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. పువ్వాడ మాట్లాడుతూ స్వాతంత్రానికి పూర్వంస్వాతంత్ర్యం తర్వాత కార్మికుల పక్షాన నిలబడి పోరాడింది సిపిఐ, ఏఐటియుసి మాత్రమేనన్నారు. ప్రస్తుత పాలకులు సంపన్న వర్గాల సేవలో తరిస్తున్నారని పేదలను పూర్తిగా విస్మరించారని ఆయన ఆరోపించారు. పేదలు మరింత పేదలవుతు న్నారని, సంపద కొంత మంది చేతుల్లో పోగుబడుతుందని ఇది దేశ భవిష్యత్తుకే ప్రమాదకరమన్నారు. సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంత రావు, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు బిజి క్లెమెంట్, మహ్మద్ సలాం, తాటి వెంకటేశ్వరరావు, పోటు కళావతి, సిహెచ్ సీతామహాలక్ష్మి, మేకల శ్రీనివాసరావు, ఆర్టిసి ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు పిల్లి రమేష్, జిల్లా సమితి సభ్యులు ఉన్నం రంగారావు, తాటి నిర్మల, యానాలి సాంబశివరెడ్డి, నూనె శశిధర్, బోడా వీరన్న, ఎస్ కె సైదా పాల్గొన్నారు.

విశాలాంధ్ర - వనపర్తి : వనపర్తి జిల్లా కేంద్రంలో సిపిఐ ఏఐటియుసీ ఆధ్వర్యంలో ఏడు కేంద్రాలలో మేడే ఉత్సవాలను నిర్వహించారు. సిపిఐ ఆఫీస్ వద్ద జిల్లా కార్యదర్శి విజయరాములు, ఎంసిహెచ్ వద్ద అధ్యక్షుడు శ్రీనివాసులు మెడికల్ కాలేజీ వద్ద ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి ఫుట్ స్నేహ ఫుట్‌పాత్ సెంటర్ వద్ద ఏఐటీయూసీ నాయకులు శాంతన్న, కర్రెమ్మ గుడి వద్ద సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి ఎర్రకుర్మయ్య, శ్రీనివాసపురం రోడ్డులో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పృథ్వి నాదం, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వద్ద యూనియన్ అధ్యక్షుడు గంధం శీను, మెడికల్ కాలేజ్ వద్ద ప్రిన్సిపల్ కిరణ్మయి ఎంసిహెచ్ దగ్గర మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు పతాకాలను ఆవిష్కరించారు. సిపిఐ పట్టణ కార్యదర్శి రమేష్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీహరి, ఉప ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణ, చిన్న కురుమన్న, గంధం శీను, పృథ్వి నాదం, వరుణ్, జయమ్మ, శిరీష, జ్యోతి, బాలరాజు, వెంకటమ్మ, రమణ, రాంబాబు, పల్లె స్వామి, పాల్గొన్నారు.

విశాలాంధ్ర - కొండమల్లేపల్లి : మేడే పోరాట స్ఫూర్తితో కార్మికులు హక్కుల కోసం పోరాటాలు తీవ్రతరం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మే డే సందర్భంగా కొండమల్లేపల్లిలో ఆటో వర్కర్స్ యూనియన్, పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ వారు నూతనంగా ఏర్పాటు చేసిన జెండాలను పల్లా దేవేందర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం తన కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను కార్పొరేట్ అనుకూల, మతోన్మాద చర్యలను మరింత దూకుడుగా అమలు చేస్తుందన్నారు. మార్కెట్ చైర్మన్ నాయిని జమున మాధవ రెడ్డి, మాజీ ఎంపీపీ రేఖ శ్రీధర్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వేమన్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ కాసర్ల వెంకటేశ్వర్లు, ఆటో యూనియన్ అధ్యక్షులు ఆదిరాల శ్రీను, పంగ శ్రీరాములు, ఉపాధ్యక్షులు, సహాయ కార్యదర్శి పెద్దిరాజు, రామయ్య, పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఇంద్రయ్య గౌరవ అధ్యక్షులు దాస్ నాగరాజు బిక్షం శ్రీరాములు ఏఐటియుసి మండల కార్యదర్శి ఏ వెంకటయ్య శంకర్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర - గూడూరు: మండలంలోని చంద్రుడుగూడెం, ఏపూరు, మచ్చర్ల, సీతానాగరం గ్రామాలలో ఎం సిపిఐ(యు) పార్టీ ఆధ్వర్యంలో మే డే దినోత్సవను ఘనంగా జరుపుకున్నారు. జిల్లా సహాయ కార్యదర్శి నూకల ఉపేందర్ మాట్లాడుతూ రక్తం చిందించి పని దినాల అమలుకు సామ్రాజ్యవాద శక్తుల మెడలొంచి సాధించుకున్న ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా కార్మిక విజయోత్సవ పండుగగా ఈ మేడే దినోత్సవాన్ని కష్టజీవులకు గుర్తుగా మే ఒకటో మే డే జరుపుకున్నారు. బండారి సత్యం పిట్టల నవీన్ ఓర్సు సురేందర్ బండి శ్రీను రమేష్ రంజిత్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర - కారేపల్లి : పాలకవర్గాల దమనకాండతో చికాగో కార్మిక వర్గం చిందించిన రక్తం విధించిన ఉరిశిక్షను సైతం లెక్క చేయకుండా పోరాడి సాధించిన ఎనిమిది గంటల పని దినంనీ కాపాడుకోవడం కోసం వారిచ్చిన స్ఫూర్తితో పెద్ద ఎత్తున ఉద్యమించాలని న్యూ డెమోక్రసీ మండల కార్యదర్శి వై ప్రకాష్ మాస్ లైన్ మండల కార్యదర్శి గుమ్మడి సందీప్ ఖమ్మం డివిజన్ నాయకులు ఎస్‌వి రాకేష్ గుగులోతు తేజ్యానాయక్ పిలుపునిచ్చారు. సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా టియుసిఐ ఆధ్వర్యంలో కారేపల్లి మండల పరిధిలోని టేకులగూడెం తొడితలగూడెం పంతులు నాయక్ తండ పోలంపల్లి మాదారం ఉసిరికాయపల్లి చిన్న మడంపల్లి గ్రామాలలో జండాలను ఆవిష్కరించారు. అలాగే కారేపల్లి క్రాస్‌రోడ్‌లో సిఐటియు నాయకులు కే నరేంద్ర కొండబోయిన నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మే డే సందర్భంగా జండా ఎగరవేసి ఉత్సవాలు జరిపారు. పలు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మే డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. న్యూడెమోక్రసీ నాయకులు కోయిల శ్రీనివాస్ మాస్ లైన్ టియుసిఐ మండలం నాయకులు బిక్కసాని భాస్కర్, వెంకటేశ్వర్లు, ధరావత్ సక్రు, పులకాని సత్తిరెడ్డి, వడ్డే వెంకటేశ్వర్లు, బాలు, రంగ్య సిఐటియు నాయకులు రేగళ్ళ మంగయ్య, షేక్ సైదులు, కే ఉమావతి, సురభి వెంకటేశ్వర్లు ఆటో యూనియన్ నాయకులు బొమ్మల కృష్ణ, బట్టు శ్రీనివాసరావు, గంగాధరని రవి, కృష్ణమూర్తి, మోహన్, గుగులోతు రవి తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - తొర్రూరు: కేంద్ర ప్రభుత్వం తెచ్చిన కార్మిక వర్గ ప్రయోజనాలను నష్టపెట్టే నల్ల చట్టాలను రద్దు చేయాలని మేడే సందర్భంగా వామపక్ష పార్టీల నాయకులు కామ్రేడ్ తమ్మెర విశ్వేశ్వరరావు, కామ్రేడ్ బొల్లం అశోక్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం 139వ మే డే సందర్భంగా తొరూరు రెవిన్యూ డివిజన్ కేంద్రంలో సిపిఐ, సిపిఎం, సిఐటియు, ఏఐటియుసి, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా మేడే ఉత్సవాలు నిర్వహించారు. వివిధ కూడళ్లలో ఎర్రజెండాలు ఆవిష్కరించి, కార్మికులు పెద్ద ఎత్తున గాంధీ సెంటర్ నుండి, బస్టాండ్ మీదుగా, ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ వరకు ఊరేగింపు నిర్వహించారు. మండలంలోని గంటయి పాలెం, అమ్మపురం, ఖానాపురం, గుర్తురు, కపూర్య తండా, గోపాల గిరి గ్రామాలలో జెండాల ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వామపక్ష నాయకులైన తమ్మెర విశ్వేశ్వరరావు, బొల్లం అశోక్, ఎండి యాకూబ్, ఓమ బిక్షపతి, బందు మహేందర్, జమ్ముల శ్రీను, గణపురం లక్ష్మణ్, సోమిరెడ్డిలు మాట్లాడారు. కొత్త వెంకటరెడ్డి, మార్గ సాంబయ్య, తాళ్ల వెంకన్న, బోరా స్వామి, ధరావత్ యాకన్న, తిమ్మిడి రవి, మంగళపల్లి మల్లయ్య, వెంకన్న, ఎల్లయ్య, పెయింటర్ యూనియన్ నాయకులు మహేందర్ మహేష్ నాగరాజు, మార్బుల్ యూనియన్ నాయకులు పండిత్ శర్మ, హమాలీలు దయాకర్, ఎల్లయ్య, దొమ్మటి సోమయ్య, ఉమా గాని యాకయ్య, జితేందర్, నజీర్, అమీర్, ఏకాంతం, సివిల్ సప్లై హమాలీలు, వెలిసాల ప్రభాకర్ పల్లె సైదులు బజార్ హమాలీలు, వీరన్న,వెంకన్న, యాకయ్య పాల్గొన్నారు.

విశాలాంధ్ర - నేరేడుచర్ల : నేరేడుచర్ల పట్టణంలో (మేడే) ప్రపంచ కార్మికుల దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ సంఘం కార్యాలయంలో, సిపిఎం పార్టీ కార్యాలయంతో పాటు పలుచోట్ల జెండా ఆవిష్కరించారు. అనంతరం పట్టణ పురవీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. సిపిఎం పట్టణ ప్రధాన కార్యదర్శి కొదమగుండ్ల నగేష్, సిఐటియు మండల కన్వీనర్ నీల రామ్మూర్తి, భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు యారవ శ్రీనివాస్‌లు సంయుక్తంగా మాట్లాడుతూ అన్ని రంగాల కార్మికులు మేడే కార్యక్రమంలో పాల్గొనడం సంతోషకరమన్నారు. కార్మికుల హక్కుల కోసం అన్ని రంగాల కార్మికులు పోరాటం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని రంగాల కార్మికులు పాల్గొన్నారు

విశాలాంధ్ర - వనపర్తి : వనపర్తి నియోజకవర్గ పరిధిలోని కార్మికులకు వైద్య సేవలు అందించేందుకు త్వరలోనే వనపర్తి జిల్లా కేంద్రంలో ఈఎస్ఐ ఆసుపత్రిని ఏర్పాటు చేయనున్నట్లు వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారు. మే డే... కార్మిక దినోత్సవ సందర్భంగా గురువారం వనపర్తి మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మున్సిపల్ కార్మికులను శాలువలతో సన్మానించారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దినదినాభివృద్ధి చెందుతున్న వనపర్తి పట్టణంలో లక్షలాదిమందికి నిరంతరాయంగా సేవలందిస్తున్న మున్సిపల్ కార్మికుల సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిషనర్, కార్యాలయ సిబ్బంది, వనపర్తి కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షులు మాజీ మున్సిపల్ చైర్మన్ పుట్టపాకుల మహేష్, మాజీ కౌన్సిలర్లు, లైట్, హెవీ వెహికల్స్ సంఘం అధ్యక్షులు అయూబ్ ఖాన్, కార్మికులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర ప్రతినిధి-పెద్దపల్లి, సింగరేణి: సిపిఐ, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం గోదావరిఖని పారిశ్రామిక ప్రాంతంలో మేడే ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయమే గనుల మీద ఏఐటీయుసి నాయకులు ఎర్రజెండాల నెగురవేసి మేడే ప్రాముఖ్యతను వివరించారు. సిపిఐ ఆధ్వర్యంలో ఆయా బస్తీల్లో, బాస్కరరావు భవనంలో ఎర్రజెండాలనెగురవేసి ప్రదర్శన నిర్వహించారు. నాయకులు గోసిక మోహన్, గౌతం గోవర్ధన్, కనకరాజు, మడ్డి ఎల్లయ్య, కె.స్వామి ఆరెల్లి పోషం, మహేష్, గౌస్ పాల్గొన్నారు. సిపిఎం, సిఐటీయు, ఐఎఫ్ టీయు, టీబీజికెఎస్‌ల ఆధ్వర్యంలో కూడా మేడే కార్యక్రమాలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పాల్గొన్నారు.

మైనార్టీ వెల్ఫేర్ స్కూల్ బ్రోచర్ ఆవిష్కరించిన కలెక్టర్

విశాలాంధ్ర - కొత్తగూడెం అర్బన్ : మైనార్టీ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ రూపొందించిన స్కూల్ అడ్మిషన్స్ సంబంధిత బ్రోచర్ ను గురువారం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆవిష్కరించారు. జిల్లాలోని మైనారిటీ గురుకులాల్లో ఇటీవల ప్రకటించిన ఇంటర్, టెన్త్ ఫలితాల్లో రాష్ట్ర వ్యాప్త ర్యాంకులు కూడా రావడం గమనార్హం. ఈ నేపథ్యంలో కలెక్టర్ అధికారులను ప్రశంసిస్తూ పలు సూచనలు చేశారు. ఈ బ్రోచర్ను మైనార్టీ మత పెద్దల ద్వారా మసీదుల వద్ద ప్రదర్శించి మైనార్టీ స్కూల్స్ ద్వారా అందిస్తున్న సౌకర్యాలను వివరించాలని కోరారు. గురుకుల విద్యార్థులకు ప్రతిభ గల విద్యతోపాటు పౌష్టిక ఆహారాన్ని కూడా అందిస్తున్నట్లు చెప్పారు. మైనార్టీ విద్యార్థులు ఈ సదవకాశాన్ని ఉపయోగించుకుని ఉన్నత శిఖరాలకు చేరాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ అధికారి సంజీవరావు, ఆర్ఎల్సి అరుణ పాల్గొన్నారు.

చాతకొండ 6 వ బెటాలియన్ క్యాంపును సందర్శించిన కలెక్టర్ జితేష్

విశాలాంధ్ర - కొత్తగూడెం క్రైమ్ : లక్ష్మీదేవి పల్లి మండలంలోని చాతకొండ 6 వ బెటాలియన్‌ను గురువారం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సందర్శించారు. ఈ సందర్శనలో భాగంగా కలెక్టర్ నూతనంగా శిక్షణ పొందిన ఎస్‌డిఆర్ఎఫ్ (స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్) 100 మంది సభ్యులతో కూడిన బృందంతో ముచ్చటించారు. ఆపదల సమయంలో వారు చేపట్టే చర్యలను, వారి వద్ద ఉన్న పరికరాలను పరిశీలించి వాటిని ఏ విధంగా ఉపయోగించాలో అడిగి తెలుసుకున్నారు. అనంతరం బెటాలియన్ లో నూతనంగా నిర్మించిన ఓపెన్ జిమ్ ను సందర్శించి పలు సూచనలు చేశారు. బెటాలియన్లు నూతనంగా ఏర్పాటు చేసిన మట్టితో ఇటుకల తయారు యంత్రములు పరిశీలించారు. ప్రయోగాత్మకంగా మట్టి ఇటుకలతో రోడ్డు తయారు చేపట్టడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు.

మే డే ఒక చారిత్రాత్మక చైతన్య దినం: ఎమ్మెల్యే

విశాలాంధ్ర- పినపాక: మే డే ఒక చారిత్రాత్మక చైతన్య దినమని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మణుగూరు మండల కేంద్రంలో కాలరీస్ కోల్ లారిలోడింగ్ అన్ లోడింగ్ వర్కర్స్ ఐఎన్ టియు యూనియన్ ఆధ్వర్యంలో మేడే కార్యక్రమానికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం మాట్లాడుతూ ఈ రోజు ఒక చారిత్రాత్మక చైతన్య దినం అన్నారు. 14 టైర్స్ లారి యూనియన్ కార్యాలయంలో యూనియన్ సభ్యులకు స్వీట్స్ తినిపించి కార్మిక దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మణుగూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పిరినకి నవీన్ , టౌన్ అధ్యక్షులు శివ సైదులు, బొగ్గు ముఠా అధ్యక్షుడు రాంబాబు , 14 టైర్ లారీ ఓనర్స్ యూనియన్ అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండల నాయకుడు,అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

కార్పొరేటర్లకు సంపదగా మారిన కార్మికుల శ్రమ దోపిడీ

విశాలాంధ్ర - గార్ల : దేశవ్యాప్తంగా వివిధ రంగాలలో పనిచేస్తున్న కార్మికుల శ్రమ దోపిడీ కార్పొరేటర్లకు సంపదగా మారిందని సిపిఐ, సిపిఎం, న్యూడెమోక్రసీ నాయకులు కట్టేబోయిన శ్రీనివాస్, కందునూరి శ్రీనివాస్, జడ సత్యనారాయణ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ప్రపంచ కార్మిక దినోత్సవం (మే డే) వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ పురవీధుల్లో సిపిఐ, సిపిఎం, న్యూడెమోక్రసీ పార్టీల శ్రేణులు ఎర్ర చొక్కాలు, మహిళలు ఎర్ర చీరలను ధరించి భారీ ప్రదర్శన నిర్వహించారు. దశాబ్దాలుగా పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దుచేసి కేంద్ర బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. చికాగో అమరవీరుల త్యాగాల సాక్షిగా కార్మిక లోకం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. నాయకులు జంపాల వెంకన్న, అలవాల సత్యవతి, జి. సక్రు, ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ రాజ్ కుమార్ జాదవ్, అప్పిరెడ్డి, సుజాత, మాన్య, గణేష్, రాగం రమేష్, మాగం లోకేష్, దుపాటి జనార్దన్, వీరాస్వామి, గోవింద్, ఏ. రామకృష్ణ, ఈశ్వర్ లింగం పాల్గొన్నారు.

చికాగో అమరవీరుల స్ఫూర్తితో కార్మిక హక్కులు సాధిద్దాం

విశాలాంధ్ర - భద్రాచలం : చికాకు నగరం అమరవీరుల స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం విధానాలను నల్ల చట్టాలను వ్యతిరేకిస్తూ హక్కులు సాధిద్దామని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ భద్రాచలం డివిజన్ కార్యదర్శి ముసలి సతీష్ పిలుపు నిచ్చారు. భద్రాచలం ఐటీడీఏ రోడ్డులో గురువారం 139 వ "మేడే" ఎర్రజెండాను కామ్రేడ్ కప్పల సూర్యకాంతం ఎగరవేశారు. ఈ కార్యక్రమం కోట నాగమణి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలను అమలు చేసి దేశంలో ఉన్న 50 కోట్ల మంది కార్మికుల సమస్యలను పరిష్కరించవలసిన బాధ్యత ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం విస్మరించడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాయం రాజమ్మ, సున్నం భూలక్ష్మి, గజ్జల మంగ, గజ్జల కొండ మంగమ్మ, జ్యోతి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మేడే స్ఫూర్తితో బిజెపిని గద్దె దింపుదాం...

విశాలాంధ్ర - ఖమ్మం : మే డే స్ఫూర్తితో కార్మిక హక్కులను హరించి వేస్తూ ,సాధించుకున్న అనేక హక్కుల పై ఉక్కు పాదం మోపుతున్న కేంద్ర బిజెపి ప్రభుత్వాన్ని గద్దె దించాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.సాయిబాబా జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ప్రపంచ కార్మికుల దినోత్సవం మేడే సందర్భంగా జిల్లా కార్యాలయంలో గురువారం మేడే దినోత్సవం, సందర్భంగా అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం సిపిఎం జిల్లా ఆఫీసు కార్యదర్శి ఆర్.ప్రకాష్ అధ్యక్షతన జరిగిన సభలో ఎం. సాయిబాబు మాట్లాడుతూ చికాగో కార్మికుల చారిత్రాత్మక వీరోచిత పోరాటానికి మే ఒకటితో 139 ఏళ్ళు పూర్తి అవుతుందన్నారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి, రాష్ట్ర నాయకులు ఎం.సుబ్బారావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదినేని రమేష్, జిల్లా కమిటీ సభ్యులు నందిపాటి మనోహర్, ఎస్.కె.బషీర్, మెరుగు రమణ, బివికె మేనేజర్ వై.శ్రీనివాసరావు, ఎస్.కె.అఫ్జల్, పగడాల నాగేశ్వరరావు, నెల్లూరి వీరబాబు, తుడుం ప్రవీణ్, పుల్లయ్య, రాధాకృష్ణ, కృష్ణమూర్తి, పుల్లారావు తదితర ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యం వికటించి వివాహిత మృతి

విశాలాంధ్ర - సత్తుపల్లి : పట్టణంలోని ఎస్.వి.సి ఆసుపత్రిలో ఓ వివాహిత వైద్యం వికటించి మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. వివాహిత మృతితో ఆసుపత్రి వద్దక మృతురాలి బంధువులు భారీగా చేరుకొని వైద్యుడుపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో పరిస్థితి గందరగోళంగా మారింది. పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు సత్తుపల్లి పోలీసులు ఆసుపత్రి వద్దే ఉండి మృతురాలు బంధువులను సముదాయించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, చింతలపూడి నియోజకవర్గం కోటపాడు గ్రామానికి చెందిన వివాహిత పామర్తి జోత్స్న (22) కడుపునొప్పితో సత్తుపల్లిలోని ఆల్ఫా స్కానింగ్ సెంటర్ కి వచ్చి స్కానింగ్ చేయించుకోవడంతో కడుపులో రక్తస్రావం జరుగుతోందని వచ్చిన రిపోర్టుతో స్కానింగ్ సెంటర్ కు ఎదురుగానే ఉన్న ఆస్పత్రిలో చేరగా పరీక్షించిన వైద్యుడు హర్షిత్ తక్షణమే ఆపరేషన్ చేయాలని సూచించడంతో బుధవారం రాత్రి 10 గంటలకు ఆపరేషన్ చేశారు. ఆపరేషన్ చేసే సమయంలో మృతిరాలికి 4% రక్తం మాత్రమే ఉన్నట్లు డాక్టర్ హర్షిత్ తెలిపారు. గురువారం ఉదయం 12 గంటల సమయంలో జ్యోత్స్న ఆరోగ్యం విషమించి కార్డియాక్ అరెస్ట్ తో మృతి చెందిందని వైద్యుడు హర్షిత్ తెలిపారు. విషయం తెలుసుకున్న మృతురాలి బంధువులు ఆసుపత్రి వద్ద ఆందోళన చేపట్టారు.

సంపాదకీయం

సైన్యం నెత్తిన బాధ్యత

ప్రధానమంత్రి మోదీ అన్ని సందర్భాలలోనూ నాటకీయంగానే ప్రవర్తిస్తారు. దేశ భద్రత, పహల్గాం దాడికి దన్నుగా ఉందంటున్న పాకిస్థాన్ ను మట్టి కరిపించడం లాంటి అంశాలలో కూడా ఆయన ఈ నాటకీయతనే ప్రదర్శించారు. అవధి లేని రీతిలో ప్రతీకారం తీర్చుకుంటామన్నారు. దాడికి పాల్పడిన వారి ఊహకు కూడా అందని రీతిలో ప్రతీకారం ఉంటుందని హెచ్చరించారు. పహల్గాం దాడి జరిగి వారం గడిచిపోయినా పాకిస్థాన్ మీద దాడి ఎందుకు చేయలేదు అని భావించే వారికి మోదీ నాటకీయతలో కొదవే లేదు. దాడి జరిగిన మరుసటి రోజు మోదీ పలికిన మాటలు చూస్తే పాక్ మీద విరుచుకు పడ్తారన్న భావన కలిగింది. తక్షణం యుద్ధానికి దిగడం ఎంత ప్రమాదకరమో మోదీకీ తెలుసు. యుద్ధం మాట మళ్లీ మోదీ నోట వినిపించకపోవడం మంచి పరిణామమే. అయితే అంత భీకరమైన ప్రతిజ్ఞలు చేసిన తరవాత ఏం చేయాలో మోదీకి తోచినట్టు లేదు. అందుకే పాకిస్థాన్ మీద ఎప్పుడు, ఎలాంటి, ఏ రూపంలో చర్య తీసుకోవాలో అన్న బాధ్యత సైన్యం, నౌకా దళం, వైమానిక దళానికే అప్పగించానని మోదీ చెప్తున్నారు. 370వ అధికరణం రద్దు తరవాత కశ్మీర్‌లో తీవ్రవాదం తగ్గలేదన్న వాస్తవం మోదీకి కూడా తెలుసు. ఆ వైఫల్యాన్ని కప్పి పుచ్చుకోవడానికి కూడా అసలు బాధ్యత సైనిక దళాల నెత్తిన వేయడమే ఉత్తమ మార్గం అనుకున్నట్టు ఉన్నారు. బాలాకోట్ సంఘటన తరవాత పాకిస్థాన్‌లోకి ఇసుమంత దూరం చొరబడి దాడి చేయడం గొప్ప వీరోచిత కార్యక్రమంగా ప్రచారం చేసుకున్నారు. పుల్వామా సంఘటన వెనక గుట్టును కశ్మీర్ గవర్నర్‌గా పని చేసిన సత్యపాల్ మాలిక్ రట్టు చేసిన తరవాత, ఆయన అంత వివరంగా చిట్టా విప్పినా మోదీ ఒక్క మాట కూడా మాట్లాడలేదు. సత్యపాల్ మాలిక్ చెప్పిన విషయాలను ఖండించలేదు. ఆ తరవాత జరిగిన ఎన్నికలలో విజయం సాధించి సంతృప్తి పడ్డారు. దాదాపు నలభై మందిని ప్రభుత్వ నిర్వాకంవల్ల బలిపెడితే ఎక్కడా జనాగ్రహం కూడా కనిపించలేదు. ఆగ్రహ జ్వాలలు చెలరేగ లేదు. సత్యపాల్ మాలిక్ ఇప్పటికీ తన మాటకు కట్టుబడే ఉన్నారు. వివిధ చోట్ల పుల్వామా ఘోరానికి ప్రభుత్వమే ఎలా కారణమైందో చెప్తూనే ఉన్నారు. పహల్గాం దాడి తరవాత మోదీ మాటల్లో కనిపించిన తీక్షత ఇప్పుడు ఏ కోశానా లేదు. ఏం చేయాలో తోచకే కావొచ్చు బాధ్యత సైనిక దళాలకు అప్పగించినట్టున్నారు. ఏ దేశం మీదైనా యుద్ధం చేయాలనుకున్నప్పుడు తుది నిర్ణయం పౌర ప్రభుత్వమే తీసుకుంటుంది తప్ప సైన్యం తీసుకోదు. సర్వసన్నద్ధంగా లేకపోతే సైన్యం ఆ విషయాన్ని ప్రభుత్వాధినేతలకు నివేదిస్తాయి. పహల్గాం దాడికి భద్రతా లోపాలు కూడా కారణం అని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజుజు ఒప్పేసుకున్నారు. ఈ అంశం మీద మోదీ ఏ మాటా చెప్పలేదు కనక ఆ లోపాలు నిజమే అయి ఉంటాయి. వాటిని సరిదిద్దడం గురించి కూడా ప్రభుత్వ పెద్దల నోటి నుంచి ఒక్క మాట కూడా రావడం లేదు. ఆ లోపాలు ఎందుకు జరిగాయని, ఆ లోపాలకు బాధ్యత ఎవరిది అని ప్రజలు కూడా గట్టిగా ప్రశ్నించలేదు. ప్రతిపక్షాలు కూడా మిన్నకున్నాయి. పాకిస్థాన్ మీద మోదీ భారీ ఎత్తున దాడి చేస్తారని ఆశించిన వారూ ఉన్నారు.

సాధారణంగా కేంద్ర హోం శాఖ మంత్రి బాధ్యత వహించాలి. నైతికత ఏ మూలైనా మిగిలి ఉంటే రాజీనామా చేయాలి. అమిత్ షాను రాజీనామా చేయమని ఆదేశించడం కాదు కనీసం కోరే సాహసం చేసే పరిస్థితిలో మోదీ లేరు. అలాగే భద్రతా సలహాదారు అజిత్ దోబల్ మీద ఇంతవరకు ఏ చర్యా లేదు. ఉంటుందన్న సూచనా లేదు. మోదీ చేసిందల్లా కొత్త జాతీయ భద్రతా బోర్డు ఏర్పాటు చేయడమే. అంటే అంతకు ముందున్న వారి స్థానంలో కొత్త వారిని నియమించారు. ఈ బోర్డులో ఉండేది ఉద్యోగ విరమణ చేసిన భద్రతా అధికారులే. 2008 నవంబర్ 26న ముంబైలో తీవ్రవాదులు విరుచుకు పడినప్పుడు కనీసం 200 మంది మరణించారు. ఈ దాడులు నవంబర్ 29 దాకా నాలుగు రోజుల పాటు 12 చోట్ల జరిగాయి. 300 మంది గాయపడ్డారు. మొత్తం పది మంది తీవ్రవాదులు దాడి చేస్తే తొమ్మిది మందిని మన భద్రతా దళాలు హతమార్చాయి. పట్టుబడ్డ అజ్మల్ కసాబ్‌ను విచారణ జరిపి, మరణ శిక్ష విధించి ఉరి తీశారు. వెంటనే అప్పటి కేంద్ర హోం మంత్రి శివరాజ్ పాటిల్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి విలాస్ రావ్ దేశ్ ముఖ్ రాజీనామా చేయాల్సి వచ్చింది. దాడుల తీవ్రతను మృతుల సంఖ్యను బట్టి నిర్ధారించరు. కానీ పహల్గాం దాడుల తరవాత బాధ్యాతాయుతమైన పదవుల్లో ఉన్న ఒక్కరైనా రాజీనామా చేయలేదు. ముంబై దాడుల్లో జరిగినట్టుగా తీవ్రవాదులను అక్కడికక్కడే కాల్చి చంపడానికీ పహల్గాంలో భద్రతా దళాలే లేవు. వెరసి అందరూ చేతులు దులిపేసుకున్నారు. పాకిస్థాన్ మీద యుద్ధం కోసం ఉవ్విళ్లూరుతున్న వారు ఈ నేపథ్యాన్ని వాటంగా విస్మరించినట్టున్నారు. అందుకే అమిత్ షా రాజీనామా చేయాలని, అజిత్ దోబల్‌ను భద్రతా సలహాదారు బాధ్యతల నుంచి తప్పించాలని ఎవరూ కోరడం లేదు. ఇదో వైపరీత్యం. పహల్గాం దాడి తరవాత నిర్వహించిన అఖిలపక్ష సమావేశానికి ప్రధానమంత్రి మోదీ హాజరు కాకపోతే అడిగిన నాథుడే లేడు. మోదీ అన్నీ చూసుకుంటారన్న భ్రమ జనాన్ని కూడా ఆవహించినట్టుంది. పహల్గాం దాడి దేశ ప్రజలందరినీ కలచి వేయడం సహజమే. కానీ కశ్మీరీ ప్రజల స్పందన మునుపటికన్నా చాలా భిన్నంగా ఉంది. అక్కడి ప్రజలందరూ ముక్త కంఠంతో ఈ దాడిని గట్టిగా ఖండించారు. తాము తీవ్రవాదాన్ని సమర్థించేది లేదని తెగేసి చెప్పారు. కానీ కేంద్ర ప్రభుత్వంతో సహా అనేక మంది "దేశభక్తులు" ఇప్పటికీ కశ్మీరీ ప్రజలను కేవలం ముస్లింలుగానే చూస్తున్నారు. కానీ ఆ రాష్ట్ర ప్రజలు మాత్రం తాము తిరుగుబాటుదార్లం కామని, వేర్పాటు వాదులం అసలే కాదని నిరూపిస్తున్నారు. బాధితులకు సహాయం అందించడంలో కశ్మీరీ వాసులు ముఖ్యంగా ముస్లింలు తమ మతాన్ని పరిగణనలోకే తీసుకోలేదు. కేవలం మానవతా వాదులుగా స్పందించారు. మోదీ అను సరించిన విద్వేష రాజకీయాల దుష్పరిణామాలు ఎలా ఉంటాయో పహల్గాం దాడి తరవాత వివిధ రాష్ట్రాల్లో ఉన్న కశ్మీరీల మీద దాడులు నిరూపిస్తున్నాయి. ఈ దాడులు చెదురుమదురుగానే జరిగి ఉండొచ్చు. కానీ ఆ దాడుల వెనక ఉన్న మనస్తత్వం ముస్లింలంటే ద్వేషంతో నిండి పోయి ఉంది. పాకిస్థాన్‌ను కట్టడి చేయడానికి యుద్ధం ఒక్కటే మార్గం కాదు. ఇతర మార్గాలను అనుసరించే నైపుణ్యం, దౌత్య కుశలత మోదీ ప్రభుత్వానికి ఉన్నట్టు గత వారం రోజులుగా అయితే రుజువు కాలేదు. అదే విచారకరం.

ప్రజలకు దిక్కెవరు

ప్రజాస్వామ్య వ్యవస్థ చాలా గొప్పదని ప్రపంచంలో మనది అతి పెద్ద ప్రజాస్వామ్య దేశమని గొప్పలు చెప్పుకుంటాం. మనల్ని పాలించి సమాజాన్ని అభివృద్ధి పథంలో నడిపించమని ఓట్ల ద్వారా ఎన్నుకున్న ప్రజా నాయకులు అవినీతిపరులై జైలు పాలవుతున్నారు. ప్రభుత్వం ప్రజా క్షేమం కోసం కొన్ని చట్టాలు చేసి జీవోలు తెస్తే వాటిని ఎటువంటి స్వార్థం లేకుండా, పక్షపాతం లేకుండా అమలు పరచవలసిన ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు జైలు పాలవుతున్నారు. ఇటువంటి విపత్కర పరిస్థితిలో ఇక ప్రజల్ని ఆదుకునే దిక్కెవరో అర్థంకాక సామాన్యులు తల్లడిల్లి పోతున్నారు. ఇదిలా ఉంటే శ్రీశ్రీ అన్నట్లు కవిత్వానికి కాదేది అనర్హం అన్నట్లు అవినీతికి పార్టీలు అడ్డు రావన్నట్లు ప్రభుత్వ, ప్రతిపక్ష నాయకులు పార్టీ సంగతి పక్కన పెట్టి చేతులు కలిపి దోచుకుంటున్నారు. ప్రభుత్వ ఆస్తులు అంటే ప్రజలవే. నోరెత్తని ప్రజలు ఏమీ చేయలేరని పార్టీలు పక్కన పెట్టి చేతులు కలిపి దోచుకోవడం జరుగుతున్నా ప్రభుత్వం మౌనం వహించడం ప్రజలు జీర్ణించుకోలేక పోతున్నారు. ప్రతిరోజు వార్తా పత్రికలలో ప్రభుత్వ ఆస్తులు దోచుకుంటున్న వార్తలు ప్రచురితమవుతున్నాయి. ఏలేవారే దొంగలైతే ఇక దొంగల్ని పట్టుకుని ప్రజల ఆస్తులు కాపాడి ప్రజల్ని రక్షించేదెవరో అర్థం కాక సామాన్యులు తల గోక్కుని ముక్కున వేలేసుకుంటున్నారు.

సమ సమాజం నిర్మించి పేదలు లేని రాష్ట్రంగా రూపుదిద్ది ప్రపంచ చరిత్రలో ఎక్కడా లేని విధంగా ప్రపంచ పటంలో రాష్ట్రాన్ని నిలబెడతానన్న ముఖ్యమంత్రి చంద్రబాబు మాటలు వినడానికి ఎంతో ముచ్చటగా ఆనందంగా ఉన్నాయి. అలా చేయడం సామాన్యమైన విషయం కాదు.

ప్రపంచానికి కమ్యూనిజమే శరణ్యం అంటున్న కమ్యూనిస్టులు ఎన్నో ఏళ్లు తమ పాలనలో ఉన్న కేరళలోనే ఇంకా సాధ్యం కాలేదు కాని మన చంద్రబాబు చేస్తానంటున్నాడు. జరిగితే అంతకంటే ఆనందం మరొకటి ఉండదు. కాని అన్నా క్యాంటీన్లు ఎత్తి వేయలేని పరిస్థితి. స్వాంతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటినా అన్నార్తులు పెరుగుతూనే ఉన్నారు. అన్నా క్యాంటీన్లు ఎత్తి వేయడానికి మరో 75 ఏళ్లు పడుతుందా అని విజ్ఞులు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వానికి సంబంధించిన పార్టీ వారే ప్రజల ఆస్తులు దోచుకుంటుంటే ఆపలేని ప్రభుత్వం వర్గరహిత సమాజాన్ని తెచ్చి ప్రపంచంలోనే పేర్కొనదగిన రాష్ట్రంగా మారుస్తానంటుంటే నమ్మక తప్పదా అనే ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. ఇంటి యజమానే ఇంట్లో దొంగతనం చేయించినట్లు ప్రజల ఆస్తులు ప్రభుత్వం అస్మదీయులకు దారాదత్తం చేయడం అతి హేయమైన చర్యగా భావించాలి. వేల కోట్లు విలువ చేసే ప్రజల ఆస్తిని కేవలం ఎకరం అతి తక్కువకు యివ్వటం ప్రజా నాయకులు చేసే పని కాదు. సంపద సృష్టిస్తానని ఎన్నికల ముందు చెప్పి గద్దెనెక్కిన తరువాత ప్రజల సొమ్ము దాచేయడం పట్ల ప్రజలు జీర్ణించుకోలేక పోతున్నారు. వైకల్యం శరీరానికైనా కైవల్యం మనసుకు కావాలని అన్నట్లుగా రాజకీయ నాయకులు వ్యవహరిస్తున్నారు.

అసలు పార్టీలు ప్రజల కోసమా, నాయకుల కోసమా అని మేధావులు ప్రశ్నిస్తున్నారు. అధికారంలో ఉన్నవారు ప్రజల ఆస్తులు వారి ఇష్టమొచ్చినట్లు ఖర్చు చేస్తున్నారు. 10 శాతం ఓట్ల మెజారిటీతో విజయం సాధించినంత మాత్రాన ప్రజలందరి అంగీకారం ఉన్నట్లు కాదు. అమరావతికి 35 కిలోమీటర్ల దూరంలో గన్నవరంలో విమానాశ్రయం ఉండగా అమరావతిలో మరొకటి అవసరమా అని ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గతంలో అమరావతి నిర్మాణం కోసం ఇచ్చిన పొలాలు ఇంత వరకు అభివృద్ధి చేయకుండానే మరో 40 వేల ఎకరాలు సేకరిస్తామని చెప్పడంతో అక్కడి రైతులలో ఆందోళన మొదలయింది. రోడ్లు, ప్రాజెక్టులు లాంటి ముఖ్యమైన వసతుల గురించి ఆలోచించకుండా మొత్తం ప్రజల సొమ్మంతా అమరావతిలో గుమ్మరించడం ఎంత వరకు సబబు. కృష్ణానది పక్కన అందునా మునక ప్రాంతమని శివరామకృష్ణ కమిటీ దొనకొండ సురక్షితమైన ప్రాంతమని ఇచ్చిన నివేదిక తుంగలో తొక్కి ప్రజల సొమ్మంతా అమరావతిలో ఖర్చు చేయడం సరైంది కాదు. పైగా అమరావతిని దేశానికే రెండవ రాజధానిగా నిర్మిస్తానంటున్నారు. ఆ మాటలు బీజేపీకి వినసొంపుగా ఉండవచ్చుగాని ఆచరణ సాధ్యం కానిపని. పవన్, బాబు, బీజేపీ కలిసి రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేసి రెండవ రాజధానిగా అమరావతిని చేస్తామని కలలు కంటున్నారు. పరస్పర సహకారంతో రాష్ట్ర సమస్యలు తీరిస్తే అదే పదివేలు. పంట కాల్వలు పూడుకు పోయి పొలాలకు నీరందని సంగతి పట్టించుకోవటం లేదు. అన్నదాత రైతు సమస్యలు పరిష్కరించకుండా కేవలం అమరావతిపై దృష్టి పెట్టడం సముచితం కాదు. ప్రజల కనీస అవసరాలు తీరిన తరువాత మాత్రమే అమరావతిపై దృష్టి సారించాలని రైతు నాయకులు కోరుతున్నారు. ప్రత్యేక హోదా సంగతి పక్కన పెట్టి అప్పు కోసం ప్రదక్షణలు సరికాదు.

సెల్:9885569394

ట్రంప్ వాణిజ్య యుద్ధం: నేటి సామ్రాజ్యవాదం



డి. రాజా
సీపీఐ ప్రధాన కార్యదర్శి

1917లో అక్టోబరు విప్లవాన్ని విజయవంతం చేసిన వ్లదిమీర్ ఇల్యిచ్ లెనిన్ 20వ శతాబ్దపు గొప్ప సిద్ధాంత కర్త. విప్లవానికి ఆయన చేసిన గొప్ప సహకారం అత్యంత ప్రగాఢమైంది. విప్లవ ఆలోచన గొప్ప ఆయుధంలాంటిది. మార్క్స్, ఏంగెల్స్ పెట్టుబడీదారీ వ్యవస్థపై విమర్శకు పునాది వేశారు. లెనిన్ పెట్టుబడీదారీ వ్యవస్థ మార్పులను లోతుగా గ్రహించారు. ఈ వ్యవస్థ గుత్త పెట్టుబడీదారీ విధానం, ఆర్థిక పెట్టుబడి విధానానికి మార్పు చెందుతుందని గ్రహించారు. ఆయన పరిశోధన జరిపి చేసిన రచనలో పెట్టుబడీదారీ వ్యవస్థ ఉచ్ఛదశ (1916) సామ్రాజ్యవాదం అని పేర్కొన్నారు. పెట్టుబడీదారీ వ్యవస్థకు లోతుగా భౌతిక విశ్లేషణను అందించారు. భూస్వామ్య విధానంతో పోల్చినట్లయితే పెట్టుబడీదారీ వ్యవస్థలో ప్రగతిశీలమైన లక్షణాలు అంతరించాయి. భూస్వామ్య వ్యవస్థ తప్పనిసరిగా సామ్రాజ్యవాదంలోకి మార్పుచెందుతుందని ఆర్థిక పెట్టుబడి ప్రపంచవ్యాప్తంగా ఆధిపత్యం ఏర్పడుతుందని విశ్లేషించారు. మార్కెట్లు, పెట్టుబడి ఎగుమతి, ప్రపంచం హింసాయుతమైన విభజనకు దారితీస్తుందని చెప్పారు. పెట్టుబడీదారీ వ్యవస్థ ఉచ్ఛస్థాయికి అభివృద్ధి చెందడమే సామ్రాజ్యవాదం. ఈ వ్యవస్థలో గుత్తపెట్టుబడిదారులు, ఆర్థిక పెట్టుబడి ఆధిపత్యం చెంది స్థిరపడుతుంది. ఈ వ్యవస్థలో పెట్టుబడి ఎగుమతి ప్రాముఖ్యత సంతరించుకుంటోంది. ఆధునిక అంతర్ సామ్రాజ్యవాద ఘర్షణను మనం అర్థం చేసుకోవల్సి ఉంటుంది. 21వ శతాబ్దంలో దుందుడుకు వాణిజ్య యుద్ధాలు జరుగుతాయని అంచనావేశారు.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య యుద్ధానికి తెరదీశారు. ఇది సామ్రాజ్యవాదానికి ఖచ్చితమైన ఉదాహరణ. ఇది అత్యంత క్రూరమైన దురహంకారం రూపంలోఉంటుంది. "మళ్లీ అమెరికాను గొప్పదేశంగా" మారుస్తానని ట్రంప్ తన అభిప్రాయాన్ని వెల్లడించారు. ఇందులో ట్రంప్ దుందుడుకువాద జాతి ఆర్థికవిధానాలను అమలు చేయడానికి పూనుకున్నారు. పెట్టుబడీదారీ వ్యవస్థకు ఇది ప్రాతినిధ్యం వహించడంలేదు. అయితే ఈ విధానం అత్యంత తీవ్రతరం అవుతుంది. ట్రంప్ చేపట్టిన అధిక సుంకాల విధింపు, బెదిరింపు, ఏకపక్ష ఆర్థిక వత్తిడి అమెరికాలో ఆయన చెప్పినట్లు కార్మికుల రక్షణకు కాదు, అమెరికా ఆధిపత్యం దిగజారకుండా రక్షించడంకోసం ఈ విధానంలో ఆర్థిక, కార్పొరేట్ గుత్త పెట్టుబడీదారులు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో పెరిగిపోతారు. ట్రంప్ వాగాడంబరం, ఆయన తీసుకుంటున్న చర్యలు పాలకవర్గ ప్రయోజనాలకోసం ప్రపంచ పోటీలో ఆధిపత్యం కోసం ఆయన వెంపర్లాడుతున్నారు.

ట్రంప్ వాణిజ్యయుద్ధం ప్రత్యేకించి అత్యంత ప్రమాదరకమైంది. కేవలం ఆర్థిక అసహేతుకమైనదికాదు, ఇది నిర్లక్ష్యం, సైనిక లక్షణాలు కలిగి ఉంది. ట్రంప్ వాణిజ్య

యుద్ధంవైపు నడవడం, ఇతర ప్రముఖ ఆర్థిక వ్యవస్థలు విధ్వంసాన్ని సృష్టిస్తాయి. 2008 లో ఆర్థిక సంక్షోభాన్ని ప్రపంచం ఎదుర్కొన్న విధంగానే అత్యంత తీవ్రమైన ఆర్థిక యుద్ధం జరగవచ్చు. బహుళ ఒప్పందాలను బహిరంగంగానే ఉల్లంఘించడం ఆంక్షలు విధిస్తానని బెదిరించడం, డాలర్‌ను ఆయుధంగా మలచుకోవడం, వాణిజ్య విధానాన్ని ప్రపంచ రాజకీయ జగడంగా మార్చుచేయడం జరుగుతోంది. లెనిన్ అభివర్ణించినట్లుగా "యుద్ధాలు విప్లవాలకు" దగ్గరగా ట్రంప్ తీసుకువెళుతున్నారు. ట్రంప్ తీసుకుంటున్న చర్యలు అంతర్జాతీయ సంబంధాల సైనికీకరణ, జాత్యహంకారం, దురహంకారం, సామ్రాజ్యవాదాన్ని పెంపొందించుకోవడానికి బరితెగించి ఆధిపత్యాన్ని కొనసాగించాలని ట్రంప్ ప్రయత్నిస్తున్నారు.

ట్రంప్ ఆర్థిక జాతీయవాద అనంతరం, క్రూరమైన విద్వేష ద్వేషం, జాతి వివక్షకు దారితీస్తుంది. పెట్టుబడి ఏమాత్రం ఆటంకం లేకుండా పన్నులు, క్రమబద్ధీకరణ లేకపోవడం ప్రజలు ప్రత్యేకించి కార్మికులు, వలసవాదులపై అత్యతం దారుణంగా ఆంక్షలు విధిస్తున్నారు. వలసవాదంపై నిషేధం, సరిహద్దు గోడలు నిర్మించడం, డిటెన్షన్ క్యాంపులు, జాతివివక్ష రాజ్యాలను పరిరక్షణ అమెరికా ప్రజలకు మాత్రమే ఉద్యోగాలను పరిరక్షించడాన్ని న్యాయబద్ధమైనదిగా ట్రంప్ ప్రకటిస్తున్నాడు. కార్పొరేషన్లు కూడా కార్మికులను ఇతర ప్రాంతాల నుంచి తీసుకురావడం ద్వారా యూనియన్లను ధ్వంసం చేస్తున్నారు. పెట్టుబడి స్వేచ్ఛగా ఒక చోట నుంచి మరొక చోటకు సంచరించడం కార్మికులను మరొకచోటకు తిరగకుండా వత్తిడి చేయడంలాంటి చర్యలు సామ్రాజ్యవాదానికి కీలకమైనది. అంతేకాదు, దోపిడీ చేయడానికి ఆయా కంపెనీలు కార్మికులను తగ్గించి వేస్తున్నాయి. కార్మికవర్గాన్ని విభజించడం దురహంకార జాతీయ విషం.

అలాంటి ధోరణి విధానపరమైన ఉల్లంఘనలు కాదు. ప్రపంచవ్యవస్థను దిగజార్చే భావనలనే లెనిన్ విశ్లేషణ మనకు సహాయపడుతుంది. ఈ చట్రంలో గుత్త పెట్టుబడిదారీ వ్యవస్థలో విభేదాలు పరిష్కారంకావు. ప్రపంచబ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధికి చెందిన బ్రెట్టన్ వుడ్స్ సంస్థ ఏర్పడినప్పటి నుంచి ప్రపంచాన్ని తికమకపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రత్యేకించి ప్రపంచ దక్షిణ దేశాలు సంపదను కేంద్రీకరించేందుకు అవసరమైన విధానాలను అనుసరిస్తున్నారు. పెద్ద సంపన్న దేశాల మధ్య అనారోగ్యకరమైన పోటీ అనివార్యంగా ఘర్షణ సృష్టిస్తుంది. సామ్రాజ్యవాద దేశాలలో కార్మికవర్గ ప్రతిరూపాలు అణచివేతకు గురైన దేశాలలో స్పష్టంగా కనిపిస్తాయి. శాంతి పేరుతో యుద్ధానికి సిద్ధమవుతారు. అభివృద్ధి పేరుతో దోపిడీని కొనసాగిస్తారు. ఈ అంశంపై లెనిన్ ఇలా రాశారు. "పెట్టుబడిదారీ వ్యవస్థ ఎంతగా అభివృద్ధి చెందుతుందో ఐక్య సామ్రాజ్యవాద బూర్జువా వ్యవస్థను కార్మికవర్గం మరింత ఎక్కువగా అనుభవిస్తారు." అప్పుడు ఎలా ముందుకు వెళ్లాలి? విధ్వంసకర, జాత్యహంకార, సైనిక విధానాల సంకెళ్ల నుంచి మనం ఎలా బైటపడాలి దీనికి జవాబు విప్లవకర మార్క్సిజం, లెనినిజం. అంతర్జాతీయ కార్మికవర్గం సామ్రాజ్యవాద నిజమైన లక్షణ ముసుగును తొలగించడం ద్వారా బలోపేతం అవుతుంది. రక్షణవాదం, ప్రజానుకూల వాగ్దానాలు తిరస్కరించాలి. సోషలిజం స్థాపన కోసం పోరాటం చేయాలి. కలిసికట్టుగా విముక్తి పొందాలని కార్మికవర్గం తప్పనిసరిగా భావించాలి. పరస్పర సంఘీభావం, ఉమ్మడిపోరాటం కార్మికవర్గం అనుసరించాలి. విప్లవకర ఆచరణ లెనిన్ బోధించిన అంతర్జాతీయ వాదాన్ని ధైర్యంగా అనుసరించాలి. వలసవాదం, ఆర్థిక బంధంలాంటి దుర్మార్గమైన విధానాన్ని బహిర్గతం చేయుడంద్వారా విజయాన్ని పొందవచ్చు. ప్రజా సమూహాలలోని కార్మికవర్గం సామ్రాజ్య వాదాన్ని ద్వేషించడమేగాక దానిపై పోరాటం చేయాలని గట్టిగా నిర్ణయించుకోవాలి. దీని అర్థం ఏమంటే ఆర్థిక వత్తిడి, జాత్యహంకారాన్ని వ్యతిరేకించడమేగాక ఐక్యతను నిర్మించుకోవాలి. ఒక కార్మికుడు మరొక కార్మికునిపైన భావజాలంతో కూడిన ఆయుధాలను ధ్వంసం చేయాలి.

అమెరికా కార్మికవర్గ పరిరక్షణ అనేది ట్రంప్ చేస్తున్న వాణిజ్య యుద్ధానికి ఏ మాత్రం పొంతనలేదు. సామ్రాజ్యవాద క్షీణతను ప్రజలకు విపులీకరించాలి. సామ్రాజ్యవాదం శాంతియుత ప్రపంచ వ్యవస్థను సమకూర్చలేదు. ఇందుకు ప్రత్యామ్నాయం నయా ఉదారవాదాన్ని అనుసరించడం కాదు, అసమానతను, సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని పెంచిపోషించడం కాదు. సోషలిజంవైపు ముందుకు నడిచేందుకు కృషిచేయాలి. మార్క్స్, లెనిన్ వారసత్వాలను, వారు స్ఫూర్తినిచ్చిన విప్లవకర ఉద్యమాలను నిర్వహించాలి. అప్పుడు మాత్రమే ప్రపంచ దోపిడీ నుంచి బైటపడగలం. సమానత్వం, సహకారం కొనసాగించాలి. యుద్ధాల మధ్య శాంతి నెలకొనదు. ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థనుంచి బైటపడేందుకు పోరాడాలి.

పాకిస్థాన్ వైపు చైనా మొగ్గిందా?

ఎం కోటేశ్వరరావు

పహల్గామ్ ఉగ్రదాడి ఉదంతంలో పాకిస్తాన్ వైపు చైనా మొగ్గిందనే అర్థం వచ్చే రీతిలో మీడియాలో వార్తలు వచ్చాయి. ఉగ్రవాదులకు చైనా తయారీ సమాచార పరికరాలు అందినట్లు చిత్రించారు. కమ్యూనిజం, చైనాపై వ్యతిరేకతను రెచ్చగొడుతున్నవారు ఇలాంటి అభిప్రాయం కలిగించటం ఆశ్చర్యం కలిగించటం లేదు. అసలు ఎవరేమి చెప్పారో ముందు చూడాలి. మన భాగస్వామ్య దేశం, నరేంద్రమోదీ జిగినీ దోస్తుగా వర్ణించిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏం మాట్లాడాడు.రోమ్‌లో పోప్ ఫ్రాన్సిస్ అంత్యక్రియలకు హాజరయ్యేందుకు విమానంలో వెళుతూ విలేకర్ల ప్రశ్నకు సమాధానమిచ్చాడు. ఎఎన్ఐ ఇచ్చిన వార్తలో ఇలా ఉంది. " నేను భారత్‌కు ఎంతో సన్నిహితుడిని, అలాగే పాకిస్థాన్‌కూ ఎంతో దగ్గర. వారు కశ్మీరు సమస్య మీద వెయ్యి సంవత్సరాల నుంచి దెబ్బలాడుకుంటున్నారు. అంతకు మించి ఎక్కువ సంవత్సరాల నుంచే ఉండవచ్చు, సరిహద్దుల గురించి 1,500 సంవత్సరాలుగా ఉద్రిక్తతలు ఉన్నాయి. ఉగ్రవాద దాడి చెడ్డది, భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు ఎప్పుడూ ఉన్నవే. ఏదో విధంగా వారే పరిష్కరించుకుంటారు. ఇద్దరు నేతలూ నాకు తెలుసు" అన్నాడు.

చైనా పత్రిక గ్లోబల్ టైమ్స్ వార్తలో ఇలా ఉంది. "పాకిస్థాన్, భారత్ మధ్య తలెత్తుతున్న పరిస్థితిని సన్నిహితంగా చైనా పరిశీలిస్తున్నది. నిష్పాక్షిక దర్యాప్తు జరపాలన్న చొరవకు మద్దతు ఇస్తున్నది. ఉభయపక్షాలూ ఉద్రిక్తతలను తగ్గించేందుకు పూనుకోవాలని, సంయమం పాటిస్తాయని ఆశాభావం వెలిబుచ్చుతున్నాం." పాకిస్థాన్ ఉప ప్రధాని, విదేశాంగ మంత్రి మహమ్మద్ ఇషాక్ దార్ ఆదివారం ఫోన్ చేసిన సందర్భంగా చైనా కమ్యూనిస్టు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, విదేశాంగ మంత్రి వాంగ్ ఇ మాట్లాడుతూ అంతర్జాతీయ సమాజానికి ఎప్పటికప్పుడు పరిస్థితిని వివరిస్తున్నామని చెప్పాడు. అన్ని దేశాలూ ఉమ్మడిగా ఉగ్రవాదాన్ని ఎదుర్కోవాల్సి ఉంది. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పాకిస్థాన్ తీసుకుంటున్న చర్యలను నిరంతర చైనా సమర్థిస్తూనే ఉందని వాంగ్ చెప్పాడు. ఎల్లవేళలా వ్యూహాత్మక భాగస్వామిగా, గట్టి స్నేహితుడిగా ఉన్న పాకిస్థాన్ భద్రతాపరమైన ఆందోళనలను చైనా పూర్తిగా అర్థం చేసుకుంటున్నదని, సార్వభౌమత్వం, భద్రతా ప్రయోజనాలకు పూర్తి మద్దతు ఇస్తామని వాంగ్ ఇ చెప్పారు. రెండు దేశాల మధ్య వివాదం ప్రాంతీయ శాంతి, స్థిరత్వాలకు మంచిది కాదని కూడా అన్నాడు. పాక్ మంత్రి ఫోన్ చేశాడు తప్ప చైనా మంత్రి చేయలేదని గ్రహించాలి. తటస్థ, పారదర్శక పద్దతిలో పహల్గాం ఉదంతంపై దర్యాప్తు జరపాలని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ కోరారు. రెండు దేశాల మధ్య మధ్యవర్తిత్వం వహించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు ఇరాన్, సౌదీ అరేబియా ముందుకు వచ్చినట్లు వార్తలు వచ్చాయి.

ఒక మిత్రదేశ విదేశాంగ మంత్రి ఫోన్ చేసినప్పుడు ఎవరైనా స్పందించటం సహజం. పాకిస్థాన్ మాదిరి భాగస్వాములు లేదా మిత్రదేశాలతో మన దేశం మాట్లాడినట్లు ఎలాంటి వార్తలు లేవు. చైనాతో మాట్లాడతారని ఎవరూ అనుకోరు. మాట్లాడాలా లేదా అన్నది కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన అంశం. ఈ సందర్భంగా మీడియాలో మరోసారి చైనా వ్యతిరేక ప్రచారం మొదలైంది. చైనా తయారీ ఆధునిక అల్ట్రాసెట్ వాకీటాకీలతో ఉగ్రవాదులు తమ నేతలతో మాట్లాడారని, వారికి అవి ఎలా వచ్చాయంటూ చైనా అంతర్గతంగా దాడికి సహకరించిందా అని కొందరు ప్రశ్నిస్తున్నారు. చైనా దగ్గర చౌకరకం వస్తువుల తయారీ తప్ప ఆధునిక పరిజ్ఞానం లేదని గతంలో, ఇప్పటికీ ప్రచారం చేస్తున్న వారి నుంచే ఇప్పుడు ఇలాంటి మాటలు వస్తున్నాయి. ఇలాంటి పరికరాలు గతంలోనే ఉగ్రవాదుల దగ్గర దొరికినట్లు వార్తలు వచ్చాయి. అల్ట్రాసెట్ వాకీటాకీలను అంతర్జాతీయంగా నిషేధించలేదు. అలాంటివి ఒక్క చైనా మాత్రమే తయారు చేయటం లేదు, ప్రతి అగ్రదేశం వద్దా ఉన్నాయి. చైనా దగ్గర వాటిని ఎవరైనా కొనుగోలు చేయవచ్చు, ఆ క్రమంలో పాకిస్థాన్ కొనుగోలు చేసి ఉగ్రవాదులకు ఇచ్చి ఉండవచ్చు, దానికి చైనాను ముడిపెట్టటం సమస్య. మన దేశంలో నక్సలైట్ల దగ్గర రష్యన్ ఏకె రకం తుపాకులు ఉన్నాయి, అవి ప్రపంచంలో అనేక చోట్ల, మన దేశంలో కూడా తయారవుతున్నాయి. అంటే నక్సల్స్‌కు మన దేశమే విక్రయిస్తోందని అర్థమా !



సామాజిక మాధ్యమంలో వెలువడుతున్న పోస్టులు, వ్యాఖ్యలను చూస్తే ఉన్మాదం ఎంతగా తలకెక్కిందో అర్థం అవుతున్నది. జీలం నది భారత్‌లో పుట్టి పాకిస్థాన్‌లో సింధునదిలో కలసి అరేబియా సముద్రంలోకి ప్రవహిస్తుంది. సింధు జలాల ఒప్పందాన్ని పక్కన పెట్టినట్లు మన ప్రభుత్వం ప్రకటించిన తరువాత ఎలాంటి ముందస్తు హెచ్చరికలేకుండా జీలం నది నీటిని విడుదల చేయటంతో మన కాశ్మీరులోని అనంతనాగ్ జిల్లా నుంచి పాక్ ఆక్రమిత కాశ్మీరులో ప్రవేశించి ముజఫరాబాద్ పరిసరాలకు వరద ముప్పు తెచ్చినట్లు, అనేక మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు పాకిస్థాన్ ప్రకటించింది. దీని గురించి అవునని గానీ కాదని గానీ మన ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయలేదు. భారత్ దెబ్బ అంటే ఇట్లుంటది అన్నట్లుగా కొందరు సంబరపడుతున్నారు. ఎవరి మీద ఈ వరద దాడి జరిగిందో, దాని పరిణామాలు, పర్యవసానాలను గమనించే స్థితిలో ఇలాంటి బాపతు లేకపోవటం విషాదం, గర్హనీయం. మన కశ్మీరు నుంచి విడదీసిన ముక్కలో ముజఫరాబాద్ ఉంది. దాన్నే మనం ఆక్రమిత కశ్మీరు అంటున్నాం, పాకిస్థాన్ విముక్త కశ్మీరు అని పిలుస్తున్నది. మనదేశంలో అంతర్భాగంగా ఉన్న ముక్కను కూడా విముక్తి చేసి స్వతంత్ర కశ్మీరు దేశాన్ని ఏర్పాటు చేస్తామని పాక్ చెబుతున్నది. అందుకే దాన్ని తనలో విలీనం చేసుకోలేదు, పార్లమెంటులో ప్రాతినిధ్యం కల్పించలేదు, తన సొంత రాష్ట్రంగా కూడా పరిగణించటంలేదు తప్ప మిగతా అన్ని విషయాల్లో తన అంతర్భాగంగానే చూస్తున్నది. ఎప్పటికైనా ఆక్రమిత కశ్మీరును మనం తిరిగి తెచ్చుకోవాల్సిందే. అందుకే అసెంబ్లీలో ఆ ప్రాంతానికి కొన్ని సీట్లు కేటాయించి, అవి మినహా మిగిలిన వాటికే ఎన్నికలు జరుపుతున్నాం. మొత్తం 114 సీట్లకు గాను 24 పాక్ ఆక్రమిత కశ్మీరుకు కేటాయించారు, 90స్థానాలకు ఎన్నికలు జరిగాయి. అప్పుడప్పుడు ముజఫరాబాద్‌లో తాము భారత్‌లో విలీనం అవుతామంటూ ప్రదర్శనలు జరుగుతుంటాయి, వాటిని మన మీడియా కూడా చూపుతుంది. ఇప్పుడు మన దేశం ఆ పట్టణం, పరిసరాలను పహల్గాం దాడికి ప్రతీకారంగా వరద నీటితో ముంచెత్తితే వారు మనకు అనుకూలంగా ఉంటారా, ప్రతికూలంగా మారతారా? కొంత మంది ఉగ్రవాదులు చేసిన దానికి సామాన్యుల మీద ప్రతీకారం తీర్చుకుంటే ఉగ్రవాదులకు ఆశ్రయం మరింత పెరుగుతుందా, తగ్గుతుందా ? మానవహక్కులకు, అంతర్జాతీయ ఒప్పందాలకు ఇది పూర్తి విరుద్ధం. అంతర్జాతీయ సమాజం ముందు తలదించుకోవాల్సిందే. ఉగ్రవాదులను పట్టుకోవాల్సిందే, నిర్దాక్షిణ్యంగా కాల్చి పారేయాల్సిందే. మన దేశంలో నక్సల్స్‌ను పట్టుకొనే పేరుతో ఆదివాసీల మీద పోలీసులు, భద్రతా దళాలు దాడులు చేస్తే జరిగిందేమిటి ? దాన్ని అవకాశంగా తీసుకొని భయంతో లేదా పోలీసుల మీద కసితో మరింతగా నక్సల్స్‌కు వారు ఆశ్రయమిచ్చారా లేదా !

మన దగ్గర ఉన్న రాఫెల్ యుద్ధ విమానాలను ఎదుర్కొనేందుకు వీలుగా నిర్ధారణ కాని వార్తలంటూ చైనా తన ఆధునిక పీఎల్-15 క్షిపణులను అత్యవసరంగా పాకిస్థాన్‌కు తరలించినట్లు క్లాష్ రిపోర్టు అనే మీడియాలో రాశారు. ఇవి రాడార్ల నియంత్రణలో గగన తలం నుంచే గగనతలంలో ప్రయోగించే కంటికి కనిపించని దీర్ఘశేణి క్షిపణులు. వీటిని ఒకసారి వదిలిన తరువాత మధ్యలో కూడా దిశను మార్చి లక్ష్యాల వైపు ప్రయోగించవచ్చు. పాక్ యుద్ధ విమానాలకు అమర్చిన పీఎల్-10, పీఎల్-15 క్షిపణులంటూ ఎక్స్‌లో బొమ్మలను పెట్టారు. అధికారిక వర్గాలేవీ నిర్ధారించలేదని కూడా వార్తలో పేర్కొన్నారు. వీటిని తొలిసారిగా చైనా 2024 నవంబరులో ఒక ప్రదర్శనలో చూపిందట. ఇంత అత్యాధునిక క్షిపణులను ఏ దేశమూ కొన్ని నెలల్లోనే ఇతర దేశాలకు విక్రయించదు.ఈ క్షిపణులను అమెరికా ఏఐఎం-120డి అనే వాటికి ధీటుగా చైనా తయారు చేసింది. ఇవి ఐరోపా ఎంబీడీఏ మెటోయర్‌కు సమానమైనవని కూడా చెబుతున్నారు. ఫ్రాన్సు నుంచి మనం కొనుగోలు చేసిన రాఫెల్ విమానాలు వీటిని ప్రయోగించేందుకు వీలు కలిగినవి. ఇవి చైనా ఇతర దేశాలకు ఎగుమతి చేస్తున్న పీఎల్-15ఇ రకంతో సమానమని నిపుణులు చెబుతున్నారు, అవి 145 కిలోమీటర్ల లక్ష్యాలను దెబ్బతీస్తాయని వార్తలు వచ్చాయి.2019లో బాలకోట్‌పై మన దేశం సర్జికల్ దాడులు జరిపినప్పుడు పాకిస్తాన్ మన మిగ్-21 బైసన్ అనే విమానాన్ని కూల్చివేసింది. దానికి అమెరికా అందచేసిన ఎఫ్-16విమానానికి అమెరికా నుంచే తెచ్చుకున్న మధ్యశ్రేణి క్షిపణి అమ్‌రామ్ అమర్చి కూల్చివేసింది. నాటికి మన దగ్గర అలాంటివి లేవు.

ఇప్పుడు పాకిస్థాన్ సేకరిస్తున్న ఆయుధాల గురించి చెబుతుంటే కొంత మందికి రుచించదు. విపరీత అర్థాలు తీసే ప్రబుద్ధులు కూడా ఉంటారు. ప్రతి దేశం తన భద్రతకు ప్రాధాన్యత ఇస్తుంది. ఇప్పుడు పహల్గామ్ దాడికి ప్రతీకారం తీర్చుకొనేందుకు మన దేశం ఉన్న సమయంలో పాకిస్థాన్ ఆర్మీ చైనా నుంచి ఆధునిక క్షిపణులు సేకరిస్తున్నదని నిర్ధారణగాని వార్తలు వచ్చాయి. సాధారణ పరిస్థితి ఉన్నప్పుడే మన దేశం అమెరికా ఆంక్షలు, బెదిరింపులను కూడా ఖాతరు చేయకుండా రష్యా నుంచి ఆధునిక ఎస్-400 శామ్ వ్యవస్థలను కొనుగోలు చేసింది. ఎందుకు అంటే చైనా, పాకిస్థాన్ల నుంచి వచ్చే ముప్పును ఎదుర్కొనేందుకు అని చెప్పారు. మూడింటిని ఇప్పటికే మోహరించాం. ఇంకా రెండు వ్యవస్థలు రష్యా నుంచి రావాల్సి ఉంది. వాటిని ఉపరితలం నుంచి ఆకాశంలోకి ప్రయోగించేందుకు, ఎక్కడికి కావాలంటే అక్కడికి తరలించవచ్చు. ఇవి అన్ని రకాల యుద్ధ విమానాలు, డ్రోన్లు, క్షిపణులను గుర్తిస్తాయి, క్షిపణులతో వాటి మీద దాడులు చేస్తాయి. ఎనభై లక్ష్యాలను 380 కిలోమీటర్ల పరిధిలో ఛేదిస్తాయి. అందువలన పాకిస్థాన్ వైపు నుంచి వచ్చే ముప్పును ఎదుర్కోగల స్థితిలో మనదేశం ఉంది !

పాకిస్థానీయులకు ఊరట

గడువు పొడిగించిన కేంద్రం

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్ర దాడితో భారత్, పాక్ సంబంధాల్లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. దీంతో పాక్ జాతీయులు మన దేశం వీడి వెళ్లేందుకు కేంద్రం గడువు విధించింది. అయితే పాక్ జాతీయులు తిరిగి వెళ్లడానికి ఇచ్చిన గడువు మంగళవారంతో ముగిసింది. ఏప్రిల్ 30న వాఘా-అటారీ సరిహద్దు మూసివేస్తామని గతంలో కేంద్ర హోంమంత్రిత్వశాఖ ఇచ్చిన ఉత్తర్వును తాజాగా సవరించినట్లు సమాచారం. ఆంక్షలు సడలడంతో తదుపరి ఆదేశాలు వెలువడేవరకు వారు ఆ సరిహద్దు నుంచి పాక్ వెళ్లేందుకు వెసులుబాటు కలిగిందని జాతీయ మీడియా వెల్లడించింది. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్‌ను వీడి వెళ్లాలని పాక్ జాతీయులను కేంద్ర ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో బుధవారం నాటికి మొత్తం 786 మంది వెళ్లిపోయారు. వారిలో 55 మంది దౌత్యాధికారులు, వారి డిపెండెంట్లు, సహాయక సిబ్బంది, 8 మంది పాకిస్థాన్ వీసాలున్న భారతీయులున్నారు. గత ఆరు రోజుల్లో వారంతా అటారీ-వాఘా సరిహద్దు మీదుగా పాకిస్థాన్‌కు వెళ్లిపోయారు. పాకిస్థాన్ నుంచి భారత్‌కు 1,465 మంది వచ్చారు. వీరిలో 25 మంది దౌత్యాధికారులు, అధికారులు, దీర్ఘకాల వీసాలు ఉన్న 151 మంది పాకిస్థాన్ జాతీయులు ఉన్నారు.

రాణా వాయిస్, చేతిరాత నమూనా సేకరణకు కోర్టు అనుమతి

న్యూఢిల్లీ: ఎన్ఐఏ కస్టడీలో ఉన్న ముంబై ఉగ్రదాడి కేసులో ప్రధాన సూత్రధారి తహవూర్ హుస్సేన్ రాణా వాయిస్, చేతిరాత నమూనాలు సేకరించేందుకు దిల్లీ ప్రత్యేక కోర్టు ఎన్ఐఏకు అనుమతి ఇచ్చింది. తొలుత అరెస్టయిన సమయంలో రాణాకు విధించిన 18 రోజుల కస్టడీ గడువు సోమవారంతో ముగియగా... అతడిని ఎన్ఐఏ కోర్టులో హాజరు పరిచారు. మరో 12 రోజుల కస్టడీ పొడిగిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. దీంతో మరికొన్ని రోజులు అతడు ఎన్ఐఏ కస్టడీలోనే ఉండనున్నాడు. దీంతో రాణా వాయిస్, చేతిరాత నమూనాల సేకరణకు ఎన్ఐఏ అనుమతి కోరగా అందుకు అనుమతించినట్లు తెలుస్తోంది. ఎన్ఐఏ అదుపులో ఉన్న రాణాను ఇటీవల ముంబై క్రైమ్ బ్రాంచ్ పోలీసులు విచారించారు. విచారణకు అతడు సహకరించకుండా... తప్పించుకునే రీతిలో సమాధానాలు చెప్పినట్లు వార్తలు వచ్చాయి. ముంబై ఉగ్రదాడులతో తనకు ఎలాంటి సంబంధం లేదని విచారణలో భాగంగా రాణా వెల్లడించినట్లు సమాచారం.

ఆ సీఎంలు ఇప్పుడేమంటారు!

కుల గణనపై ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా

న్యూఢిల్లీ: కుల గణన అన్నది అర్బన్ నక్సల్ ఆలోచన అని, కటేంగే తో బటేంగే (విభజనకు గురైతే వినాశనమే) అంటూ నాడు రెచ్చిపోయిన బీజేపీ ముఖ్యమంత్రులు తమ తలలు ఎక్కడ పెట్టుకుంటారు అంటూ ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా ప్రశ్నించారు. కుల గణనను నాడు వ్యతిరేకించిన వారు ఇప్పుడు అందుకు అంగీకరించడం వెనుక కారణం ఏమిటి? దాని వాస్తవిక అవసరాన్ని మోదీ ప్రభుత్వం గ్రహించిందా లేకపోతే సంబంధిత విధానాలకు అర్థం ఉండదు అని వ్యాఖ్యానించారు. 'జన గణనకు పునర్విభజన-మహిళా రిజర్వేషన్లు-కుల గణనతో ముడిపెట్టారు. అయితే ఆ ప్రక్రియ ఏ విధంగా సాగబోతోందన్న స్పష్టత కేంద్రం ఇవ్వలేదు. ఇందుకు సమయాన్ని నిర్దేశించలేదు. ఎలాంటి కార్యచరణ చేపట్టబోతోందన్నదిక వెల్లడించలేదు' అని ఓ ఆంగ్ల వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మనోజ్ అన్నారు. కుల గణనపై ప్రతిపక్షాలు, బహుజల డిమాండ్‌ను తోసిపుచ్చుతూ... విభజన రాజకీయాలు అంటూ అనుచిత వ్యాఖ్యలతో అవమానించిన బీజేపీ అగ్ర నాయకులు, ఆ పార్టీ ముఖ్యమంత్రులు ఇప్పుడు తమ తలలను ఎక్కడ పెట్టుకుంటారని మనోజ్ ఎద్దేవా చేశారు. పహల్గాం దాడి నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మీరు భావిస్తున్నారా అని వ్యాఖ్యత ప్రశ్నించగా బీజేపీ నిజంగా మేల్కొన్నదా? అని ఆయన ప్రశ్నించారు. కొన్ని రోజులుగా ఫొటోలే కనిపిస్తున్నాయని దుయ్యబట్టారు. బీహార్ ఎన్నికల దృష్ట్యా ఈ నిర్ణయం వచ్చిందన్న విమర్శలపై స్పందిస్తూ ముందు వద్దన్నారు... ఇప్పుడు ఎలా ఒప్పుకున్నారన్నది తేలాల్సి ఉందని మనోజ్ చెప్పారు. ఎంతో ప్రాధాన్యతను కలిగిన జన గణన స్థాయిని మోదీ ప్రభుత్వం దిగజార్చిందని విమర్శించారు. 'జన గణనతో కుల గణనకు... డీలిమిటేషన్‌తో ముడిపెట్టింది. పార్లమెంటు, అసెంబ్లీలలో మహిళా కోటా కూడా జన గణన, పునర్విభజనపైనే ఆధారపడి ఉంది. ఒకదానితో ఒకటిగా చాలా వాటికి ముడిపెట్టి... ఏ విధంగా ముందుకెళ్లనున్నదో వెల్లడించాలి' అని మనోజ్ ఝా అన్నారు. కుల గణనను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకుంటున్నట్లు ప్రతిపక్షాలు విమర్శిస్తున్నాయని కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ అనడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన విజ్ఞతను ప్రశ్నించారు. కుల గణన వంటి సామాజిక అంశాలపై అవగాహన లేకపోవడం ఆశ్చర్యం కలిగించిందని అన్నారు. అశ్వినీ వైష్ణవ్ ఉన్నత చదువులు చదివారు కానీ కులం అంటే ఏమిటో.. కులానికి వర్గం/తరగతితో సంబంధం ఏమిటో తెలియదా అని ప్రశ్నించారు. కొన్ని కులాలకు దక్కాల్సిన స్థాయి ప్రాతినిధ్యం ఎందుకు లేదో ముందుగా తెలుసుకోవాల్సిన అవసరం వైష్ణవ్‌కు ఉందని అన్నారు. అయితే ఇవన్నీ రాజకీయ అంశాలనడంలో వైష్ణవ్ మర్మమేమిటో అర్థం కాలేదని మనోజ్ ఝా వ్యాఖ్యానించారు.

హెడ్‌లైన్ సరే... డెడ్‌లైన్ ఏది

- కులగణన చేస్తామన్న కేంద్ర ప్రకటనపై జైరామ్ విమర్శ
- ప్రధాని, హోంమంత్రి అర్బన్ నక్సల్స్ ఎప్పుడయ్యారని ఎద్దేవా
- రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి ఎత్తివేయాలని డిమాండ్

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'డెడ్‌లైన్ లేకుండా హెడ్‌లైన్ ఇవ్వడంలో మాస్టర్' అంటూ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ ఎద్దేవా చేశారు. రాబోయే జనాభా లెక్కల్లో కుల గణన చేర్చాలని కేంద్రప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ప్రధానిపై ఆయన విమర్శలతో విరుచుకుపడ్డారు. దిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడుతూ... కులగణన చేపడతామన్న నిర్ణయం వెనుక కేంద్రం ఉద్దేశం గురించి అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయన్నారు. కులగణనతో కూడిన జన గణనను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను వెంటనే ప్రకటించాలన్నారు. ముందు రిజర్వేషన్లపై 50 శాతం పరిమితి అనే అడ్డంకిని తొలగించాలని ఆయన స్పష్టం చేశారు. మోదీ ప్రభుత్వం దీన్ని చేయకుండా ఆపేది ఏమిటని జైరామ్ ప్రశ్నించారు. రాజ్యాంగ సవరణ ద్వారా రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని తొలగించాలని కాంగ్రెస్ ఎప్పటినుంచో డిమాండ్ చేస్తోందని, ఇది జరిగినప్పుడే కుల గణన అర్థవంతంగా ఉంటుందని ఆయన అన్నారు. 2021లో భారత జనగణనను రూ.8,254 కోట్లతో నిర్వహించాలనే ప్రతిపాదనను కేంద్ర మంత్రివర్గం ఆమోదించిందని పేర్కొన్న డిసెంబర్, 2019 కేబినెట్ సమావేశ పత్రికా ప్రకటనను జైరామ్ ఉటంకిస్తూ... ఆ పత్రికా ప్రకటనలో కుల గణన గురించి ప్రస్తావించలేదని తెలిపారు. 'ఈ జన గణన జరగలేదని...ఆరు సంవత్సరాలు గడిచిపోయాయని అందరికీ తెలుసు. ఆశ్చర్యకరంగా ప్రభుత్వం మళ్లీ నిన్న ప్రకటన చేసింది' అని ఆయన అన్నారు. '2025-26 బడ్జెట్‌లో జనాభా గణన కమిషనర్ కార్యాలయానికి రూ.575 కోట్లు మాత్రమే కేటాయించారు. దీంతో వారు ఎలాంటి జన గణన చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ప్రభుత్వ ఉద్దేశం ఏమిటి? కేవలం శీర్షిక ఇవ్వడం గురించేనా ఈ ప్రకటన' అని జైరామ్ కేంద్రప్రభుత్వాన్ని నిలదీశారు. నిజానికి 2021 లో జన గణన పూర్తి చేయాల్సి ఉందన్నారు. ప్రభుత్వం కోవిడ్ మహమ్మారిని సాకుగా చూపుతుంది కానీ 50 కి పైగా దేశాలు కోవిడ్ సమయంలో తమ జనగణన నిర్వహించాయని తెలిపారు. 2023, 2024 లో కోవిడ్ లేకపోయినా జనగణన పూర్తి చేయలేకపోయారని విమర్శించారు.

గత సంవత్సరం ప్రధాని టీవీ ఛానెళ్లకు వరుస ఇంటర్వ్యూలు ఇస్తున్నప్పుడు... కుల గణన గురించి మాట్లాడే వారిని 'అర్బన్ నక్సల్స్' అని పిలిచారని గుర్తు చేస్తూ... 'ఆయన ఎప్పటి నుండి అర్బన్ నక్సల్ అయ్యారు? హోంమంత్రి అమిత్ షా ఎప్పటి నుండి అర్బన్ నక్సల్ అయ్యారు?' అని జైరామ్ ఎద్దేవా చేశారు.

నేడు సీడబ్ల్యూసీ భేటీ

రాబోయే జనాభా గణనలో కుల గణనను చేర్చాలనే ప్రభుత్వం నిర్ణయంపై చర్చించడానికి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) శుక్రవారం సమావేశం కానుంది. తదుపరి జనగణనలో కుల గణన భాగంగా ఉంటుందని కేంద్రం బుధవారం ప్రకటించిన నేపథ్యంలో భవిష్యత్ కార్యాచరణపై చర్చించడానికి సాయంత్రం 4 గంటలకు అక్బర్ రోడ్‌లోని పార్టీ ప్రధాన కార్యాలయంలో సీడబ్ల్యూసీ సమావేశం జరుగుతుందని పార్టీ వర్గాలు తెలిపాయి. పహల్గాం ఉగ్రవాద దాడి నేపథ్యంలో ఏప్రిల్ 24న కూడా సీడబ్ల్యూసీ సమావేశమైంది. మోదీసర్కారు 11 సంవత్సరాలుగా కులగణనను వ్యతిరేకిస్తున్న క్రమంలో రాబోయే జనాభా లెక్కల్లో కుల గణనను చేర్చాలనే ఆకస్మిక నిర్ణయాన్ని కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ స్వాగతించారు.

అయితే దాని అమలుకు కేంద్రం ఒక కాలపరిమితి ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు. కుల గణన కోసం కాంగ్రెస్ సహా ఇతర ప్రతిపక్షాలు ప్రభుత్వంపై తెచ్చిన ఒత్తిడి ఫలించిందని రాహుల్ పేర్కొన్నారు.

ఎంటర్‌టైన్‌మెంట్ హబ్‌గా భారత్

వేవ్స్ సమ్మిట్‌లో ప్రధాని మోదీ



ముంబై: అంతర్జాతీయ ప్రతిభ, సృజనాత్మకతల కోసం ప్రపంచ వేదిక నిర్మాణానికి వేవ్స్ పునాది వేస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. భారత్ ఎంటర్‌టైన్‌మెంట్ హబ్‌గా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. చిత్ర నిర్మాణం, డిజిటల్ కంటెంట్, గేమింగ్, ఫ్యాషన్, మ్యూజిక్, కాన్సర్ట్‌లకు భారతదేశం కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న వేళ ప్రపంచ ప్రతిభకు ఒక వేదికను అందించే సామర్థ్యం వేవ్స్‌కు ఉంటుందని ప్రధాని తెలిపారు. ముంబై వేదికగా నాలుగు రోజులపాటు జరగనున్న 'వరల్డ్ ఆడియో విజువల్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్' (వేవ్స్)ను గురువారం మోదీ ప్రారంభించారు. భారతీయ చలన చిత్ర పరిశ్రమను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రియేటర్లు, స్టార్టప్‌లు, ఇండస్ట్రీ లీడర్లు, పాలసీ మేకర్లను ఒకచోట చేర్చడం ద్వారా భారత్‌ను మీడియా, వినోదం డిజిటల్ ఆవిష్కరణలకు ప్రపంచ కేంద్రంగా ఉంచడం వేవ్స్ లక్ష్యమని మోదీ చెప్పారు. సామాజిక మాధ్యమాలు, ఓటీటీల్లో అసభ్య కంటెంట్‌ను ఉద్దేశించి మాట్లాడిన ప్రధాని... సమాజంలో సృజనాత్మక బాధ్యతలు కలిగి ఉండటం ముఖ్యమన్నారు. మనుషులు రోబోల్లా మారకూడదని హితవుపలికారు. మానవ సమాజ సున్నితత్వాన్ని కాపాడాలన్నారు. మారుతున్న సాంకేతికతతో స్క్రీన్ పరిమాణం మినీగా మారుతున్నప్పటికీ భారతదేశం కథలు మెగాగా మారుతున్నాయని చమత్కరించారు. 'వంద కోట్లకు పైగా జనాభా ఉన్న ఈ భారతదేశం, వందల కోట్లకు పైగా కథలకు నిలయం. గత శతాబ్దకాలంగా ప్రపంచంలోని నలుమూలలా భారతదేశానికి ప్రాచుర్యాన్ని వ్యాప్తి చేయడంలో భారతీయ సినిమా విజయవంతమైంది. రష్యాలో రాజ్‌కపూర్‌కు, సత్యజిత్ రేకు కేన్స్‌లో ఉన్న ప్రజాధరణ ఆస్కార్‌లో ట్రిపుల్ ఆర్ సాధించిన విజయాలే ఇందుకు సాక్ష్యాలు' అని పేర్కొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో భారత్‌ను గ్లోబల్ ఎంటర్‌టైన్‌మెంట్ హబ్‌గా మార్చాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 'వేవ్స్- 2025' కార్యక్రమానికి నాంది పలికింది. సినీ పరిశ్రమ అభివృద్ధి కోసం నటీనటులు, కళాకారులు అందిస్తోన్న సేవలను మోదీ కొనియాడారు. ఆరెంజ్ ఎకానమీకి దేశంలో బీజం పడిందని వ్యాఖ్యానించారు. 'భారత్‌లో ఆరు లక్షల గ్రామాలు ఉన్నాయి. ఒక్కో ఊరికీ ఒక్కో కథ ఉంది. మన గ్రామాల్లోని ప్రతి వీధీ ఒక కథ చెబుతుంది. మన దేశంలోని ప్రతి పర్వతం ఒక పాట పాడుతుంది. ప్రతి నదీ ఒక గేయం ఆలపిస్తుంది. శివుడి ఢమరుకం సృష్టిలోని తొలి శబ్దం. మన దేశం అనేక విభిన్న సమాజాల సమాహారం' అని భారతీయ సంస్కృతిని ఆయన కొనియాడారు. 'వేవ్స్' అనేది కేవలం కొన్ని అక్షరాల సమూహం మాత్రమే కాదని... సంస్కృతి, సృజనాత్మకత, సార్వత్రిక అనుసంధానమని పేర్కొన్నారు. సృజనాత్మకతను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో త్వరలోనే 'వేవ్స్' అవార్డులను ప్రవేశపెట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రతిష్టాత్మక స్థాయిలో వీటిని అందించనున్నట్లు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రియులకు భారతీయ సినిమాను పరిచయం చేసిన సత్యజిత్ రే, రాజ్ కపూర్, రాజమౌళి, ఏఆర్ రెహమాన్ వంటి ప్రముఖులను ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో సినీ ప్రముఖులు రజనీకాంత్, చిరంజీవి, మోహన్‌లాల్, రాజమౌళి, అమిర్‌ఖాన్, ఏఆర్ రెహమాన్ తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నీతికి నిలువనీడ నిల్!

- 57 సార్లు బదిలీలు
- ప్రతి ఆరు నెలలకోసారి స్థానచలనం
- పుట్టినరోజే పదవీవిరమణ
- అతడే ఐఏఎస్ అధికారి అశోక్ ఖేమ్కా

చండీగఢ్: ఆయన ఓ నిఖార్సైన ఐఏఎస్ అధికారి. బెదిరింపులకు లొంగడు. చంపేస్తామని హెచ్చరించినా బేఖాతర్ చేస్తాడు. అక్రమార్కుల పట్ల చండశాసనుడుగా వ్యవహరిస్తాడు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గడు. పనిలో నిబద్ధత... నిబంధనలను తూచా పాటిస్తాడు. ఆయనే హర్యానా కేడర్‌కు చెందిన 1991 బ్యాచ్ ఐఏఎస్ అధికారి అశోక్ ఖేమ్కా. తన 34 ఏళ్ల సర్వీసులో 57 సార్లు బదిలీ అయ్యారు. సగటున ప్రతి ఆరు నెలలకు ఒకసారి బదిలీ అయి రికార్డుల్లోకెక్కడమే కాదు... ఆయన బదిలీలతో పేరెన్నికగన్న ఐఏఎస్ అధికారి. అందరికీ బాగా సుపరిచితమైన అశోక్ ఖేమ్కా... ఎట్టకేలకు తన కెరీర్‌కు ముగింపు పలికారు. ఏప్రిల్ 30 ఆయన పదవీ విరమణ చేశారు. ఇక విశ్రాంత అధికారిగా ఆయన జీవనం కొనసాగనుంది. ఎప్పుడూ సంచలన నిర్ణయాలు తీసుకుంటూ ప్రభుత్వాల ఆగ్రహానికి గురయ్యేవారు. అధికంగా బదిలీలతోనే జీవనం గడిపారు. హర్యానాలో ఏ అధికారికీ చేయని అత్యధిక బదిలీలుగా ఇది లిఖించబడింది. అక్రమ భూ పందేరాల్లో ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా చండశాసనుడిగా పేరున్న అశోక్ ఖేమ్కా గతంలో హర్యానా విత్తనాభివృద్ధి సంస్థ ఎండీగా, హర్యానా ఆర్చీవ్స్‌కు ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. సోనియా గాంధీ అల్లుడైన రాబర్ట్ వాద్రాకు సంబంధించిన డీఎల్ఎఫ్ డీల్ ను రద్దు చేసి సంచలనం సృష్టించిన సీనియర్ ఐఏఎస్ అధికారి అశోక్ ఖేమ్కా.. భూ రిజిస్ట్రేషన్లు, భూ గణాంకాల శాఖ డైరక్టర్ జనరల్‌గా పని చేస్తున్న సమయంలో రాబర్ట్ వాద్రాకు డీఎల్ఎఫ్ సంస్థకు నడుమ జరిగిన భూ ఒప్పందాల్లో అక్రమాలను గుర్తించి వాటిని రద్దు చేశారు. దీంతో దేశ వ్యాప్తంగా ఖేమ్కా పేరు మారుమోగిపోయింది. వీటితో పాటు ఖేమ్కా బెదిరింపు కాల్స్, చంపివేస్తామని హెచ్చరికలు సైతం ఎదుర్కొన్నారు. గతంలో బీజేపీ.. ఖేమ్కాను సమర్థించినా, ఎన్డీయే హయాంలో కూడా ఈ నీతివంతమైన అధికారిపై బదిలీల పరంపర కొనసాగించారు. 1965, ఏప్రిల్ 30వ తేదీన జన్మించిన ఆయన... 60 ఏళ్లు పూర్తైన క్రమంలో పదవీవిరమణ పొందారు. విశేషం ఏమిటంటే... ఖేమ్కా పుట్టిన రోజు ... పదవీవిరమణ ఒకే రోజు కావడం గమనించదగిన విషయం. నీతి, నిజాయతీకి నిలువెత్తుగా నిలిచిన ఐఏఎస్ అధికారి ఖేమ్కాకు ప్రభుత్వాలు ఇచ్చిన బహుమానం ఏమిటంటే అవార్డులు, రివార్డులు, ప్రశంసాపత్రాలు కాదు... బదిలీలు.

సంపన్నుల్లో ఏపీ టాప్

- 28 శాతం మంది ఎంపీలు నేరచరితులు
- 17 మంది ఎంపీలు, ఎమ్మెల్యేలు బిలియనీర్లు: ఏడీఆర్

న్యూఢిల్లీ: మహిళా చట్ట సభ్యుల్లో 28 శాతం మంది నేరచరితులని అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) వెల్లడించింది. దేశం మొత్తం మీద మహిళా ఎంపీలు, ఎమ్మెల్యేలలో 17 మంది బిలియనీర్లు ఉన్నట్లు తేల్చింది. లోక్‌సభలో మొత్తం 75 మంది, రాజ్యసభలో 37 మంది చొప్పున మహిళా ఎంపీలు ఉన్నారు. దిగవసభకు చెందిన ఆరుగురు, ఎగువ సభకు చెందిన ముగ్గురితో పాటు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల శాసనసభ్యుల్లో ఉన్న 400 మంది మహిళా ఎమ్మెల్యేల్లో 17 మంది సంపన్నులు ఉన్నట్లు తమ విశ్లేషణలో తేలిందని ఏడీఆర్ వెల్లడించింది. ప్రస్తుతమున్న 512 మంది మహిళా ఎంపీలు, ఎమ్మెల్యేలలో 143 మంది అంటే 28 శాతం మందిపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు అఫిడవిట్ల ద్వారా తేల్చినట్లు పేర్కొంది. లోక్‌సభ ఎంపీలు 24 (32 శాతం) మంది, రాజ్యసభ ఎంపీలు 10 (27 శాతం) మంది, ఎమ్మెల్యేల్లో 109 (27 శాతం) మందిపై క్రిమినల్ కేసులు ఉన్నాయి. 78 మంది (15 శాతం మంది) హత్య, హత్యాయత్నం వంటి తీవ్రమైన నేరాల్లో నిందితులుగా ఉన్నారు. లోక్‌సభ మహిళా ఎంపీల్లో 14 మంది (19 శాతం), రాజ్యసభలో ఏడుగురు (19 శాతం), అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు కలిపి 57 (14 శాతం) మందిపై తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నట్లు ఏడీఆర్ పేర్కొంది.

గోవా, తెలంగాణ, ఏపీ నుంచే ఎక్కువ మంది

గోవాకు చెందిన ముగ్గురు ఎంపీలు, ఎమ్మెల్యేల్లో ఇద్దరు (67 శాతం) నేరచరితలు కాగా తెలంగాణకు చెందిన 12కుగాను ఎనిమిది మంది (67 శాతం), ఆంధ్రప్రదేశ్ నుంచి 24కుగాను 14 మంది (58 శాతం), పంజాబ్, కేరళ రాష్ట్రాలకు చెందిన చెరో ఏడుగురు (50 శాతం), బీహార్ నుంచి 35కుగాను 15 మంది (43 శాతం)పై క్రిమినల్ కేసులు ఉన్నాయని నివేదిక తెలిపింది. తెలంగాణ చట్టసభ్యులు ఐదుగురిపై, ఏపీ నుంచి తొమ్మిది మంది (38 శాతం)పై, గోవా నుంచి ఒకరిపై (33 శాతం), బీహార్ నుంచి తొమ్మిది మందిపై, మేఘాలయకు చెందిన నలుగురు మహిళా ఎంపీలు/ఎమ్మెల్యేలలో ఒకరిపై, పంజాబ్, కేరళ రాష్ట్రాల నుంచి చెరో ముగ్గురిపై తీవ్రమైన నేరాల కేసులు ఉన్నాయని ఏడీఆర్ వెల్లడించింది.

బీజేపీలోనే అత్యధికం

పార్టీలపరంగా చూస్తే అత్యధికంగా బీజేపీ మహిళా చట్టసభ్యులు 217 మందిలో 23 మందిపై క్రిమినల్ కేసులు, 11 మందిపై తీవ్రమైన నేరాల కేసులు ఉన్నాయి. కాంగ్రెస్‌లో 83 మంది మహిళా చట్టసభ్యుల్లో 34 శాతం మందిపై క్రిమినల్ కేసులు, 20 శాతం మందిపై తీవ్రమైన క్రిమినల్ కేసులు ఉన్నాయి. టీడీపీలో 65 శాతం అంటే 20 మందిపై క్రిమినల్ కేసులు, 45 శాతం మందిపై తీవ్రమైన నేరాల కేసులు ఉన్నాయి. ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన 69 శాతం మంది అంటే 13 మందిపై క్రిమినల్ కేసులు, 31 శాతం మందిపై తీవ్రమైన నేరాల కేసులు ఉన్నాయి.

సంపన్నుల్లో ఏపీ టాప్

మహిళా ఎంపీలు, ఎమ్మెల్యేలు మొత్తం 512 మంది ఆస్తి విలువ రూ.10,417 కోట్లు. సగటున ప్రతి చట్టసభ్యురాలి సంపద రూ.20.34 కోట్లుగా ఉందని అసోసియేషన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్), నేషనల్ ఎలక్షన్ వాచ్ (ఎన్ఈడబ్ల్యూ) పేర్కొన్నాయి. అయితే సంపన్న మహిళా చట్టసభ్యులు ఎక్కువగా ఉన్న రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలిచింది. ఏపీ మహిళా చట్టసభ్యులు 24 మంది సంపన్నులు కాగా వారి ఆస్తి విలువ సగటున రూ.74.22 కోట్లుగా ఉంది. తర్వాత స్థానంలో రూ.71.44 కోట్ల ఆస్తితో దాదర్, నాగర్ హవేలీ, దామన్ దయ్యూకు ఏకైక చట్టసభ్యురాలు నిలిచారు. హర్యానాకు చెందిన 15 మంది ఆస్తి విలువ సగటున రూ.63.72 కోట్లుగా ఉంటే అసోం, మిజోరం, మణిపూర్ చట్టసభ్యుల ఆస్తుల విలువ రూ.2.18 కోట్లు, రూ.2.20 కోట్లు, రూ.2.84 కోట్లు చొప్పున ఉన్నట్లు ఏడీఆర్ తెలిపింది. సంపన్న మహిళా చట్టసభ్యుల జాబితాలో ఈ రాష్ట్రాలు చివర్లో ఉన్నాయని పేర్కొంది.

71 శాతం మంది విద్యావంతులు

మహిళా చట్టసభ్యుల్లో 71 శాతం మంది విద్యావంతులు ఉన్నారు. వీరంతా గ్రాడ్యుయేట్స్ లేక ఉన్నత విద్యను అభ్యసించిన వారు కాగా 5-12వ తరగతి వరకు చదివిన వారు 24 శాతం మంది, డిప్లొమా చేసిన వారు, నామమాత్రంగా చదువుకున్న వారు 12 శాతం చొప్పున ఉన్నారు. ఇదిలావుంటే, మహిళా సిట్టింగ్ ఎంపీలు, ఎమ్మెల్యేల్లో 64 శాతం మంది 41-60 ఏళ్ల మధ్య వయస్కులు కాగా 22 శాతం మంది 25-40 ఏళ్ల మధ్య వయస్సు వారున్నారు. మిగిలిన 14 శాతం మంది 61-80ఏళ్ల మధ్య వయస్కులు ఉన్నారని ఏడీఆర్ నివేదించింది.

'పహల్గాం' నుంచి దృష్టి మళ్లించేందుకే...

కుల గణన ప్రకటనపై సంజయ్ సింగ్

బల్లియా: పహల్గాం ఉగ్రదాడి నుంచి అందరి దృష్టిని మళ్లించడం కోసమే కుల గణనను కేంద్రం ప్రకటించిందని ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ వ్యాఖ్యానించారు. ఆప్ జాతీయ అధికార ప్రతినిధి సర్వేశ్ మిశ్రా ఇంటి వద్ద విలేకరులతో మాట్లాడిన సంజయ్ సింగ్ మోదీ ప్రభుత్వానిది దృష్టి మళ్లింపు రాజకీయం అని దుయ్యబట్టారు. బీహార్ ఎన్నికల తర్వాత కుల గణన గురించి ప్రభుత్వం మర్చిపోతుందన్నారు. ఓ వైపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొని ఉంటే మరోవైపు కుల గణనను ప్రకటించడం వెనుక మోదీ ప్రభుత్వ వాస్తవ ఉద్దేశం ఏమిటని సంజయ్ సింగ్ ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు తరహాలోనే కుల గణనను ప్రకటించారని, ఎప్పటికి అమలు చేస్తారో చెప్పలేదని విమర్శించారు. బడ్జెట్ కేటాయింపులు కానీ నిర్దేశిత గడువు కానీ లేదని దుయ్యబట్టారు. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే)ను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు ప్రభుత్వం చేపట్టే చర్యల కోసం యావత్ దేశం వేచివుంటే కుల గణన ప్రకటనతో దృష్టిని మళ్లించేందుకు సర్కారు యత్నించిందని దుయ్యబట్టారు. కులగణన ఆవశ్యతక ఉన్నప్పటికి ఇలాంటి సమయంలో ప్రకటించడం పాలకుల దృష్టి మళ్లింపు వ్యూహమని, తమను ప్రశ్నించకుండా చేయడమే ఉద్దేశమని సంజయ్ సింగ్ అన్నారు. మోదీ ప్రభుత్వ నిఘా-భద్రతా వ్యవస్థల వైఫల్యంతోనే పహల్గాంలో ఉగ్రదాడి జరిగిందన్నారు. రెండు వేల మందికిపైగా ఉన్నప్పటికీ ఉగ్రవాదులు వెళ్లి కాల్పులు జరిపారని... ఇది ప్రభుత్వ ప్రత్యక్ష వైఫల్యానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. 'ఈ ఘటనకు జవాబుదారీ తీసుకొని వివరణ ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ప్రధాని మాత్రం అఖిలపక్ష సమావేశాన్ని వదిలి... బీహార్‌లో ఎన్నికల ప్రచారంపై దృష్టి పెట్టారు' అని సంజయ్ సింగ్ వ్యాఖ్యానించారు. 'మీ పోరాటం పాకిస్థాన్‌తో... యూ-ట్యూబర్లు, జర్నలిస్టులతో కాదు. వారిపై ఎఫ్ఐఆర్‌లు పెట్టి జైళ్ల పాలు చేస్తున్నారు. మీరు ప్రాధాన్యత ఇస్తున్నది దేనికి? అంటూ మండిపడ్డారు. పీఓకే మనది...దీనిపై పార్లమెంటు తీర్మానించిందని గుర్తుచేశారు. పీఓకేను తిరిగి స్వాధీనం చేసుకొని అక్కడి పాకిస్థాన్ అండగల ఉగ్ర సంస్థలను తుదముట్టించాలని మోదీ ప్రభుత్వానికి సంజయ్ సింగ్ డిమాండ్ చేశారు.

పహల్గాం మృతులకు అమరవీరుల హోదా

ప్రధాని మోదీకి రాహుల్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రవాద దాడిలో మరణించిన వారికి అమరవీరుల హోదా ఇవ్వాలని లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ గురువారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. పహల్గాం ఉగ్రదాడిలో మరణించిన వారి కుటుంబాలకు తాను అండగా నిలుస్తున్నానని, బాధితులకు అమరవీరుల హోదా ఇవ్వాలనే వారి డిమాండ్‌కు మద్దతు ఇస్తున్నానని పేర్కొన్నారు. 'ఈ విషాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ఈ గౌరవం ఇవ్వడం ద్వారా వారి మనోభావాలను గౌరవించాలని ప్రధానమంత్రిని అభ్యర్థిస్తున్నాను' అని రాహుల్ పేర్కొన్నారు.

బైసరన్... బల్లేబల్లే!

- మళ్లీ పహల్గాంకు క్యూ కట్టిన పర్యాటకులు
- సందడిగా మారిన సుందర ప్రాంతం
- ఫొటోలు, సెల్ఫీలతో అందాలను ఆస్వాదిస్తున్న యాత్రికులు
- ఉగ్రదాడి ఆనవాళ్లు చెరిపేస్తున్న వైనం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతం పహల్గాం పర్యాటకులతో కళకళలాడుతోంది. మినీ స్విట్జర్లాండ్‌గా పేరొందిన బైసరన్ లోయకు టూరిస్టులు క్యూకట్టారు. సరిగ్గా పది రోజుల క్రితం ఉగ్రదాడితో ఉలిక్కిపడిన పహల్గాంలో ముష్కరులు సృష్టించిన నరమేధంలో 26 మంది బలయ్యారు. అయితే, దాడి తర్వాత ప్రజలు ఆ ప్రదేశానికి వెళ్లేందుకు కొంచెం వెనకడుగు వేసినప్పటికీ... మళ్లీ మినీ స్విట్జర్లాండ్ వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ క్రమంలో బైసరాన్‌కు పర్యాటకులు బారులుతీరుతున్నారు. దాడి జరిగిన అనంతరం రెండు మూడు రోజులు నిర్మానుష్యంగా మారిన పహల్గాం ప్రదేశం... ప్రస్తుతం పర్యాటకులతో సందడిసందడిగా మారింది. వేసవిలో కశ్మీర్ అందాలను ఆస్వాదించేందుకు తిరిగి పహల్గాం బాటపడుతున్నారు. అక్కడ సుందరమైన ప్రదేశాల్లో ప్రకృతి అందాలను తిలకిస్తూ ఉబ్బితబ్బిబ్బవుతున్నారు. కుటుంబంతో కలిసి బైసరాన్ వ్యాలీని చుట్టేస్తున్నారు. ఫొటోలు, సెల్ఫీలు తీసుకుంటూ తెగ ఆహ్లాదంగా గడిపేస్తున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సోషల్‌మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇదిలా ఉండగా... కశ్మీర్ లోయలో మరిన్ని ఉగ్రదాడులు జరిగే అవకాశం ఉందన్న నిఘా వర్గాల హెచ్చరికలతో జమ్మూకశ్మీర్ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ మేరకు కశ్మీర్‌లోని కొన్ని ప్రాంతాలను మూసివేసింది. లోయలో మొత్తం 87 పర్యాటక ప్రాంతాలుండగా... అందులో 48 ప్రాంతాలను మూసివేసింది . ఆయా ప్రాంతాల్లో సాయుధ బలగాలతో భద్రత కల్పించిన తర్వాతే వాటిని తిరిగి తెరుస్తామని వెల్లడించింది. ప్రస్తుతం టూరిస్ట్ ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసినట్లు తెలిపింది.

విశాలాంధ్ర హైదరాబాద్

కార్మికుల హక్కులను తిరస్కరించే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

విశాలాంధ్ర - హైదరాబాద్ : మోదీ ప్రభుత్వ తిరోగమన విధానాలతో కార్మికుల హక్కులు, రక్షణ, గౌరవాన్ని తిరస్కరించే 4 లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలనీ ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మొహమ్మద్ యూసఫ్ డిమాండ్ చేసారు. కొత్తగా తీసుకువచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాల అమలుతో కార్మికుల హక్కులపై కేంద్ర ప్రభుత్వం నిరంతర దాడులు చేస్తోందని ఆరోపించారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం 'మే డే' ఉత్సవాలు ఏఐటీయూసీ ఘనంగా నిర్వహించింది. హైదరాబాద్, హిమాయత్ నగర్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యాలయం వద్ద గురువారం మొహమ్మద్ యూసఫ్ అరుణపతాకాన్ని ఆవిష్కరించి, కార్మికుల ప్రదర్శనను జండా ఊపి ప్రారంభించారు. హిమాయత్ నగర్, హైదర్ గూడా మీదుగా రామ్ కోట్ షాలిమార్ ఫంక్షన్ హాల్‌కు చేరుకుంది. అనంతరం ఏఐటీ యూసీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు ఏం. నరసింహ అధ్యక్షతన జరిగిన భహిరంగ సభలో మొహమ్మద్ యూసఫ్ మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని గౌరవించడానికి, న్యాయమైన వేతనాలు, మెరుగైన పని పరిస్థితుల కోసం పోరాటాలను స్మరించుకోవడానికి, కార్మికుల హక్కుల పోరాటానికి చిహ్నంగా 'మే డే' జరుపుకుంటామని గుర్తు చేసారు. ఏఐటీయూసీ సీనియర్ నాయకులూ ఉజ్జిని రత్నాకర్ రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.ప్రేమ్ పావని, కార్యదర్శులు ఎస్.కరుణకుమారి, మారగోని ప్రవీణ్ గౌడ్, హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి కమతం యాదగిరి, ఉప ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కిషన్, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.వెంకటయ్య, నేతలు ఏం.లక్ష్మి, ఏ.బిక్షపతి యాదవ్, రమేష్, రాజమౌళి, కొంరెల్లి బాబు, సిహెచ్. జంగయ్య, ఎస్. అశోక్, సిహెచ్. శ్రీనివాస్ పాల్గొన్నారు.

బీఎంఈయూ అధ్యక్షుడిగా ప్రకాశ్ ఏకగ్రీవ ఎన్నిక

విశాలాంధ్ర - హైదరాబాద్ : జీహెచ్‌ఎంసీ గుర్తింపు ఎన్నికల్లో పలు సార్లు గెలుపు సాధించి, ఉద్యోగులు, కార్మికుల హక్కుల, ప్రయోజనాల పరిరక్షణకు కృషి చేసిన దివంగత కార్మిక నేత శంకర్ మృతితో ఖాళీ అయిన భాగ్యనగర్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడిగా సికింద్రాబాద్ జోనల్ ప్రెసిడెంట్ జే.ప్రకాశ్‌ను బుధవారం యూనియన్ కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికుంది. జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో అత్యవసర సమావేశాన్ని నిర్వహించిన కార్యవర్గం జే.ప్రకాశ్‌ను ఎన్నుకున్నట్లు యూనియన్ జనరల్ సెక్రటరీ అష్రఫ్ ప్రకటించారు. ఈ సందర్భంగా యూనియన్ నేతలు అష్రఫ్, శ్రీధర్ మాట్లాడుతూ దశాబ్దాల కాలం పాటు జీహెచ్‌ఎంసీ ఉద్యోగులు, కార్మికుల సంక్షేమానికి కృషి చేసిన దివంగత కార్మిక నేత శంకరన్న ఆశయ సాధనకు యూనియన్‌లోని ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. యూనియన్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన జే.ప్రకాశ్ మాట్లాడుతూ కార్మిక నేత శంకర్‌తో కలిసి పని చేసిన చక్కటి అనుభవం తనకుందని, దాన్ని వినియోగించుకుని కార్మికులు, ఉద్యోగులకు తనవంత సేవ చేస్తానని వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో యూనియన్ జనరల్ సెక్రటరీ అష్రఫ్, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీధర్, వైస్ ప్రెసిడెంట్ పెంటయ్య, జోనల్ అధ్యక్షులు నర్సింగ్, ఆకుల మోహన్ దాస్, యాదగిరి, గోపాలకృష్ణ, సత్యరాజు, అడిషనల్ జనరల్ సెక్రెటరీ పాండు, సెక్రటరీ బాలేశ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ అడ్డంకిగా మారిన కేంద్ర మంత్రులు

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డితో పాటు బండిసంజయ్‌లు అడ్డంకిగా మారారని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్ విమర్శించారు. తెలంగాణ కోసం రూపాయి తేలేని కేంద్ర మంత్రులు రాష్ట్ర కులగణను తప్పుపట్టడం సిగ్గుచేటని ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ కులగణన తప్పులు తడక అనడం కిషన్ రెడ్డి, బండి సంజయ్ దిగజారుడు తనానికి నిదర్శనమని మండిపడ్డారు. బీఆర్‌ఎస్‌తో దోస్తీ కట్టి కాంగ్రెస్ ప్రభుత్వంపై నిత్యం విషం కక్కడం బీజేపీ నేతలకు అలవాటుగా మారిందని అన్నారు. కులగణన పై కేంద్రం నిర్ణయంతో రాహుల్ సంకల్పం సిద్ధించిందన్నారు. రాహుల్ గాంధీ ఆలోచన మేరకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల బృందం రాష్ట్రంలో కులగణనను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించిందని వివరించారు. శాసనసభలో 8 మంది బీజేపీ ఎమ్మెల్యేల సాక్షిగా ఏకగ్రీవ తీర్మానంతో బీసీ కులగణనకు చట్ట బద్ధత కల్పించామని స్పష్టం చేశారు. బీసీల పట్ల మీకు చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్‌లో బీసీ 42శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని 50శాతం రిజర్వేషన్లు పరిమితి ఎత్తివేసేలా పార్లమెంట్‌లో చట్టం చేయాలని డిమాండ్ చేశారు. బీసీ బిల్లు చట్ట బద్దత కోసం ప్రధాని మోదీకి లేఖ రాసే దమ్ము వారికి వుందా అని నిలదీశారు. కేంద్రం జనగణనతో పాటు కులగణన నిర్ణయం కాంగ్రెస్ ప్రభుత్వ విజయంగా అయన అభివర్ణించారు. కేంద్రం దేశ వ్యాప్తంగా కులగణన ఎప్పుడు నిర్వహిస్తారో ప్రకటించాలని, అలాగే కులగణనతో తెలంగాణలో ఏ కులం వారు ఎంత నిష్పత్తిలో ఉన్నారని తేల్చి చెప్పిన ఘనత కాంగ్రెస్ పార్టీదన్నారు. చారిత్రాత్మక కులగణన, ఎస్సీ వర్గీకరణ, బీసీలకు 42శాతం రిజర్వేషన్ల నిర్ణయాలతో దేశానికీ ఆదర్శంగా తెలంగాణ నిలుస్తుందన్నారు.

అసంఘటితరంగ కార్మికులకు సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలి



విశాలాంధ్ర - కాప్రా : అసంఘటితరంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, కార్మికుల హక్కులకు నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు విఎస్. బోస్ పిలుపునిచ్చారు. 139 మేడే కార్మిక దినోత్సవాన్ని ఏఐటీయూసీ, సీపీఐ ఉప్పల్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో మల్లాపూర్ డివిజన్ జనప్రియ బస్టాండ్ భాగ్యనగర్ డీసీఎం డ్రైవర్స్ మరియు ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎర్రజెండాను బోస్ ఎగురవేశారు. ఈ సందర్భంగా లిసీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు విఎస్. బోసలి మాట్లాడుతూ సంపద సృష్టిలో భాగస్వామ్యం అయిన కార్మికులకు కార్పొరేట్ సంపద పునఃపంపిణీ చేసి ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఎనిమిది గంటల పని విధానాన్ని తీసేసి మళ్లీ 12 గంటల పని విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చే విధంగా నల్ల కార్మిక చట్టాలను తీసుకువచ్చిందని, భారతదేశంలో కార్మికుల శ్రామిక వర్గ హక్కుల కోసం ఏర్పడిన మొట్టమొదటి ట్రేడ్ యూనియన్ ఏ ఐ టి యు సి అని, కార్మికులు ఏఐటీయూసీ జెండా అందుకొని తమ హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా ప్రభుత్వాలు కార్మికులకు కనీస వేతనాలు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అసంఘటిత రంగ హమాలీ కార్మికులకు పీఎఫ్ ఈఎస్ఐ తో కూడినటువంటి సమగ్ర సంక్షేమ చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి జీ.దామోదర్ రెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్. శంకర్ రావు, సీపీఐ నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు నారా నర్సింహా, రాఘవేంద్రరావు,..ఏఐటీయూసీ సీనియర్ నేతలు శ్రీనివాస్, సుధాకర్, నర్సింహారావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె. ధర్మేంద్ర, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సత్య ప్రసాద్, ఏఐఎస్ఎఫ్ నేతలు, మహేష్, అజీమ్, ఇంతియాజ్, కిరణ్ భాగ్యనగర్ డీసీఎం డ్రైవర్స్, ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహిన్, కార్యదర్శి శ్రీశైలం, రామచంద్ర, డేవిడ్ పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీలో రెండు అంశాలకు ఆమోదం

విశాలాంధ్ర - హైదరాబాద్ : నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధ్యక్షతన గురువారం 2వ స్టాండింగ్ కమిటీ సమావేశం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో జరిగింది. జీహెచ్‌ఎంసీలో వివిధ రహదారుల విస్తరణకు కార్పొరేషన్ ద్వారా సిఫార్సు చేస్తూ కమిటీ ఆమోదం తెలిపింది. కమిటీ సమావేశంలో 9 అంశాలు, 2 టేబుల్ ఐటమ్‌లకు సభ్యులు ఆమోదించినట్లు మేయర్ తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ... స్టాండింగ్ కమిటీ పాలసీ నిర్ణయాల కమిటీ అన్నారు. జీహెచ్‌ఎంసీ ఆదాయ వనరుల పెంపుపై దృష్టి సారించాలన్నారు. అడిషనల్, జోనల్ కమిషనర్లు ఆయా విభాగాలకు సంబంధించిన టెండర్లు తదితర నిర్ణయలన్నింటిని స్టాండింగ్ కమిటీలో ఆమోదం పొందిన తర్వాతే చర్యలు తీసుకోవాలని తెలిపారు. బల్దియాకు ఏ ప్రభుత్వం ఇవ్వని విధంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికంగా నిధులు ఇచ్చినందుకు స్టాండింగ్ కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

స్టాండింగ్ కమిటీలో ఆమోదించిన అంశాలు:

కృష్ణ డ్రింకింగ్ వాటర్ సప్లై ఫేస్-2 మెయిన్ రింగ్ 1 మాన్యుఫ్యాక్చర్ సప్లై, డెలివరీ బండ్లగూడ క్రాస్ రోడ్డు నఫీస్ గార్డెన్ ఫంక్షన్ హాల్ నుండి రాయల్ స్టీల్ ట్రేడర్స్ వరకు పైప్ లైన్ మార్చుటకు, బండ్లగూడ హౌసింగ్ కాలనీ నుండి ఎర్రగుంట వరకు బాక్స్ డ్రెయిన్ నిర్మాణం, యుటిలిటీ మార్చడానికి రూ.2.12 కోట్లకు పరిపాలన మంజూరికి కమిటీ ఆమోదం చేశారు. గోపన్‌పల్లి విలేజ్‌లో రాంకీ ఫౌండేషన్‌కు, కింద అన్ని సౌకర్యాలతో జంతు సంరక్షణ కేంద్రం నిర్మాణం, నిర్వహణ కోసం ఇప్పటికే కేటాయించిన 4,350 గజాల స్థలాన్ని, ఆల్ ఫర్ యానిమల్స్ ఫౌండేషన్‌కు వారి నిధులతో అవసరమైన పరికరాలను అమర్చడం, వైద్య సదుపాయాల నిర్వహణ కొరకు (25) సంవత్సరాల కాలానికి నామమాత్రపు రుసుంతో లీజుకు అనుమతిస్తూ కమిటీ ఆమోదం చేశారు. డబీర్ పుర పోలీస్ స్టేషన్ నుండి నాగబౌలి జంక్షన్ వరకు ప్రతిపాదిత 40 అడుగుల రోడ్డు విస్తరణ, సీసీ రోడ్డు ఏర్పాటుకు రూ. 5.10 కోట్ల అంచనా వ్యయానికి పరిపాలన మంజూరికి కార్పొరేషన్‌కు సిఫార్సు చేస్తూ కమిటీ ఆమోదం తెలిపారు. రోడ్డు నెం. 36 వద్ద సుమారు 4 వేల చదరపు మీటర్ల విస్తీర్ణంలో బాంబో పార్కు అభివృద్ధి, నిర్వహణ, 5373 చదరపు మీటర్ల విస్తీర్ణంలో జూబ్లీహిల్స్ చెక్ పోస్ట్ పార్కును సి.ఎస్.ఆర్ కింద అభివృద్ధి, నిర్వహణకు అపోలో హాస్పిటల్ ఎంటర్ప్రైజెస్ లిమిటెడ్ వారికి మూడు సంవత్సరాల కాలానికి ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ ఎం.ఓ.యు చేయుటకు కమిటీ ఆమోదం తెలిపారు. రోడ్ డెవలప్మెంట్ ప్లాన్‌లో భాగంగా గోషామహల్ నుండి ఉస్మాన్ గంజ్ వరకు ప్రతిపాదిత రహదారి విస్తరణ కోసం 19 ఆస్తుల సేకరణ కు కార్పొరేషన్‌కు సిఫార్సు చేస్తూ కమిటీ ఆమోదం చేశారు. రోడ్ డెవలప్మెంట్ ప్లాన్‌లో భాగంగా పోలీస్ ల్యాండ్ నార్త్ వెస్ట్ కార్నర్ నుండి దారుసలాం రహదారి వరకు, మాలకుంట రోడ్డు నుండి ఓల్డ్ తోపు ఖానా రోడ్ వరకు రోడ్డు విస్తరణ కోసం 112 ఆస్తుల సేకరణకు కార్పొరేషన్‌కు సిఫార్సు చేస్తూ కమిటీ ఆమోదం తెలిపారు. బొడెకి కబార్ నుండి బేగం బజార్ వరకు 12 మీటర్లు, 18 మీటర్ల రహదారి విస్తరణకు, రహదారి వెడల్పును 12 మీటర్ల నుండి 18 మీటర్లకు, 200 మీటర్ల పొడవు పెంచుటకు ప్రభుత్వానికి తెలియజేస్తూ 95 ఆస్తుల సేకరణకు కార్పొరేషన్‌కు సిఫార్సు చేస్తూ కమిటీ ఆమోదం తెలిపారు.

టేబుల్ ఐటమ్స్: రూ.2.95 కోట్ల అంచనా వ్యయంతో సికింద్రాబాద్ సర్కిల్ బౌద్ధ నగర్‌లో సి.సి రోడ్డు పునరుద్ధరణతో పాటు రోడ్డుకు ఇరువైపులా బాక్స్ డ్రెయిన్ పునరుద్ధరణ పనులు, సెయింట్ అల్ఫోన్స్ స్కూల్ వద్ద ఆర్.సి.సి బాక్స్ డ్రెయిన్ నిర్మాణానికి కమిటీ ఆమోదం చేశారు. ఈ.ఈ.ఎస్.ఎల్ ఏజెన్సీ ఎల్.ఇ.డి స్ట్రీట్ లైటింగ్ నిర్వహణ కాంట్రాక్టు ఏప్రిల్ 30తో పూర్తి అయినందున, కొత్త ఏజెన్సీ ఫైనలైజ్ అయ్యే వరకు లేదా రెండు నెలల పాటు ప్రత్యామ్నాయంగా ఈ.ఈ.ఎస్.ఎల్ ఏజెన్సీ స్ట్రీట్ లైటింగ్ నిర్వహించుటకు కమిటీ ఆమోదం. ఈ సమావేశంలో జీహెచ్‌ఎంసీ కమీషనర్ ఆర్.వి కర్ణన్, స్టాండింగ్ కమిటీ సభ్యులు బొంతు శ్రీదేవి, బానోతు సుజాత, సయ్యద్ మిన్హాజుద్దీన్, అబ్దుల్ వాహెబ్, పర్వీన్ సుల్తానా, డా.ఆయేషా హుమేరా, మహమ్మద్ సలీం, బాతా జబీన్, మహాలక్ష్మి రామన్ గౌడ్, మహమ్మద్ గౌస్ ఉద్దీన్, సి.ఎన్.రెడ్డి, ఎం.డి బాబా ఫసియుద్దీన్, వి.జగదీశ్వర్ గౌడ్, బూరుగడ్డ పుష్ప పాల్గొన్నారు. అడిషనల్ కమిషనర్లు వేణుగోపాల్ రెడ్డి, సత్యనారాయణ, వేణుగోపాల్, పంకజ, గీతా రాధిక, రఘు ప్రసాద్, చంద్రకాంత్ రెడ్డి, యాదగిరి రావు, సుభద్ర దేవి, అలివేలు మంగతాయారు, నళిని పద్మావతి, జోనల్ కమిషనర్లు హేమంత్ కేశవ్ పాటిల్, అనురాగ్ జయంతి, అపూర్వ్ చౌహాన్, హేమంత్ బోర్కడే, రవికిరణ్, వెంకన్న, సిసిపి శ్రీనివాస్, సి.ఇ లు రత్నాకర్, భాస్కర్ రెడ్డి, చీఫ్ ఇంజనీర్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులను పరిశీలించిన కమిషనర్

విశాలాంధ్ర - హైదరాబాద్ : రానున్న వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాలు ముంపుకు గురి కాకుండా చేపట్టిన స్ట్రామ్ వాటర్ డ్రైన్ పనులు, అసంపూర్తిగా ఉన్న నాలా అభివృద్ధి పనులన్నింటినీ పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని జిహెచ్ఎంసి కమీషనర్ ఆర్.వి కర్ణన్ అధికారులను ఆదేశించారు. గురువారం కమీషనర్ ఎల్బీనగర్ జోనల్ కమీషనర్ హేమంత్ కేశవ్ పాటిల్ తో కలిసి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమీషనర్ నాగోల్ సాయి నగర్ నుండి ఆర్టిఓ ఆఫీస్ వరకు సుమారు 350 మీటర్ల స్టార్మ్ వాటర్ బాక్స్ డ్రెయిన్ పనులు, ఉప్పల్ ఎస్.ఆర్.డి.పి నేషనల్ హైవే ఫ్లైఓవర్ పనులు, బైరామల్ గూడ ఫ్లైఓవర్ కింద బ్లాక్ లో వివిధ క్రీడలను ప్రోత్సహించేందకు చేపట్టిన పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... ఎల్బీనగర్ జోన్ లో లోతట్టు ప్రాంతాల్లో వరద ముంపు నివారణకు చేపట్టిన స్టార్మ్ వాటర్ డ్రెయిన్లు గాని, ఎస్.ఎన్.డి.పి ద్వారా చేపట్టిన నాలా అసంపూర్తి పనులన్నింటిని వచ్చే వర్షాకాలం లోపు పూర్తి చేసేందుకు తగిన అన్ని చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ విషయంలో ఏమైనా సమస్యలు ఉన్న నేపథ్యంలో తనకు తెలియజేయాలని సూచించారు. బైరామల్ గూడ ఫ్లైఓవర్ కింద బ్లాక్ లో క్రీడలను ప్రోత్సహించేందుకు 6 బ్లాక్ లలో చేపట్టనున్న పనులను పరిశీలించి క్రీడాకారులకు ఉపయోగపడే విధంగా పనులు చేపట్టాలని కమిషనర్ సూచించారు. నాగోల్ సాయి నగర్ నుండి ఆర్‌టి ఓ ఆఫీస్ వరకు 350 మీటర్ల వరకు చేపట్టిన స్ట్రామ్ వాటర్ డ్రైన్ నిర్మాణ పనులను పరిశీలించారు. స్టార్మ్ వాటర్ నిర్మాణం వలన ఎన్ని కాలనీలకు ప్రయోజనం కలుగుతుందని కమీషనర్ ఈఈ రమేష్ బాబును వివరణ కోరగా సుమారు 5 కాలనిలో వరద ముంపు నివారణ అవుతుందని ఈఈ కమీషనర్‌కు వివరించారు. వచ్చే వర్షాకాలం నాటికి పూర్తి చేయాలని కమిషనర్ ఈఈ ని ఆదేశించారు. బాక్స్ డ్రెయిన్ గాని, నాలా అభివృద్ధి పనులు అసంపూర్తి పనులన్నింటినీ పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని జోనల్ కమీషనర్‌ను ఆదేశించారు. అనంతరం ఉప్పల్ చౌరస్తా వద్ద ఎస్.ఆర్.డి.పి ఫ్లైఓవర్ పనులతో పాటుగా నేషనల్ హైవే నారాపల్లి సిపిఆర్ఐ వరకు చేపట్టిన పనులను కూడా ఈ సందర్భంగా కమిషనర్ పరిశీలించారు. ఎస్.ఆర్.డి.పి పనుల పూర్తి కాకపోవడానికి గల కారణాలు జోనల్ కమిషనర్ నుండి వివరణ కోరగా జోనల్ కమీషనర్ మాట్లాడుతూ ఫ్లైఓవర్ పనులలో వేరియేషన్ కారణంగా ప్రభుత్వానికి నివేదించినట్లు ప్రభుత్వ అనుమతి రాగానే పనులు చేపట్టడం జరుగుతుందని కమిషనర్‌కు వివరించారు. కమిషనర్ వెంట జోనల్ కమీషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, హయత్ నగర్, ఉప్పల్ డిప్యూటీ కమిషనర్లు తిప్పర్తి యాదయ్య, ఆంజనేయులు, ఇంజనీరింగ్ మెయింటెనెన్స్ ఈఈలు కార్తీక్, రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

అస్సాం సీఎం వ్యాఖ్యలపై నిరసన

విశాలాంధ్ర - హైదరాబాద్ : అస్సాం సీఎం హేమంత్ బిస్వాస్ శర్మ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో అందోళనలో నిరసన చేపట్టారు. జాతీయ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు అల్కాలాంబ అదేశాల మేరకు గురువారం తెలంగాణ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు నేతృత్వంలో గాంధీభవన్ ఎదుట రాస్తారోకో చేపట్టారు. బిస్వాస్ శర్మ చిత్రపటాని చెప్పులతో కొడుతూ వారు అందోళన చేపట్టారు. ఈ సందర్భంగా రోడ్డు పై భైటాయించిన మహిళా నేతలను పోలీసులు అరెస్టు చేసి బండ్లగూడా, కంచంబగ్, చాంద్రాయణగుట్ట పోలీస్ స్టేషన్లకు తరలించడం జరిగింది. అంతకుముందు యాదాద్రి జిల్లా ఆలేరులో జిల్లా అధ్యక్షురాల్కైన నీలం పద్మ ఆధ్వర్యంలో జిల్లా విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. జిల్లాలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ అనే కార్యక్రమంలో భాగంగా ర్యాలీ, బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆనంతరం తరువాత మోడీ ప్రభుత్వం పెంచిన గ్యాస్‌ధరను తగ్గించాలని కోరుతే ధర్నా కార్యక్రమం చేయడం జరిగింది. ఆనంతరం సునీతారావు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పార్టీని బూత్ లెవెల్ పటిష్టం చేయడానికి దిశా నిర్దేశం చేశారు.

ఘనంగా మే డే ఉత్సవాలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం హిమాయత్ నగర్‌లో మేడే సందర్భంగా జెండా ఆవిష్కరించి, తెలంగాణ రాష్ట్ర కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. 139వ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని, తెలంగాణ రాష్ట్ర టూరిజం కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అధ్యక్షులు సబ్ రాజమౌళి, సాంబశివరెడ్డిలు మాట్లాడుతూ ప్రపంచ దేశాలలో కార్మికులందరూ ఏకం అవ్వాలని కార్మిక లోకాన్ని మేలు కొలుపుతూ ఈ పెట్టుబడిదారీ వ్యవస్థను పతనం చేయాలని శ్రమదోపిడిని ఆపాలని 1886 చికాగో నగరంలో, కార్మికుల హక్కుల కోసం, వారి శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని చాలా పెద్ద ఉద్యమం జరిగిందన్నారు. ఎంతోమంది శ్రామికులు అసువులు బాసారని, ఎంతోమంది నాయకులు ఈ యొక్క ఉద్యమాన్ని ముందుకు నడిపించారన్నారు. వారందరినీ అక్కడ ప్రభుత్వం బహిరంగంగా ఉరితీయించిందని, అయినప్పటికీ అక్కడ కార్మిక ఉద్యమం వెనక్కి తగ్గకుండా వారికి దీటుగా, కార్మికుల హక్కులను తెలియజేస్తూ ఎనిమిది గంటల పని గంటల కోసం, పనికి తగ్గ వేతనం కావాలని డిమాండ్ చేస్తూ అక్కడ ప్రభుత్వాన్ని దిగొచ్చేలా చేసిందన్నారు. తెలంగాణలో ఎంతోమంది ఉద్యోగులు కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ లేదా రోజువారి కూలీలుగా ఉన్న వారిని పర్మినెంట్ చేయాలని వారి జీతభత్యాలను పెంచాలని సరైన హక్కులను కల్పించాలని, అలాగే శ్రమ దోపిడీ ఉండకుండా కార్మికుల అండగా ఉండాలని ప్రభుత్వాన్నికి విజ్ఞప్తి చేశారు, ఈ కార్యక్రమంలో బాబు, రమేష్, ఉమర్ఖాన్, మనోహర్, ఆజ్మీయా, సయ్యద్ గౌస్, కృష్ణమూర్తి, నరసింహ, కళ్యాణ్, అనిల్ కుమార్, విజయ్ కుమార్, బల్వీర్, తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - హైదరాబాద్ : ఎన్‌టిఆర్ భవన్‌లో తెలుగునాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ (టిఎన్‌టియూసీ) ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం మేడే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న పొలిట్‌బ్యూరో సభ్యులు, జాతీయ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు, మాజీ టిఎన్‌టియూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎం.కె. బోస్ టిఎన్‌టియుసి జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బక్కని నర్సింహులు మాట్లాడుతూ.. శ్రమజీవుల సంక్షేమమే లక్ష్యంగా ఎన్‌టి రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించారని, అందుకే పేదవాడి గుడిసె, రైతన్న నాగలి, కార్మికుల చక్రంతో పార్టీ జెండాను రూపొందించారన్నారు. ఈ ఆశయాలకు అనుగుణంగా అభివృద్ధి ఫలాలు పేదవాడికి అందాలనే లక్ష్యంతో తెలుగుదేశం పార్టీ, చంద్రబాబు పని చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌టియుసి నాయకులు ఎబిఆర్ మోహన్‌రావు, రత్నాకర్‌రావు, జగదీష్, పెద్ద నర్సింహ, సుబ్రమణ్యం, టిడిపి మీడియా కమిటి చైర్మన్ ప్రశాశ్ రెడ్డి, ప్రసాద్, జోగినాయుడు, శ్యాం కుమార్, బిబి సుబ్బారావు, ప్రసాద్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర - మల్కాజిగిరి : అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మే డే నుపురస్కరించుకొని గురువారం మల్కాజిగిరిలో సి.పి.ఐ. ఏఐటియుసి ఆధ్వర్యంలో అరుణ పతాకాలు ఎగరవేయడం జరిగింది. మల్కాజిగిరి చౌరస్తాలో జరిగిన కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి టి.యాదయ్య గౌడ్ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి కాసర్ల నాగరాజు పాల్గొని మాట్లాడుతూ ఎర్ర జెండా మేధావి తెలివి తేటల నుంచి ఉద్భవించలేదని చిత్రకారుడు కుంచె నుంచి రూపొందాలేదని పోరాడే కష్టజీవి రక్తాన్ని పులుముకొని ఎరుపెక్కిందని ఎర్రజెండా అని కొనియాడారు. శ్రామిక హక్కుల పరిరక్షణ కోసం పోరాడేందుకు ప్రతిన భూనాలని పిలుపునిచ్చారు. 139 సంవత్సరాల క్రితం అమెరికాలోని చికాగో నగరంలో 8 గంటల పని దినం కోసం కార్మికులు జరిపిన పోరాటాలలో రక్త తర్పణం చేసి అశువులు బాసిన అమరవీరుల త్యాగాలతో స్ఫూర్తితో ప్రపంచవ్యాప్తంగా మరియు మన దేశంలో కార్మిక వర్గం అనేక పోరాటాలు చేసి ఎన్నెన్నో హక్కులను సాధించిందన్నారు. పోరాడి సాధించుకున్న కార్మికుల హక్కుల సాధన దశగా ఐక్యమత్యంతో పయనించాలని నేటి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కొల్లగొట్టే పద్ధతుల్లో ఉన్నాయని మనం హక్కులు కాపాడుకోవడం కోసం ఐక్యమత్యంతో పోరాడాలని 44 కార్మిక చట్టాలను తొలగించి కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్లను తెచ్చిన మతోన్మాద ఆశిస్తూ బిజెపి కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తుందని విమర్శించారు. వ్యవసాయ కార్మికులు పేద రైతులు కష్టజీవులైన సంఘటితరంగ అసంఘటిత కార్మికులుకు పెరిగిన ధరలకు అనుకూలంగా వేతనాల పెంపుదల పని భద్రత కార్మికుల సంక్షేమ అభివృద్ధి కోసం సమస్యల పరిష్కారం కోసం దోపిడీ వ్యవస్థను అంతం చేసి ఒక మనిషి మరొక మనిషిని దోపిడి చేయుటకు వీలులేని సమ సమాజ నిర్మాణం కోసం పోరాడేందుకు మే దినోత్సవం సందర్భంగా సకల శ్రామిక జనావళి దీక్ష భూనాలని నాగరాజు పిలుపునిచ్చారు. సిపిఐ మండల సహాయ కార్యదర్శి కే.అశోక్ వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి జె.వెంకటరమణ, మండల కార్యదర్శి బి.యాదగిరి, జిల్లా నాయకులు ఎస్.కే.అజీజ్, జున్ను రాములు, ఏఐవైఎఫ్ నాయకులు అబ్దుల్ గని, ఎండి యూసుఫ్, మహమ్మద్ నవాబ్, ఏం.నరసింహ, కొంగ ప్రభాకర్, మహిళా నాయకురాలు హేమలత, సుమిత, వాసంతి, చంద్రకళ, తదితరులు పాల్గొన్నారు. నెరేడ్ మెట్ చౌరస్తా, కాకతీయ నగర్, నిర్మల్ నగర్ లేబర్ అడ్డాలో, వినాయక్ నగర్ సిపిఐ ఆఫీస్‌లో సిపిఐ ఏఐటీసీ ఆధ్వర్యంలో అరుణపాత్రకాలు ఎగురవేశారు.

నెరేడ్ మెట్ డంపింగ్ యార్డులో..

విశాలాంధ్ర - మల్కాజిగిరి : జిహెచ్ఎంసి మల్కాజిగిరి సర్కిల్ ట్రాన్స్ పోర్ట్ అధ్యక్షులు నెరేడ్ మెట్ పార్కింగ్ యార్డ్‌లో సి.హెచ్.సంజీవ ఆధ్వర్యంలో గురువారం కార్మికుల దినోత్సవం ఘనంగా నిర్వహిచారు. ఈ కార్యక్రమానికి టీజేఎస్ కన్వీనర్ ఆకుల శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆకుల శ్రీనివాస్ కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ కార్మికుల సమస్యలను త్వరలోనే జిహెచ్ఎంసి కమీషనర్ దృష్టికి తీసుకవెళ్లి సమస్యలు పరిష్కారం చేస్తామని, గవర్నమెంట్‌తో మాట్లాడి ప్రత్యేక కార్పొరేషన్ అయ్యేటట్టు చేస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం కార్మికుల పక్షాన, ప్రభుత్వంతో మాట్లాడుతూ కార్మికులకు న్యాయం జరిగే విధంగా కృషి చేస్తున్నారన్నారు. మేడే సందర్భంగా కార్మికులందరికీ సన్మాన కార్యక్రమాని నిర్వహించారు. ట్రాన్స్ పోర్ట్ గ్రేటర్ అధ్యక్షులు గడ్డం జగదీష్, టీ.జే.సి గ్రేటర్ అధ్యక్షులు జాహిర్ ఉద్దీన్, భగవంతు రెడ్డి, వెంకటేష్, బస్తీ దావాఖానల అధ్యక్షులు సుమన్, కాశయ్య, బాబురావు, నర్సిములు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

విశాలాంధ్ర - ఎల్.బి.నగర్ : సిపిఐ పార్టీ ఎల్బీనగర్ నియోజకవర్గం సమితి బాతరాజు నర్సింహ ఆధ్వర్యంలో మేడే 139వ ఉత్సవాలను ఘనంగా ఎస్.ఏ. డ్యాంగే భవన్ ఏఐటీయూసీ న్యూ నాగోల్ కార్యాలయంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి సిపిఐ ఎల్.బి. నగర్ నియోజకవర్గం కార్యదర్శి కామెడీ సామెడి శేఖర్‌రెడ్డి అరుణ పథకాన్ని ఎగరవేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎల్.బి. నగర్ నియోజకవర్గం నాయకులు బోయినపల్లి రాములు గౌడ్, భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యదర్శి ముడతల మల్లేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పలు ప్రాంతాలలో..

విశాలాంధ్ర - మల్కాజిగిరి : అంతర్జాతీయ కార్మిక దినోత్సవ మే డే సందర్భంగా మల్కాజిగిరి మండల పరిధిలో విస్తృతంగా వాడవాడలా ఆయా రంగాలలో సీఐటీయూ జండా ఆవిష్కరణలను చేయడం జరిగింది. మల్కాజిగిరి మండల ప్రజా సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో ఆశ వర్కర్స్ యూనియన్ మల్కాజిగిరి చౌరస్తా వద్ద, భవన నిర్మాణ కార్మిక రంగం ఈస్ట్ ఆనంద్ బాగ్, సంతోషిమాత అడ్డ, మల్కాజిగిరి చౌరస్తా, వినాయక నగర్ చౌరస్తా నందు, ట్రాన్స్పోర్ట్, రవాణా రంగం ఆటో స్టాండ్ కృపా కాంప్లెక్స్, నేరేడ్మెట్ వద్ద, ఇంటిపని వారాల సంఘం వారు ఆర్కే పురం, అంతయ్య కాలనీ, ఓల్డ్ గాంధీనగర్, నేరేడ్మెట్ నందు సీఐటీయూ మండల ఆఫీసులో సీఐటీయూ జెండావిష్కరణలు చేసి సీఐటీయూ ఆఫీస్ నుండి మల్కాజిగిరి చౌరస్తా వరకు కార్మికులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మల్కాజిగిరి ప్రజాసంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్ బంగారు నర్సింగరావు ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఏ.హేమలత, జిల్లా నాయకులు వసంత రాణి, మండల నాయకులు రాజ్యలక్ష్మి, శోభ, నమ్రత, సిఐటియు మండల నాయకులు బబ్బూరి కొండల్, ఇంటిపని వారి సంఘం మల్కాజిగిరి మండల అధ్యక్ష కార్యదర్శులు ఈ.సుమిత్ర, ఎస్. నాగమణి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకులు కే. యాదగిరి, ఎం.కృష్ణమ్మ తదితరులతో పాటు పలు రంగాల కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శామీర్ పేట్ సిపిఐ కార్యాలయంలో..

విశాలాంధ్ర - మల్కాజిగిరి : 139వ మేడేను పురస్కరించుకొని కార్మికుల దినోత్సవాన్ని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా, షామీర్పేట్ మండల హెడ్ క్వార్టర్ బి.ఎస్.ఎన్.ఎల్ ఆఫీస్ వద్ద గల సి.పి.ఐ పార్టీ జెండాను, మేడ్చల్ జిల్లా పార్టీ కార్యదర్శి డి.జి.సాయిలు గౌడ్ ఆవిష్కరించారు. సుదీర్ఘంగా కార్మికుల పక్షాన, పేదల పక్షాన, పోరాడుతున్నది కేవలం కమ్యూనిస్టులు మాత్రమేనని పునరుద్ఘాటించారు. కార్మికులు, కర్షకుల, ప్రజాస్వామ్యవాదులు, విద్యార్థులు, మేధావులు, వారి హక్కుల కోసం ఏకమవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏ.ఐ.కే.ఎస్ రాష్ట్ర కోశాధికారి డి.జి.నరేంద్ర ప్రసాద్, జిల్లా కార్యదర్శి నిమ్మల నరసింహ, పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి భూమయ్య, మండల సహాయ కార్యదర్శి మురళీధర్ రాజు, స్థానిక ప్రజలు సుధాకర్ రెడ్డి, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.







ఘనంగా మేడే కార్మిక దినోత్సవం

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నియోజక వర్గ పరిధిలో ఇజ్జత్ నగర్, ఖానా మెట్, హైటెక్ సిటీ, తదితర డివిజన్లలో మేడే ఉత్సవాలను భారత కమ్యూనిస్టు పార్టీ నాయకులు జన సందోహంగా జరుపుకున్నారు, డివిజన్లలో ఎరుపు జెండాలతో అలంకరించి సిపిఐ జెండాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి నియోజక వర్గ కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ ప్రపంచ కార్మికులారా ఏకంకండి అనే నినాదంతో భారత కమ్యూనిస్టు పార్టీ పుట్టుకొచ్చిందని అదే ఐక్యతతో కార్యకర్తలు కృషి దీక్ష పట్టుదలతో ముందుకు సాగాలని కోరారు. పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు తప్ప అనే నినాదంతో గర్జించారు, ఆనాడు భారత కమ్యూనిస్టు పార్టీ ఏర్పడే సమయంలో సంఘటనలను గుర్తుకు తెచ్చారు, భూ పోరాటాలతో భూములను సాధించి నిరుపేదలకు పంచన ఘనత సిపిఐ పార్టీకి దక్కిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి చందు యాదవ్, ఏఐవైఎఫ్ కార్యదర్శి శ్రీనివాస్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు కోన సుధాకర్, పాపి రెడ్డి కాలనీ కార్యదర్శి బట్టు భక్తరాజు, ఏఐటీయూసీ అధ్యక్షులు తుపాకుల రాములు, డిహెచ్పిఎస్ కార్యదర్శి కొండల్, రఘు ఎం వెంకటేష్, బి నారాయణ ఏఐఎస్ఎఫ్ కార్యదర్శి ప్రెసిడెంట్ ధర్మతేజ నితీష్ నాయకులు పాల్గొన్నారు, అనంతరం పార్టీ విషయాలను చర్చించారు.

విశాలాంధ్ర - కాప్రా : నాలుగు లేబర్ కోడ్లను రద్దుచేసి 44 కార్మిక చట్టాలను అమలు చేయాలని, భవన నిర్మాణ కార్మికుల మరణానికి 10 లక్షల ప్రమాద బీమా 60 సంవత్సరాలు నిండిన ప్రతి కార్మికులకి పదివేల పెన్షన్ అందించాలని భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి జీ. దామోదర్ రెడ్డి పిలుపునిచ్చారు. 139 మేడే కార్మిక దినోత్సవాన్ని హౌసింగ్ బోర్డ్‌లోని తెలంగాణ భవన నిర్మాణ కార్మిక సంఘం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్మిక జెండాను దామోదర్ రెడ్డి ఎగురవేశారు. ఈ సందర్భంగా సీపీఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి జీ. దామోదర్ రెడ్డి, ఏఐటీయూసీ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్.శంకర్‌రావు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బిజెపి నరేంద్ర మోడీ ప్రభుత్వం మూడు రైతు వ్యతిరేక కార్మిక చట్టాలను అమలు చేయాలని 44 కార్మిక చట్టాల్లో 29 కార్మిక చట్టాలను సమూలంగా రద్దుచేసి పెట్టుబడిదారులకు కార్పొరేట్లకు బడా వ్యాపారస్తులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్లు తెచ్చిందని తెలియజేశారు. ఈ కోడ్ల వల్ల కార్మికుల పనిగంటలను మళ్లీ 12 గంటలకు పెంచి కార్మిక చట్టాలలో అనేక సవరణలు చేయాలని చూస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా నాయకులు గొల్లారి స్వామి దాసు, అడ్డ యూనియన్ అధ్యక్షులు కే స్వామి దాసు, ఉపాధ్యక్షులు జి యాకోబు ఆర్ ఐలయ్య బాబు నాయక్ ఆదామ్ జమలయ్య ఎల్లయ్య ప్రధాన కార్యదర్శి జేపీ శ్రీనివాస్ సహాయ కార్యదర్శిలు ఓంకార్ పాపయ్య బంగారయ్య సాయిలు శ్రీను కార్మికులు బాబురావు నరసింహ లక్ష్మమ్మ శ్రీలత లక్ష్మి కోటేశ్వరమ్మ సాయమ్మ లక్ష్మి పాల్గొన్నారు.

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: మే డే సందర్భంగా శేరిలిగంపల్లి మండల పరిధిలో చందానగర్ సబ్‌స్టేషన్ వద జెండాను రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు జగదీష్, జిల్లా నాయకులు చల్ల శోభన్, సిఐటియు శేరింగంపల్లి కార్యదర్శి కొంగరి కృష్ణ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్మికులకు ఎనిమిది గంటల పని విధానం రావాలని 1886లో అమెరికాలోని చికాగో నగరంలో హే మార్కెట్లో జరిగినటువంటి వీరోచిత పోరాటంలో అప్పుడు ఉన్నటువంటి పెట్టుబడి సమాజంలో ఎనిమిది గంటల పని విధానం కోసం మహోత్తరమైన పోరాటం చేస్తుండగా అక్కడ ఉన్నటువంటి పెట్టుబడిదారులు కార్మికులని విచక్షణారాహితంగా లాఠీచార్జి తుపాకులతో కార్మికుల పెట్టుబడుదారుల మధ్య జరుగుతున్న హెూరాహెూరా పోరాటం జరుగుతున్న తరుణంలో అక్కడ కొంతమంది కార్మికులు చనిపోవడం జరిగిందన్నారు. అప్పటినుంచి నేటి వరకు మే డే ను ఒక ప్రాంతానికి పరిమితం కాకుండా ప్రపంచవ్యాప్తంగా మేడేని జరుపుకోవడం కార్మికుల హక్కులు కాపాడాలని శ్రమ గౌరవించాలని శ్రమకు తగ్గ వేతనం ఇవ్వాలని పోరాటం చేస్తున్నారన్నారు. అందులో భాగంగా చందానగర్‌లో మే డే ఉత్సవాలు జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్, జిహెచ్ఎంసి వర్కర్స్ అంగన్వాడీ టీచర్లు, రమేష్ రెడ్డి, ఆంజనేయులు, క్రాంతి కిరణ్, నాగమణి, సువర్ణ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర - కాప్రా : నాచారం డివిజన్ పరిధిలో మే డే (అంతర్జాతీయ కార్మిక దినోత్సవం) సందర్భంగా సిపిఎం, సిఐటియు ఆధ్వర్యంలో 12 చోట్ల జెండా ఆవిష్కరణలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిఐటియు ప్రధాన కార్యదర్శి పి.గణేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమకి. మొత్తం 300 మందికి పైగా కార్మికులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పి.గణేష్ మాట్లాడుతూ.. మేడే చరిత్రను స్పష్టంగా వివరించారు. ఇక కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఈ హక్కులను కాలరాసే ప్రయత్నంగా 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు కోడ్‌లుగా మార్చిందని, 2025 ఏప్రిల్ నుండి అవి అమలులోకి వచ్చేలా చేసినా, జాతీయ కార్మిక సంఘాలు దీన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ మేరకు మే 20న జాతీయ సార్వత్రిక సమ్మెకు పిలుపు ఇవ్వబడిందని, ఇది భారత కార్మిక చరిత్రలో 23వ సమ్మెగా నిలుస్తుందన్నారు. జెండా ఆవిష్కరణల అనంతరం నాచారం నుండి 27 బైకులతో ఈసీఐఎల్ వరకు ర్యాలీగా వెళ్లి, అక్కడి నుండి ఉప్పల్ రింగ్ రోడ్ దాకా బైక్ ర్యాలీ నిర్వహించబడింది. ఈ ర్యాలీ సిఐటియు నాయకత్వంలో ఉత్సాహభరితంగా సాగింది. ఈ కార్యక్రమంలో ప్రభాకర్, బాబు, వై.శేఖర్ రెడ్డి, సత్యం గౌడ్, బాల్ రాజ్, లక్ష్మణ్, రమేష్, రామకృష్ణ, ఉపేందర్, సుధీర్ బాబు, నరసింహ, ఎల్లేష్, ఐలేష్, మల్లారెడ్డి, చంద్రారెడ్డి, అలీ, అంజయ్య, యాకయ్య, వెంకన్న, భాస్కర్, సైదులు, ఎండీ ఖదీ పాల్గొన్నారు.

విశాలాంధ్ర-దుండిగల్: దేశ నిర్మాణంలో ప్రతీ కార్మికుడి కష్టం, చెమట చుక్కలు ఉన్నాయని బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ పేర్కొన్నారు. గురువారం మేడే కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకొని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధి జీడిమెట్ల పారిశ్రామిక వాడలోని ఈస్ట్ కోస్ట్ మాగ్నెట్స్ ప్రైవేట్ లిమిటెడ్, వసుధ ఫార్మా, ఆంధ్ర పాలిమర్స్ పరిశ్రమల లో నిర్వహించిన వేడుకలకు కార్మిక నాయకులు, స్థానిక ఎమ్మెల్యే, బిఆర్ఎస్ పార్టీ విప్ కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై కార్మిక విభాగం జెండాను ఆయన చేతుల మీదుగా ఎగురవేసి కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద మాట్లాడుతూ దేశ నిర్మాణంలో ప్రతీ కార్మికుడి కష్టం, చెమట చుక్కలు ఉన్నాయని, కార్మికుల ద్వారానే దేశ ప్రగతి సాధ్యమని తెలిపారు. అనంతరం ఈస్ట్ కోస్ట్ మాగ్నెట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నందు నిర్వహించిన వేడుకల్లో యూనియన్ సెక్రటరీ ఎం.శ్రీనివాస్‌రావు, ఉపాధ్యక్షులు డి.అశోక్ బాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రసంజిత్ మండల్, జాయింట్ సెక్రటరీ దుర్గా ప్రసాద్ పాల్గొని ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే వివేకానందని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో-ఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, మాజీ గ్రంథాలయ చైర్మన్ నాగరాజు యాదవ్, సూరారం డివిజన్ ప్రధాన కార్యదర్శి సిద్దిక్, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కుంట సిద్దిరాములు, జ్ఞానేశ్వర్ ముదిరాజ్, యేసు, నదీమ్ రాయ్ పాల్గొన్నారు.

విశాలాంధ్ర - మేడిపల్లి: మేడిపల్లి మండలం పరిధిలోని బోడుప్పల్, పిర్జాదిగూడ కార్పొరేషన్‌లో సిపిఐ పార్టీ మండల కార్యదర్శి రచ్చ కిషన్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం మేడే ఉత్సవాలు నిర్వహించడం జరిగినది. బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలో ఇందిరానగర్ కాలనీ, దేవేందర్ నగర్ కాలనీ పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో భగత్ సింగ్ నగర్ కాలనీలో పార్టీ సీనియర్ నాయకులు జెండాలు ఎగురవేయడం జరిగినది. మేడే కార్యక్రమాన్ని ఉద్దేశించి రచ్చ కిషన్, జె లక్ష్మిలు మాట్లాడుతూ మేడేను అంతర్జాతీయ కార్మిక దినోత్సవం అని కూడా పిలుస్తారు. చాలా దేశాల్లో మే డేని సెలవు దినంగా పాటిస్తారు. ఈ కార్మిక దినోత్సవ ఆవిర్భావాన్ని ఏ ఒక్క దేశానికో, సంఘటనకో ముడిపెట్టలేం. కానీ 1886లో షికాగోలోని హే మార్కెట్‌లో జరిగిన కార్మికుల ప్రదర్శనే ఈ మేడే పుట్టుకకు పునాది వేసిందని చెబుతారు. కార్మికులకు ఎనిమిది గంటల పని విధానం గురించి నినదిస్తూ 1886, మే1న చాలామంది కార్మికులు పోరాటం చేపట్టారు. దానికి మద్దతుగా నాలుగు రోజుల తరవాత షికాగోలోని హే మార్కెట్‌లో చాలా మంది ప్రదర్శన నిర్వహించారు. కానీ ఆ ప్రదర్శన ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు జరిపిన కాల్పుల్లో కొందరు కార్మికులు చనిపోయారు. ఆ సంఘటన అనంతరం 1889 నుంచి 1890 వరకు అనేక దేశాల్లో కార్మికుల ఉద్యమాలూ, నిరసన ప్రదర్శనలూ చోటుచేసుకున్నాయి. 1890, మే 1న బ్రిటన్‌లోని హైడ్ పార్క్‌లో చేపట్టిన ప్రదర్శనకు దాదాపు 3 లక్షల మంది కార్మికులు హాజరయ్యారు. రోజులో కేవలం 8 గంటలు మాత్రమే పనివేళలు ఉండాలన్నదే ఆ ప్రదర్శనలో పాల్గొన్న వారి ప్రధాన డిమాండ్. ఆ పైన అనేక యూరోపియన్ దేశాల్లో ఇదే నినాదంతో ప్రదర్శనలు జరిగాయి. క్రమంగా షికాగోలో జరిగిన కార్మిక ప్రదర్శనలో చనిపోయిన వారికి గుర్తుగా మే 1ని కార్మిక దినోత్సవంగా జరుపుకుంటున్నాము. ఈ కార్యక్రమంలో మేడిపల్లి మండల కౌన్సిల్ సభ్యులు కె ప్రమీల, సిహెచ్ మాధవి, దండు రమేష్, కె మహాలక్ష్మి, బాపరాజు, భూతం అయిలయ్య, మహేశ్వరి, దండు మదర్, ఇస్తారి, సోమరాజు, బొందయ్య, నరసమ్మ, పి ఆండాలు, రాజమ్మ, లక్ష్మమ్మ, జి నాగరాజు, శీను పాల్గొన్నారు.

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఉప్పల్ డిపో వద్ద ఏఐటీయూసి అనుబంధ రంగం ఆర్టీసీ (ఎంప్లాయిస్ యూనియన్) ఆధ్వర్యంలో గురువారం ఉదయం 139వ ప్రపంచ కార్మికుల దినోత్సవం (మే డే) సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ హాజరయ్యారు. అనంతరం ఎంప్లాయిస్ యూనియన్ అరుణపతాకాన్ని ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ 1886 లో అమెరికా, చికాగో లోని హే మార్కెట్ లో కార్మికులు తమ హక్కుల కోసం పోరాటాలు చేసి మరణించిన వారికి గుర్తుగా మే1 న ప్రపంచ కార్మికుల దినోత్సవం జరుపుకుంటున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ప్రతిరోజు విశ్వమంతా ముందుకు నడిపించేవాడు కార్మికుడు. తన చెమట చుక్కలను, రక్త మాంసాలను, కరిగించి పనిచేస్తేనే ప్రపంచం ముందుకు కదులుతుంది. వారికి శ్రమకు తగ్గ గుర్తింపు ఇస్తూ జరుపుకునే పండుగ కార్మిక దినోత్సవం. మే డే కార్మికుల ఐక్యత, పోరాటాలకు నిదర్శనంగా నిలుస్తుంది. కానీ నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను కాలరాస్తున్నారు. శ్రమకు తగ్గ ఫలితం ఇవ్వకుండా అనేక ఇబ్బందులకు గురి చేస్తున్నారు. పోరాటాలు చేసి సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని పెంచే కుట్ర చేస్తున్నారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు, మహిళా సమాఖ్య మేడ్చల్ జిల్లా కార్యదర్శి జె. లక్ష్మి, ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఎండీ అన్వర్, ఎంప్లాయిస్ యూనియన్ రీజినల్ సెక్రటరీ బి. ధనుంజయ్, ఉప్పల్ డిపో కార్యదర్శి సిహెచ్ కృష్ణ, సహాయ కార్యదర్శి బాలకృష్ణ, సంయుక్త కార్యదర్శులు గోవర్ధన్, వీజె రెడ్డి, ప్రచార కార్యదర్శులు, నరసింహ, పిఎస్ రెడ్డి, బాలయ్య, కోశాధికారి శ్రీనివాస్ ఏఐటీయూసి జిల్లా డిప్యూటీ సెక్రటరీ రమేష్, మండల కార్యదర్శి మహేశ్వరీ బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు బాత రాజు, సిపిఐ నాయకులు బొందయ్య, నర్సమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ, సిపిఐ ఆధ్వర్యంలో ఘనంగా మేడే ఉత్సవాలు

విశాలాంధ్ర - హైదరాబాద్ : 139 వ మేడే సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని గాజుల రామారం డివిజన్ లెనిన్ నగర్‌లో, శ్రీనివాస్ నగర్ బస్ స్టాప్‌లో, 126 డివిజన్ శ్రీనివాస్ నగర్‌లో, మక్దుం నగర్‌లో, అంజయ్య నగర్‌లో, బీరప్ప నగర్, జగదిరిగుట్ట చివరి బస్ స్టాప్ వద్ద, జగద్గిరిగుట్ట డంపింగ్ యార్డ్ వద్ద, రంగారెడ్డి నగర్ డివిజన్లోని గుబురుగుట్ట, ఆల్ బెస్టాఫ్ కమాన్, రంగారెడ్డి నగర్ బస్ స్టాప్ వద్ద, గిరి నగర్, గాంధీనగర్ ఏఐటీయూసీ కార్యాలయం, ఐడిపిఎల్ ఆటో యూనియన్, మున్సిపల్ కార్యాలయం, ఉషోదయ టవర్స్, షాపూర్ నగర్, హమాలీ అడ్డా, గండి మైసమ్మ చౌరస్తా, దుండిగల్ గ్రామంలో, ఆర్టీసీ డిపో తదితర ప్రాంతంలో ఏఐటియుసి, సిపిఐ జండాలను ఎగురవేయడం జరిగింది. షాపూర్ నగర్ హమాలి అడ్డ వద్ద ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు యూసుఫ్ ఏఐటియుసి జెండాను ఎగురవేయడం జరిగింది. అనంతరం షాపూర్ నగర్ పొట్లూరి నాగేశ్వరరావు భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశానికి నియోజకవర్గ అధ్యక్షులు హరినాథ్‌రావు అధ్యక్షత వహించగా, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు స్వామి స్వాగత ఉపన్యాసం చేయగా ముఖ్య అతిథిగా ప్రముఖ శాస్త్రవేత్త సోమ సుందర్ హాజరై ప్రసంగించడం జరిగింది. 139 సంవత్సరాల క్రితం పని గంటల కోసం కార్మికులు పోరాటం చేస్తే అది తర్వాత కార్మికులలో స్ఫూర్తిని నింపి కార్మిక హక్కులను సాధించుకోవడం జరిగిందన్నారు. నాడు కార్మికులు సాధించుకున్న హక్కులను నేటి పాలకులు కాలరాస్తున్నారని వాటిని ప్రజలు అడగకుండా చేయడానికి అన్ని అంశాలను మతం, దేవుడు అనే పేరుతో ముడిపెట్టి ప్రజలలో కార్మిక చైతన్యాన్ని తొలగించి మత చైతన్యాన్ని తీసుకువచ్చి వారిని వారి హక్కుల నుంచి దూరం చేస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశం మరో అతిథులు సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్, ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు యేసు రత్నం మాట్లాడుతూ కార్మికుల పని గంటల దినాలు, కనీస వేతనాలు, యూనియన్ ఏర్పాటు చేసుకునే హక్కు, ఈ ఎస్ ఐ, పిఎఫ్ లాంటి సంక్షేమ పథకాలను నేడు కార్మికులు అందుకుంటున్నారంటే అది ఏఐటీయూసీ చేసిన పోరాటాల ఫలితమేనన్నారు. ఏఐటీయూసీ, సిపిఐ చేసే కార్మిక పోరాటాలలో అన్ని వర్గాల వారిని భాగస్వామ్యం చేయాలని అసెంబ్లీలో ఉన్నటువంటి 117 మంది ఎమ్మెల్యేలలో ఒకే ఒక్కడు అయినటువంటి కూనంనేని సాంబశివరావు సిపిఐ ఎమ్మెల్యేగా ఉండి ప్రతి సమావేశంలో కార్మికుల హక్కుల గురించి మాట్లాడుతున్నాడని ఇతర పార్టీల ఏ శాసనసభ్యుడైనా మాట్లాడుతున్నాడో లేదో గమనించాలని దాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసి రానున్న రోజుల్లో సిపిఐ సభ్యులను శాసనసభ్యులుగా ఎన్నుకుంటే మరిన్ని హక్కులను పొందవచ్చని కాబట్టి మే డే స్ఫూర్తితో రానున్న రోజుల్లో మనమందరం కలిసి ప్రజల్లో చైతన్యాన్ని నింపి వచ్చే ఎన్నికల్లో కమ్యూనిస్టులను ఘనమైన సంఖ్యలో అసెంబ్లీకి పంపించాలని కోరారు. ఈ కార్యక్రమాలకు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వి శ్రీనివాస్, సిపిఐ సహాయ కార్యదర్శి నరసింహ రెడ్డి, దుర్గయ్య, కోశాధికారి సదానంద్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి ప్రవీణ్, మహిళా సమైక్య జిల్లా అధ్యక్షురాలు హైమావతి, మాజీ కౌన్సిలర్ నరసయ్య, ఏఐటీయూసీ, సిపిఐ నాయకులు సాయిలు యూసుఫ్ కే వెంకటేష్ చంద్రయ్య బాల్రాజ్ ఏం సహదేవరెడ్డి సి వెంకటేష్ రాములు కృష్ణ నర్సయ్య స్వామి యాదగిరి ఇమామ్ విజయ్ యాకూబ్ యాదయ్య కుమార్ రాజు చందర్ సామిల్ రవి రాములు ఆశయ్య సుంకిరెడ్డి మహేష్ బోనాల కనకయ్య భీమేష్ శ్రీనివాస్ దానియల్ ఖయ్యూం రాజేష్ కమలమ్మ జంబు కార్తీక్ స్వామి బిక్షపతి మల్లేష్ తోపాటు ప్రజానాట్యమండలి అధ్యక్షులు భాస్కరాచారి కృష్ణ పాల్గొని విప్లవ గేయాలను ఆలపించడం జరిగింది.

జనగణనలో కుల గణన బీసీల చారిత్రాత్మక విజయం : ఎంపీ

విశాలాంధ్ర-బషీర్ బాగ్ : దేశవ్యాప్తంగా జనగణనలో కుల గణన బీసీల చారిత్రాత్మక విజయం అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య అన్నారు. ప్రధాని మోడీ నిర్ణయంతో బీసీల శకం ప్రారంభమైందని ఆయన పేర్కొన్నారు. గురువారం బషీర్బాగ్ ప్రెస్‌క్లబ్ లో 40 బీసీ సంఘాలతో జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ నీలా వెంకటేష్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్ కృష్ణయ్య ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 94 ఏండ్లుగా పరిష్కారము కానీ సమస్యకు బిజెపి ప్రభుత్వం పరిష్కారం చూపిందని అన్నారు. బీసీలకు ఇదొక చారిత్రాత్మక దినం అన్నారు. విద్య వైద్యం రాజకీయ ఆర్థిక రంగాలలో జనాభా దామాషా ప్రకారం బీసీలకు వాటా లభించనున్నదని చెప్పారు. ప్రధాని మోడీ హెూం మంత్రి అమిత్ షా ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భక్తుల వల్లనే ఇది సాధ్యమైంది అన్నారు. బిజెపి బీసీల పార్టీగా మారిందని జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు బీసీ మంత్రిత్వ శాఖ కూడా త్వరలో సాధిస్తామని అన్నారు. జస్టిస్ రోహిణి కమిషన్ రిపోర్టు బీసీల కుల గణన లేకపోవడం వలన మరుగున పడిందని తెలిపారు. బీసీలంతా హిందువులేనని మతం మారేవారికి ప్రయోజనాలు ఇచ్చినప్పుడు బీసీలకు ఎందుకు ఇవ్వరని అమిత్ షాను ప్రశ్నించినట్లు ఆయన చెప్పారు. బీసీలకు మంచి రోజులు ప్రారంభం అయ్యాయని అన్నారు. పార్టీల భేదం లేకుండా ప్రధానిని ప్రశంసించాలని చెప్పారు. త్వరలో బీసీ నేతలతో ఢిల్లీ వెళ్లి ప్రధాని మోడీని సన్మానించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం బీసీ మేధావుల ఫోరం అధ్యక్షుడు ఆళ్ల రామకృష్ణ మాట్లాడుతూ.. ఎంపీ ఆర్ కృష్ణయ్య కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి ఈ విజయం అందించాడని అన్నారు. బీసీలంతా ఆయనకు రుణపడి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు బత్తుల సిద్దేశ్వర్, సి రాజేందర్, గొరిగే మల్లేష్, రాందేవ్ మోడీ, వేముల రామకృష్ణ, అంజి యాదవ్, శివుడు తదితరులు పాల్గొన్నారు.

ఫలించిన ఎన్నో ఏళ్ల నిరీక్షణ

విశాలాంధ్ర - కాప్రా : కుషాయిగూడ గ్రామంలో రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేక గత 25 ఏళ్లుగా అనేక ఇబ్బందులు పడ్డామని, కానీ బొంతు శ్రీదేవి యాదవ్ కార్పొరేటర్‌గా గెలిచాక వారి హయాంలో అనేక అభివృద్ధి పనులను చేపట్టిందని వారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేసుకుంటూ ఇటీవల వాటర్ వర్క్స్ పనులు పూర్తి కావడంతో సిసి రోడ్స్ గురుంచి చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవికి వినతిపత్రం అందచేసిన కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కార్పొరేటర్ త్వరలో పనులు పూర్తి చేస్తామని వారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధానకార్యదర్శి పనగట్ల చక్రపాణి గౌడ్, కొడకండ్ల యాదయ్య, చిత్తుల కిషోర్ గౌడ్, చల్లా వెంకటేష్, చిదం బాలనర్సింహ వంశరాజ్, రాంగిరివార్ నర్సింగ్‌రావు, సారా శ్రీధర్ ముదిరాజ్, బన్నాపురం భాస్కర్, రాజు ముదిరాజ్, క్రాంతి, మణి కిరణ్, లావణం శ్రీనివాస్, కృత దినేష్, అనిల్ యాదవ్, తదితరులు పాల్గొనడం జరిగింది.

జలమండలికి ఉత్తమ యాజమాన్య అవార్డు

విశాలాంధ్ర - హైదరాబాద్ : జలమండలికి అవార్డుల పరంపర కొనసాగుతోంది. ఇప్పటికే వరల్డ్ వాటర్ అవార్డు, ఉత్తమ ఎస్టీపీ లాంటి వాటిని గెలుచుకోగా.. తాజాగా మరొక అవార్డును తన ఖాతాలో వేసుకుంది. తమ సంస్థలో పనిచేస్తున్న కార్మికుల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, తీసుకుంటున్న చర్యలు, మంచి పారిశ్రామిక సంబంధాలకు గానూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ యాజమాన్య పురస్కారాన్ని అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా ప్రకటించింది. ఈ అవార్డును జలమండలి ఎండీ అశోక్ రెడ్డి రవీంద్ర భారతిలో గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతులమీదుగా గురువారం అందుకున్నారు. ప్రభుత్వ విభాగాల్లో జలమండలికి మాత్రమే ఈ అవార్డు దక్కడం విశేషం.

కార్మికుల భద్రతకు పెద్దపీట..

బోర్డు పరిధిలో పనిచేసే కార్మికుల భద్రతకు జలమండలి పెద్దపీట వేస్తోంది. పని ప్రదేశాల్లో భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించేలా చూస్తోంది. విధులు నిర్వర్తించేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించేందుకు అన్ని డివిజన్లలో భద్రతా వారోత్సవాలు ఏటా నిర్వహిస్తోంది. పారిశుద్ధ్య పనుల్లో ఎస్వోపీ (స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్) గైడ్ లైన్స్ అమలుపై, భద్రతా పరికరాల పనితీరు, వాటిని ఉపయోగించే విధానం, మురుగు నీటి నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తల తో పాటు విధి నిర్వహణలో ఏదైనా ప్రమాదం సంభవించినపుడు చేసే ప్రథమ చికిత్స వంటి అంశాలపై కార్మికులు, సిబ్బందికి అవగాహన కల్పిస్తారు. అంతేకాకుండా కార్మికుల ఆరోగ్య భద్రత కోసం హెల్త్ కార్డులను సైతం జారీ చేసి ఆర్నెళ్లకోసారి ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తుంది. ఈ అవార్డు ప్రదాన కార్యక్రమంలో పర్సనల్ డైరెక్టర్ మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, ఉన్నతాధికారులు, ఉగ్యోగులు పాల్గొన్నారు.

సరికొత్త ఉత్పత్తి కేంద్రాన్ని ఆవిష్కరించిన ఆజాద్ ఇంజినీరింగ్

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: ప్రెసిషన్ ఇంజినీరింగ్ పరికరాల తయారీ లో అగ్రగామి అయిన ఆజాద్ ఇంజినీరింగ్ సంస్థ హైదరాబాద్‌లోని తునికిబొల్లారంలో సరికొత్త ఉత్పత్తి కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించింది. జీఈ వెర్నోవా వారి స్టీమ్ పవర్ సర్వీసెస్ బిజినెస్ కోసం ఆజాద్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం ద్వారా ఓ సరికొత్త మైలురాయి అందుకుంది. 7,600 చదరపు మీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఈ అత్యాధునిక యూనిట్‌ను జీఈ వెర్నోవా ఉన్నతాధికారులు ప్రారంభించారు. వారిలో లీన్ లీడర్ రొడొల్ఫో టోరెస్, సోర్సింగ్ లీడర్ అంకుర్ చందక్, గ్లోబల్ కమోడిటీ లీడర్ మార్టిన్ షేఫర్, సప్లయర్ క్వాలిటీ లీడర్ అఖనా కబాకా, గ్లోబల్ ప్లానింగ్ లీన్ లీడర్ కార్లీ లోరెన్స్, ఇంకా ఆజాద్ ఇంజినీరింగ్ సీఈఓ, ఛైర్మన్ రాకేష్ చొప్దార్ ఉన్నారు. ఆజాద్ ఇంజినీరింగ్‌కు ఈ లీన్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ ఒక ప్రధాన మైలురాయి. 2013లో కొన్ని యంత్రాలతో ప్రారంభమైన ప్రయాణం ఇప్పుడు ప్రపంచస్థాయి ఉత్పత్తి కేంద్రంగా అభివృద్ధి చెందింది. శ్రేష్ఠత విషయంలో భాగస్వాముల పట్ల నిబద్ధతను ప్రదర్శిస్తుంది.

ఉత్తమ విద్యార్థులకు రూ.పదివేల చెక్కులు అందజేత

విశాలాంధ్ర - మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని శ్రీ సాయి విద్యానికేతన్ స్కూల్ పదవ తరగతి విద్యార్థులు అత్యున్నత మార్కులతో ఉత్తీర్ణత సాధించినందుకు అభినందనలు తెలిపారు. ప్రిన్సిపాల్, కరస్పాండెంట్ ఆకుల మధుకర్ గౌడ్ విజయోత్సవ సమావేశాన్ని నిర్వహించి, ఉత్తమ ఐదుగురు విద్యార్థులకు పదివేల రూపాయల చెక్కులను మాజీ మేయర్ అమర్ సింగ్, మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివ కుమార్ గౌడ్ సమక్షంలో గురువారం ఉదయం ప్రదానం చేశారు. విద్యార్థుల కృషిని, విద్యాసంస్థ యొక్క దక్షతను ప్రశంసించారు. ఈ సందర్భంగా విద్యార్థుల భవిష్యత్తు ప్రయత్నాలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ అమర్ సింగ్, మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు కుర్ర షాలిని శ్రీకాంత్ గౌడ్, మాడుగుల చంద్రకళ చంద్రారెడ్డి విద్యార్థులను అభినందించారు.

రైట్స్ ఇష్యూను ప్రారంభించిన రెమెడియం లైఫ్ కేర్ లిమిటెడ్

విశాలాంధ్ర - శేరిలింగంపల్లి: బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) నుంచి ఆమోదం పొందిన రెమెడియం లైఫ్కేర్ లిమిటెడ్ (బీఎస్ఈ: 539561) రైట్స్ ఇష్యూను ప్రారంభించింది. ఈ వ్యూహాత్మక చొరవ నిట్టనిలువుగా సమీకృత, పరిశోధన ఆధారిత ఫార్మాస్యూటికల్ లీడర్‌గా ఎదిగే దిశగా కంపెనీ ప్రయాణంలో ఒక ముఖ్యమైన దశను సూచిస్తుంది. రైట్స్ ఇష్యూ 2025 ఏప్రిల్ 30న ప్రారంభమై 2025 మే 14న ముగుస్తుంది. రెమెడియం ఇటీవల ఒక సంస్థతో రూ.182.7 కోట్ల ఒప్పందం కుదుర్చుకున్న నేపథ్యంలో మూలధన సమీకరణ జరిగింది. యుకెకు చెందిన ప్రముఖ ఫార్మాస్యూటికల్ కంపెనీ, అంతర్జాతీయ విస్తరణకు తన నిబద్ధతను నొక్కి చెప్పింది. సమీకరించిన నిధులను వర్కింగ్ క్యాపిటల్ ను బలోపేతం చేయడానికి, ఆర్ అండ్ డి సామర్థ్యాల్లో పెట్టుబడులు పెట్టడానికి, అధిక విలువ కలిగిన ఫార్మాస్యూటికల్ ఇంటర్మీడియెట్ల ఉత్పత్తిని పెంచడానికి, అగ్రభాగాన్ని ఆకర్షించడానికి ఉపయోగిస్తారు. టాలెంట్, డిజిటల్ పరివర్తనను ప్రేరేపిస్తుంది మరియు ప్రపంచ మార్కెట్ వ్యాప్తిని వేగవంతం చేస్తుంది. ఈ సందర్భంగా రెమిడియం లైఫ్ కేర్ మేనేజింగ్ డైరెక్టర్ ఆదర్శ్ ముంజాల్ మాట్లాడుతూ లిమిటెడ్, వ్యాఖ్యానించింది ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన, ఆవిష్కరణ ఆధారిత ఫార్మాస్యూటికల్ కంపెనీగా మారడానికి మా ప్రయాణంలో ఈ రైట్స్ ఇష్యూ ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది. క్యాపిటల్ ఇన్ఫ్యూషన్ దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో మా వ్యూహాత్మక భాగస్వామ్యాలను బలోపేతం చేస్తుంది. ముఖ్యంగా యూరప్, ఆసియాపై దృష్టి సారించింది.

రాహుల్ గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం

విశాలాంధ్ర-బషీర్ బాగ్: జనాభా లెక్కల్లో కులగణన చేయాలన్న కేంద్ర నిర్ణయంపై పలు బీసీ సంఘాలు హైదరాబాద్‌లో సంబరాలు ఘనంగా నిర్వహించారు. జాతీయ ఓబీసీ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షులు ఆళ్ల రామకృష్ణ ఆధ్వర్యంలో గురువారం హైదర్ గూడ కూడలిలో ఉన్న జ్యోతిరావు పూలే దంపతుల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం రాహుల్ గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆళ్ల రామకృష్ణ మాట్లాడుతూ... బీసీ ఆజాద్ ఐకాస ఛైర్మన్ బత్తుల సిద్దేశ్వర పటేల్ ఢిల్లీలో 22 రోజుల ఆమరణ నిరాహార దీక్షకు ప్రతిఫలం దక్కిందని ఆయన అన్నారు. దశాబ్దాల నిరీక్షణ అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ జాతి గణనలో కుల గణన చేస్తామని ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ ప్రక్రియను ఎలాంటి అవకతవకలకు తావు ఇవ్వకుండా, వేగవంతం చేయాలని మోదీకి విజ్ఞప్తి చేశారు. ఈ విషయంలో కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చిన లోకసభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీసీ ఆజాద్ ఐకాస ఛైర్మన్ బత్తుల సిద్దేశ్వర పటేల్ కాంగ్రెస్ సీనియర్ నేత రామన్ గౌడ్, బీసీ సంఘాల నేతలు పాల్గొన్నారు.

ఎరుపెక్కిన రాజమండ్రి

- మేడే వేళ... వేలాదిమంది కార్మికుల ప్రదర్శన
- ఎర్రజెండా సజీవం... కమ్యూనిస్టులే ప్రతిపక్షం
- సీపీఐ కార్యదర్శి నారాయణ

విశాలాంధ్ర బ్యూరో- రాజమహేంద్రవరం:
ప్రపంచ కార్మికుల దినోత్సవం మేడే సందర్భంగా సీపీఐ, జట్ల లేబర్ యూనియన్, ఏఐటీయూసీ అధ్వర్యంలో గురువారం వేలాదిమంది కార్మికులు కదం తొక్కడంతో రాజమండ్రి ఎరుపెక్కింది. ఉదయం నుంచే అనేక ప్రాంతాల్లో, కార్మిక వాడలలో, జట్ల సంఘం సెక్షన్‌ల వద్ద అరుణపతాకావిష్కరణలు జరిగాయి. సీపీఐ కార్యాలయం వద్ద పతకాన్ని పార్టీ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ ఎగురవేశారు. రెల్లి వీధి వద్ద పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు అక్కినేని వనజ, జట్ల సంఘం కార్యాలయం వద్ద జెండాను తాటిపాక మధు ఆవిష్కరించారు. ప్రభుత్వ ఆసుపత్రి వద్ద కుండ్రపు రాంబాబు ఆవిష్కరించారు. జట్లు లేబర్ యూనియన్ కార్యాలయం నుండి ప్రారంభమైన మహాప్రదర్శన అప్సర థియేటర్, రంభ ఊర్వశి మేనక, సీపీఐ కార్యాలయం, తాడితోట క్లాత్ మార్కెట్, సెల్టన్ హోటల్ మీదుగా ఆవ వద్ద గల వాటర్ ట్యాంక్ చేరుకుంది. అప్సర థియేటర్ వద్ద రెడ్డి వీరాస్వామి స్థూపానికి నారాయణ పూలమాలలు వేసి... నివాళి అర్పించారు. దారిపొడవునా దిక్కులు పిక్కటిల్లేలా కార్మికులు నినాదాలు చేశారు. అనంతరం జట్లు లేబర్ యూనియన్ అధ్యక్షుడు కుండ్రపు రాంబాబు అధ్యక్షతన బహిరంగ సభ జరిగింది.

నారాయణ మాట్లాడుతూ మేడే ప్రాశస్త్యాన్ని వివరించారు. కార్మికవర్గం పోరాటాల ద్వారా సాధించుకున్న 8 గంటల పని విధానాన్ని ప్రపంచ దేశాలు ఆమోదించాయని, అయితే ఈ ఎనిమిది గంటల పని విధానానికి మోదీ ప్రభుత్వం తూట్లు పొడుస్తోందని నారాయణ విమర్శించారు. ప్రైవేట్ కార్పొరేట్ శక్తులకు మేలు చేసేందుకు 12 గంటలు పని విధానం కోసం పావులు కదుపుతోందని మండిపడ్డారు. అందులో భాగంగానే నాలుగు లేబర్ కోడ్‌లను తెరపైకి తీసుకువచ్చిందన్నారు. కొంతమంది కుహనా మేధావులు కమ్యూనిస్టుల పని అయిపోయిందని వాగుతున్నారని, ప్రపంచంలో దోపిడీ ఉన్నంతవరకు ఎర్రజెండా రెపరెపలాడుతుందని, దీనిని ఆపే శక్తి ఎవరికీ లేదని రామకృష్ణ స్పష్టంచేశారు. రాష్ట్రంలో ప్రతిపక్షం లేదని, ఉన్నదంతా మోదీ పక్షమేనని, ఎర్రజెండాలు మాత్రమే నిజమైన ప్రతిపక్షంగా ప్రజాసమస్యలు లేవనెత్తుతున్నాయని నారాయణ చెప్పారు. ఈనెల 2న ప్రధాని మోదీ అమరావతి వస్తున్నారని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రయత్నించాలని, ప్రత్యేక హోదా ఇస్తామని బహిరంగ వేదికపైనే మోదీ ప్రకటించేలా చేయాలని సూచించారు.

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ మాట్లాడుతూ కార్మిక హక్కులు హరించడం ద్వారా అసంఘటిత కార్మిక వర్గానికి సామాజిక భద్రత లేకుండా చేసిందని కేంద్రాన్ని విమర్శించారు. మరోపక్క కార్పొరేట్ శక్తులకు రూ.15 లక్షల కోట్లు రుణాలు రద్దు చేసిందని, ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా అమ్మేస్తుందని మండిపడ్డారు. విద్యార్థుల ఆత్మ బలిదానాలతో ఏర్పడిన విశాఖ స్టీల్‌ప్లాంట్ అమ్మకానికి కుట్ర జరుగుతోందని, కోట్ల రూపాయల విలువ చేసే భూములను అదానీ, అంబానీలకు కట్టబెట్టే దిశగా కేంద్రం చర్యలు చేపడుతోందని, దీనిని అడ్డుకోవాలని కార్మికవర్గానికి పిలుపునిచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు మాట్లాడుతూ నాడు సాధించుకున్న ఎనిమిది గంటల పని దినం కోసం, ఉద్యోగ భద్రత కోసం ప్రతి కార్మికుడు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్మికవర్గం రాజకీయ చైతన్యంతో మెలగాలని, అప్పుడే దోపిడీ అంతమవుతుందని ఆయన అన్నారు. మేడే స్ఫూర్తితో మోదీ కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర కోశాధికారి బీవీబీ కొండలరావు, కోండ్రపు రాంబాబు మాట్లాడారు. సీపీఐ నగర కార్యదర్శి వి.కొండలరావు, నాయకులు సప్ప రమణ, చింతలపూడి సునీల్, కె.శ్రీనివాస్, పి.త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యం ఖూనీ

అంతకుముందు నారాయణ స్థానిక సీపీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని, కులాలు-మతాల పేరుతో దేశాన్ని విభజించి పాలిస్తున్నారని విమర్శించారు. సింహాచలంలో జరిగిన ఘటన దురదృష్టకరమని, దీనిపై విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ అమరావతి వస్తున్న సందర్భంగా పవన్ కల్యాణ్ మీసాలు తిప్పి... రాజధాని పునర్నిర్మాణం సత్వరమే పూర్తయ్యేలా మాట్లాడాలని సూచించారు. 2014లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉండగా ప్రధానమంత్రి ఈ రాష్ట్రానికి ఎటువంటి నిధులు ఇవ్వలేదని, నాడు అమరావతి శంకుస్థాపనకు వచ్చినప్పుడు చెంబుడు నీళ్లు, గుప్పెడు మట్టి ఇచ్చారని, అందుకే తర్వాత ఎన్నికల్లో చంద్రబాబు ఓటమి చెందారన్నారు. మోదీకి ఎన్నికలపై ఉన్న ప్రేమ... దేశభద్రతపై లేదని ఆరోపించారు. కశ్మీరులో ఉగ్రదాడి ఘటనపై అఖిలపక్ష సమావేశానికి డుమ్మా కొట్టిన మోదీ... బీహార్ ఎన్నికల ప్రచారంలో మాత్రం పాల్గొన్నారన్నారు. మావోయిస్టుల అణచివేత పేరుతో అమాయక గిరిజనులను చంపుతున్నారని, అక్కడ ఉన్న సహజ వనరులను అదానీకి అప్పగించడానికే కగార్ డ్రామా ఆడుతున్నారని ఆయన విమర్శించారు. అక్కినేని వనజ, తాటిపాక మధు పాల్గొన్నారు.

మేలో సూరీడు సుర్రు!

- సాధారణం కంటే ఉష్ణోగ్రతలు అధికం
- వాతావరణశాఖ హెచ్చరిక

న్యూఢిల్లీ:
భారతదేశంలో వివిధ ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు మేలో సాధారణం కంటే అధికంగా ఉంటాయని వాతావరణశాఖ వెల్లడించింది. వివిధచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశాలున్నాయని చెప్పింది. ఉత్తర భారతదేశంలో వర్షపాతం సాధారణం కంటే ఎక్కువగా ఉంటుందని పేర్కొంది. రాజస్థాన్, హర్యానా, పంజాబ్, మధ్య ప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్‌లోని గంగానది తీర ప్రాంతాల్లో వేడిగాలులు సాధారణం కంటే ఎక్కువ రోజులు ఉంటాయని వాతావరణశాఖ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర పేర్కొన్నారు. వేడిగాలుల తీవ్రత సాధారణ రోజుల కంటి నాలుగు రోజులు ఎక్కువగా ఉంటాయని చెప్పారు. గుజరాత్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, తెలంగాణ, ఉత్తర కర్నాటకలోని వివిధ ప్రాంతాల్లోనూ సాధారణం కంటే ఎక్కువగా వడగాలులు వీచే అవకాశం ఉందన్నారు. సాధారణంగా నైరుతి ద్వీపకల్ప భారతం మినహా వివిధ ప్రాంతాల్లో మేలో మూడు రోజులు వడగాలులు వీస్తాయి. వాయువ్య, మధ్య, ఈశాన్య భారతంలోని కొన్ని ప్రాంతాలు మినహా దేశంలో చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం సాధారణం కంటే వేడి గాలులు వీచే అవకాశం ఉంది. నైరుతి ద్వీపకల్పం మినహా దేశంలోని వివిధ ప్రాంతాల్లో మేలో ఒకటి నుంచి మూడు రోజులు వేడి గాలులు వీస్తాయని వాతావరణశాఖ పేర్కొంది. వాయువ్య, మధ్య, ఈశాన్య భారతదేశంలోని కొన్ని ప్రాంతాలు మినహా దేశంలోని చాలా ప్రాంతాలలో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని మోహాపాత్ర తెలిపారు. ఉత్తర భారతదేశంలో వర్షపాతం సాధారణం కంటే ఎక్కువగా ఉంటుందని అంచనా వేసింది. ఇది దీర్ఘకాలిక సగటు 64.1 మి.మీ కంటే 109 శాతం ఎక్కువ. మేలో తరచుగా ఉరుములతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో... ఉష్ణోగ్రతలు 2024 మేలో నమోదైన స్థాయికి చేరుకోకపోవచ్చు. ఏప్రిల్‌లో రాజస్థాన్, గుజరాత్ (6 నుంచి 11 రోజులు), తూర్పు మధ్యప్రదేశ్, విదర్భ (4 నుంచి 6 రోజులు) సాధారణం కంటే ఎక్కువ వేడిగాలులు నమోదయ్యాయి.

సరిహద్దులో ఉగ్రకుట్ర భగ్నం

భారీగా ఆయుధాలు స్వాధీనం

చండీగఢ్:
భారత్, పాకిస్థాన్ సరిహద్దులో ఉగ్ర కుట్ర భగ్నమైంది. అమృత్‌సర్ సమీపంలో బీఎస్‌ఎఫ్, పంజాబ్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో భారీగా ఆయుధాలు పట్టుబడ్డాయి. వాటిలో తుపాకులు, గ్రనేడ్లు ఉన్నాయి. పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్-పాక్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ సమయంలో సరిహద్దులో ఇలా పెద్దఎత్తున ఆయుధాలు పట్టుబడటం కలకలం రేపుతోంది బీఎస్‌ఎఫ్ ఇంటెలిజెన్స్ విభాగం సమాచారం మేరకు ఏప్రిల్ 30 సాయంత్రం ఈ ఆపరేషన్ నిర్వహించారు. అందులో భాగంగా ఆయుధాలను గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకొని పోలీసులకు అప్పగించారు. దీనిపై తదుపరి దర్యాప్తు నిర్వహించనున్నారు. బీఎస్‌ఎఫ్, పంజాబ్ పోలీసులు అత్యంత వేగవంతంగా, సమన్వయంతో వ్యవహరించడంతో ఈ ఉగ్ర కుట్ర భగ్నమైంది.

పాక్ ఎన్‌ఎస్‌ఏగా ఐఎస్‌ఐ చీఫ్ మాలిక్

ఇస్లామాబాద్:
జమ్మూకశ్మీర్, పహల్గాంలో ఉగ్రదాడి నేపథ్యంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల క్రమంలో పాకిస్థాన్ కీలక నిర్ణయం తీసుకుంది. ఇంటర్ సర్వీస్ ఇంటెలిజెన్స్ (ఐఎస్‌ఐ) డైరెక్టర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ మహమ్మద్ ఆసిమ్ మాలిక్‌కు జాతీయ భద్రతా సలహాదారు (ఎన్‌ఎస్‌ఏ) బాధ్యతలు అప్పగించింది. మలిక్ 2024 అక్టోబరులో ఐఎస్‌ఎస్ చీఫ్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు కేబినెట్ డివిజన్ నోటిఫికేషన్ జారీచేసింది. లెఫ్టినెంట్ జనరల్ మహమ్మద్ అసీమ్ మాలిక్ హెచ్‌ఐ (ఎం), డీజీ (ఐ) ఇప్పటి నుంచి జాతీయ భద్రతా సలహాదారుగా అదనపు బాధ్యతలను చేపడతారని నోటిఫికేషన్ పేర్కొంది. పాకిస్థాన్‌కు పదవ ఎన్‌ఎస్‌ఏగా మాలిక్ నియమితులయ్యారు. అయితే ఐఎస్‌ఎఫ్ చీఫ్‌కు ఈ బాధ్యతలు అప్పగించడం ఇదే మొదటిసారి. తెహ్రీక్ ఏ ఇన్సాఫ్ ప్రభుత్వం కుప్పకూలిన 2022 ఏప్రిల్ నుంచి ఎన్‌ఎస్‌ఏ స్థానం ఖాళీగా ఉంది. అప్పటివరకు డాక్టర్ మోయిద్ యూసుఫ్ ఈ బాధ్యతల్లో ఉన్నారు.

వాడవాడలా మేడే వేడుకలు

గుంటూరులో

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్రం ఎరుపెక్కింది. పల్లె, పట్నం తేడా లేకుండా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో వాడవాడలా సీపీఐ, ఏఐటీయూసీ పతాకాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా అరుణ పతాకాలు, ఫ్లెక్సీలు, జెండాలతో వీధులను అలంకరించారు. పట్టణాల్లో కూడళ్ళను తోరణాలతో ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. కార్మికులారా...ఏకం కండి, ప్రపంచ కార్మికుల ఐక్యత వర్థిల్లాల్లి అంటూ నినాదాలు హోరెత్తాయి. సీపీఐ, ఏఐటీయూసీ అనుబంధ సంఘాలకు చెందిన శ్రేణులు, వివిధ పరిశ్రమలు, సంస్థల్లో పనిచేసే కార్మికులు పెద్దసంఖ్యలో ఎర్రచొక్కాలు, మహిళలు ఎర్ర చీరలు ధరించి భారీ ప్రదర్శనలు నిర్వహించారు. కార్మిక హక్కులను హరించే ప్రభుత్వ, కార్పొరేట్ విధానాలను ఎండగట్టారు. ప్రాణాలైనా అర్పిస్తాం, కార్మిక హక్కులను కాపాడుకుంటామని నినదించారు. నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కార్మికుల ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు.

మేడే స్ఫూర్తితో శ్రామికవర్గ రాజ్య స్థాపనకు ప్రతిఒక్కరూ పునరంకితం కావాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ప్రపంచ కార్మికుల పర్వదినం 139వ మే డే సందర్భంగా గుంటూరులో నగర ముఠా కార్మిక సంఘం, సీపీఐ, ఏఐటీయూసీ నగర సమితుల ఆధ్వర్యంలో కనకతప్పెట్ల మోతల మధ్య తప్పెట్ల మోతల మధ్య ఏటుకూరు రోడ్డులోని రేగుల రాఘవయ్య భవన్ నుంచి మల్లయ్యలింగంభవన్ వరకు ప్రదర్శన చేపట్టారు. ముఠా కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు చల్లా చిన్న ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముప్పాళ్ల మాట్లాడుతూ రంగు, జాతి తేడా లేకుండా శ్రామిక దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా ఘనంగా జరుపుకుంటున్నారని అన్నారు. 18 గంటల శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా 8 గంటల పని దినం కావాలని 1886లో చికాగోలో ఒక మహత్తర ఉద్యమం జరిగిందన్నారు. ఆనాటి ప్రభుత్వ ధమనకాండలో చిందిన కార్మికుల రక్తం నుంచి ఎర్రజెండా ఉద్భవించిందని తెలియజేశారు. కేంద్రంలో నరేంద్ర మోదీ అధికారంలో ఉన్న ఈ 11 సంవత్సరాల కాలంలో కార్మికవర్గ దినసరి వేతనాలు తగ్గిపోయాయని, ధరలు అమాంతం పెరిగిపోయాయని దీంతో సామాన్యుడు బతకలేని పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులు సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 కోడ్‌లు పెట్టి 12 గంటల పనిదినం పెడుతున్న పరిస్థితి నెలకొందని అన్నారు. ఈ నేపథ్యంలో కార్మికవర్గం ఐక్యంగా ఉండి రాజకీయ అంశాలపై కూడా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సీపీఐ గుంటూరు నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, పులి సాంబశివరావు, జి.సురేష్ బాబు, రావుల అంజిబాబు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్లు దేశ ఆర్థికాభివృద్ధిలో చాలా కృషి చేస్తున్నారంటూ ప్రచార మధ్యమాలు అసత్య ప్రచారం చేస్తున్నాయని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. మేడే సందర్భంగా విశాఖపట్నం సీపీఐ జిల్లా కార్యాలయంలో అయన ఎర్ర జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇన్ఫోసిస్ అధినేత నారాయణమూర్తి కార్మికులు రోజుకు 12 గంటలు పనిచేయాలనడం దారుణమన్నారు. కార్మికులు రోజుకి 12 గంటలు పని చేయాలని బీజేపీ అధికారంలో ఉన్న ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాలు వొత్తిడి తెస్తే ఐఎల్‌ఓకి ఏఐటీయూసీ ఫిర్యాదు చేసిందని తెలిపారు.

సరిహద్దుల్లో అలజడి!

బంగ్లా, మైన్మార్ బోర్డర్లో హై అలర్ట్

న్యూఢిల్లీ:
భారత్, పాకిస్థాన్ సరిహద్దుల్లో అలజడి సృష్టించేందుకు వ్యూహ రచనలు జరుగుతున్నట్లు ఇంటెలిజెన్స్ సమాచారం ఇచ్చింది. దీంతో అప్రమత్తమైన కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే బంగ్లాదేశ్-మైన్మార్ సరిహద్దుల్లో హై అలర్ట్ ప్రకటించింది. పహల్గాం ఘటనతో భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధ వాతావరణం నెలకొన్నది. ఈ నేపథ్యంలో పాక్ ఐఎస్‌ఐ, సైన్యాధికారులు కొందరు బంగ్లాదేశ్-భారత్ సరిహద్దుల వైపునకు రావడం పెరిగింది. ఆ దేశంలోని రాడికల్ గ్రూపులతో పాక్ సంబంధాలు పెట్టుకొంటోంది. దీంతో బంగ్లా-భారత రాడికల్ గ్రూపులను పాకిస్థాన్ వాడుకొనే అవకాశాలున్నట్లు ఇంటెలిజెన్స్ వర్గాలు వెల్లడించాయి. రాడికల్ గ్రూపులను పాకిస్థాన్ ఐఎస్‌ఐ క్రియాశీలం చేసినట్లు తెలుస్తోంది. రెచ్చగొట్టి అల్లర్లు సృష్టించేందుకు యత్నిస్తోందని భారత నిఘా వర్గాలు హెచ్చరిస్తున్నాయి. హై సర్వైలెన్స్‌లో ఉన్నాయి. బంగ్లా సరిహద్దుల్లో భారత సైనిక దళాలు అప్రమత్తమయ్యాయి. షేక్ హసీనా పదవిలో ఉన్నంత వకు బంగ్లాదేశ్ మిత్రదేశంగా ఉంది. మహ్మద్ యూనస్ పదవిలోకి వచ్చినప్పటి నుంచి పాకిస్థాన్‌తో ఆ దేశానికి సంబంధాలు మెరుగవుతున్నాయి. దీంతో ఐఎస్‌ఐకి యూనస్ ప్రభుత్వ మద్దతు ఉందనే ఆరోపణ ఉంది. మరోవైపు బెంగాల్‌లో నకిలీ పాస్‌పోర్టుతో ఉన్న పాక్ జాతీయుడి అరెస్ట్ కలకలం రేపింది.

భారత్‌కు అమెరికా మద్దతు

న్యూఢిల్లీ:
ఉగ్రవాదం అణచివేతకు చేపట్టే చర్యలకు సంపూర్ణ మద్దతు ఇస్తామని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సేత్ గురువారం రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ఫోన్ చేశారు. పహల్గాం ఉగ్రదాడిలో అమాయకుల మరణంపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. భారతదేశానికి అమెరికా సంఘీభావం తెలుపుతోందన్నారు. భారతదేశ స్వీయ సంరక్షణ హక్కుకు అమెరికా మద్దతు ఎప్పుడు ఉంటుందని పీట్ హెగ్సేత్ భరోసానిచ్చారు. ఉగ్రవాదంపై భారత్ పోరాటానికి సంపూర్ణ మద్దతును పునరుద్ఘాటించారు. పాకిస్థాన్ అకృత్యాలని పీట్ హెగ్సేత్‌కు రాజ్‌నాథ్ వివరించారు. ఉగ్రవాద సంస్థలకు పాకిస్థాన్ మద్దతు, శిక్షణ ఇవ్వడం, నిధులు సమకూర్చడం గురించి తెలిపారు. అంతర్జాతీయ సమాజం ఇలాంటి దారుణాలను నిస్సందేహంగా ఖండించడం ప్రధానమని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.

సీఐడీ కస్టడీకి కసిరెడ్డి

- వారం రోజుల విచారణకు కోర్టు అనుమతి
- సిట్ అదుపులో మరో నిందితుడు దిలీప్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
మద్యం కుంభకోణం కేసులో కీలక నిందితుడు రాజ్ కసిరెడ్డిని సీఐడీ కస్టడీకి అనుమతిస్తూ కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈనెల 2వతేదీ నుంచి ఏడు రోజులపాటు విచారించేందుకుగాను న్యాయస్థానం అనుమతిచ్చింది. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం ఆరుగంటల వరకు కసిరెడ్డి విచారణకు కోర్టు అంగీకరించింది. మరోవైపు ఈ కేసులో కసిరెడ్డి పీఏ పైలా దిలీప్‌ను సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. రాజ్‌కసిరెడ్డిని విచారించడం ద్వారా మద్యం కుంభకోణం వెనకున్న సూత్ర ధారుల వివరాలను రాబట్టాలని సీఐడీ అధికారులు చూస్తున్నారు. ఇక కసిరెడ్డి పీఏ పైలా దిలీప్‌ను సిట్ అధికారులు పట్టుకున్నారు. దుబాయ్ పారిపోయేందుకు చెన్నై ఎయిర్ పోర్టుకు చేరుకున్న దిలీప్‌ను సిట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి పోలీసులు ఎదుట హాజరుకావాలని ఇప్పటికే సిట్ బృందం దిలీప్‌కు నోటీసులు జారీ చేయగా... బేఖాతరు చేశారు. దేశం విడిచి వెళ్లేందుకు దిలీప్ సిద్ధమయ్యారు. డిజిటల్, ఫోన్ లోకేషన్ ద్వారా దిలీప్ కదలికలపై దృష్టి పెట్టిన సిట్... ఆయన చెన్నై ఎయిర్‌పోర్టులో ఉన్నట్లు గుర్తించారు. విజయవాడ నుంచి అక్కడకు చేరుకున్న సిట్ అధికారులు దిలీప్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఇటీవల ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న కసిరెడ్డితోపాటు ఇద్దరు నిందితుల్ని పోలీసులు అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. మద్యం కుంభకోణానికి సంబంధించి కసిరెడ్డికి అనేకసార్లు సీఐడీ అధికారులు నోటీసులు జారీచేయగా... విచారణకు డుమ్మా కొడుతూ తప్పించుకుని తిరిగేందుకు ప్రయత్నిస్తున్నారు. దుబాయ్ నుంచి హైదరాబాద్‌కు వస్తున్నట్లు తెలుసుకున్న పోలీసులు శంషాబాద్ ఎయిర్‌పోర్టులోనే అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఆ తరువాత అక్కడి నుంచి విజయవాడకు తీసుకువచ్చి సిట్ అధికారులు విచారించారు. ఈ సందర్భంగా కీలక సమాచారం రాబట్టినట్లు తెలుస్తోంది. ఈ కేసులో సిట్ సేకరించిన అనేక ఆధారాలు, మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి విచారణలో చెప్పిన సమాచారంతో సిట్ అధికారులు ప్రశ్నలు అడిగినట్లు సమాచారం. తొలుత అధికారులకు కసిరెడ్డి సహకరించలేదని, రెండో విడత విచారణలో కొన్ని ఆధారాలతో సిట్ అధికారులు ప్రశ్నించగా... కొన్నింటికి సమాధానాలు చెప్పి..మిగిలిన వాటిని దాటవేసినుట్ల తెలిసింది. సిట్ విచారణ అనంతరం విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో కసిరెడ్డికి వైద్య పరీక్షల అనంతరం కోర్టులో హాజరుపరిచారు. కసిరెడ్డికి 14 రోజుల పాటు న్యాయస్థానం రిమాండ్ విధించింది. మరోవైపు ఈకేసులో ముందస్తు బెయిల్ కోసం కసిరెడ్డి హైకోర్టును ఆశ్రయించగా...అక్కడా ఆయనకు ఎదురుదెబ్బ తగిలింది. కసిరెడ్డి పిటిషన్‌పై విచారణను హైకోర్టు వాయిదా వేసింది.

పెరిగిన ఏపీ జీఎస్టీ వసూళ్లు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
ఏపీలో జీఎస్టీ వసూళ్లు సరికొత్త రికార్డు నెలకొల్పాయి. 2025 ఏప్రిల్‌కు గాను రికార్డు స్థాయిలో రూ.3,354 కోట్లు వసూళ్లు నమోదైనట్లు చీఫ్ కమిషనర్ బాబు ఓ ప్రకటనలో తెలిపారు. జీఎస్టీ అమల్లోకి వచ్చిన తర్వాత ఒక నెలలో ఇంత భారీ మొత్తం వసూలు కావడం ఇదే తొలిసారి. గత ఏడాది నవంబర్, డిసెంబర్‌లో కాస్త వెనుకడుగు వేసినట్లు కనిపించినా... 2025 మొదటి త్రైమాసికంలో జీఎస్‌టీ ఆదాయం క్రమంగా పెరుగుతూ వచ్చింది. గత ఏడాది ఏప్రిల్‌తో పోలిస్తే ప్రస్తుత వసూళ్లలో భారీగా వృద్ధి నమోదైంది. పన్నుల ఆదాయం ఇలా పెరుగుతూ పోతే రాష్ట్రం ఆర్థికంగా మరింత శక్తివంతం అవుతుందనడంలో ఎలాంటి సందేహం లేదని ఆయన పేర్కొన్నారు. ఐజీఎస్‌టీ సెటిల్‌మెంట్ కూడా రికార్డు స్థాయిలో రూ.1,943 కోట్లు వచ్చింది.

బాబా రాందేవ్‌పై దిల్లీ హైకోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ:
ప్రముఖ యోగా గురువు బాబా రాందేవ్‌పై దిల్లీ హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. హమ్‌దార్ద్ సంస్థకి చెందిన రూ అఫ్జాపై మరో వీడియో విడుదల చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. అలా చేయకూడదని తాము ఆదేశించినప్పటికీ... అవమానకరరీతిలో రూ అఫ్జాపై రామ్‌దేవ్ మరో కొత్త వీడియోను రూపొందించారని, ఇది కోర్టు ధిక్కారం కిందకు వస్తుందని పేర్కొంది. రాందేవ్ కొత్త వీడియో విషయాన్ని హమ్‌దార్ద్ సంస్థ తరఫున న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. దానికి జస్టిస్ అమిత్ బన్సాల్ తీవ్రంగా స్పందిస్తూ... రామ్‌దేవ్ ఎవరి నియంత్రణలో లేరని ఆయన ప్రవర్తనను బట్టి అర్థమవుతోంది. ఆయన తన సొంత ప్రపంచంలో బతుకుతున్నారు అని వ్యాఖ్యానించారు. ఆయన తన ఆలోచనలను తనలోనే ఉంచుకోవాలని, వాటిని బయటకు వ్యక్తపరచవలసిన అవసరం లేదని జడ్జి వ్యాఖ్యానించారు. గతంలో ఇచ్చిన ఆదేశాలను ఆయన ఉల్లంఘించారనేది స్పష్టం అవుతోందని... కోర్టు ధిక్కరణ కింద ఆయనకు తమ ఎదుట హాజరు కావాలని నోటీసులు జారీ చేస్తామని వ్యాఖ్యానించారు. ఈ క్రమంలో... తాజా వీడియోలను సోషల్ మీడియా అన్ని ప్లాట్‌ఫాంల నుంచి తొలగిస్తామని రాందేవ్ తరపు న్యాయవాది కోర్టుకు తెలిపారు. వారంలోపు అఫిడవిట్ దాఖలు చేయాలని... ఈ పిటిషన్‌పై శుక్రవారం మరోసారి వాదనలు వింటామని జస్టిస్ అమిత్ బన్సాల్ తెలిపారు. పతంజలికి చెందిన గులాబ్ షర్బత్‌ను ప్రచారం చేసే క్రమంలో... హయ్‌దార్ద్ రూఅఫ్జాను తక్కువ చేస్తూ బాబా రామ్‌దేవ్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రూఅఫ్జా ద్వారా వచ్చే ఆదాయాన్ని మదర్సాలు, మసీదుల నిర్మాణానికి నిధులు సమకూర్చేందుకు వినియోగిస్తున్నారని రామ్‌దేవ్ ఆరోపించారు. షర్బత్ జీహాద్ అంటూ రూఅఫ్జాపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. అవి టాయిలెట్ క్లీనర్‌లని, వాటి నుంచి ప్రజలను రక్షించడమే తమ ఉద్దేశమంటూ వ్యాఖ్యానించారు. అలాగే.. అదే ఈ గులాబ్ షర్బత్ (పతంజలి సంస్థకు చెందిన పానీయం) తాగితే.. గురుకులాలను నిర్మించవచ్చు. పతంజలి విశ్వవిద్యాలయాన్ని విస్తరించవచ్చని మాట్లాడారు. ఈ వ్యాఖ్యలపై విచారణ చేపట్టాల్సిందిగా హమ్‌దార్ద్ కోర్టును ఆశ్రయించింది. రామ్‌దేవ్ వ్యాఖ్యలు సమర్థించలేనివని, దిగ్భ్రాంతికి గురిచేశాయని ఏప్రిల్ 22న విచారణ సందర్భంగా దిల్లీ హైకోర్టు కోర్టు వ్యాఖ్యానించింది. ప్రకటనలు, సోషల్‌మీడియా పోస్టులతో సహా ఆన్‌లైన్ కంటెంట్‌ను వెంటనే తొలగిస్తామని రామ్‌దేవ్ తరఫున న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఈహామీని ధృవీకరిస్తూ అఫిడవిట్ సమర్పించాలని కోర్టు ఆదేశించింది. అయినా కూడా ఆయన మరో వీడియో విడుదల చేయడంతో కోర్టు అగ్గిమీద గుగ్గిలమైంది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No.148108 (TEL TEL/2017/75553), Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.